RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:5 హైదరాబాద్, గురువారం, 20 జూన్ 2024 పేజీలు: 12 వెల: 1.00

## కశ్మీర్‌లో మోదీ యోగా..

## 7వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమ్మూకశ్మీర్‌లోనిర్వహించనున్న కార్యక్రమంలో పాల్గొననున్నారు. దాల్ సరస్సు ఒడ్డున మోదీ యోగా చేయనుండగా.. ఆ కార్యక్రమంలో దాదాపు ఏడు వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని పర్యవేక్షించిన జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా.. యోగా డే సందర్భంగా మోదీ కశ్మీర్ లోయకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

"కశ్మీర్ ప్రజలతో మోదీకి మంచి అనుబంధం ఉంది. అందుకే ఆయన ఇక్కడికి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మోదీ రాక మాకెంతో గర్వకారణం. ఆ రోజు జరగబోయే కార్యక్రమంలో ఆయనతో పాటు 7 వేల మందికి పైగా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని మనోజ్ సిన్హా పేర్కొన్నారు.



"గత పదేళ్లలో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై యోగా ఎంతో గుర్తింపు పొందింది. ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాల్లో 23.5 కోట్ల మందికి పైగా పాల్గొన్నారు. ఏటా యోగా చేసే వారి సంఖ్య పెరగడం హర్షణీయం. ఒత్తిడి లేని ప్రశాంతమైన జీవితం కోసం ప్రజలు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు" అని జమ్మూకశ్మీర్ ఎల్‌జీ వెల్లడించారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లో ఇటీవల వరుస ఉగ్ర ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళనకు గురిస్తోంది.

దీంతో ఈ నెల 29న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని సిన్హా పేర్కొన్నారు.

## 21న తెలంగాణ మంత్రివర్గ సమావేశం..

## రుణమాఫీపై చర్చించే అవకాశం

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 21న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సచివాలయంలో జరగనుంది. ఆగస్టు 15లోగా రైతు పంట రుణాల మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. ప్రధానంగా ఇదే అంశంపై క్యాబినెట్‌లో చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రుణమాఫీకి సుమారు రూ.30వేల కోట్లు, రైతుభరోసాకు మరో రూ.7వేల కోట్లు అవసరమవడంతో.. నిధుల సేకరణ ఎలా అనే అంశంపైనా మంత్రివర్గంలో చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు. అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ రూపకల్పన, పంటల బీమాపైనా క్యాబినెట్ చర్చించనున్నట్లు తెలిసింది.



## దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న

## రాష్ట్రం తెలంగాణ: భట్టి విక్రమార్క



హైదరాబాద్: దేశంలో తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన 41వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాధారిత పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలను క్లస్టర్లుగా విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. ధాన్యం, మొక్కజొన్న పంట ఉత్పత్తులకు డిమాండ్ రాబోతుందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు తమ మొదటి ప్రాధాన్యమని భట్టి విక్రమార్క వివరించారు.

ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచాలని నిర్ణయించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ పండిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు బ్యాంకులు రుణాలు పెంచాలని తెలిపారు. దశాబ్దాలుగా రైతే రాజు అంటున్నామని, కానీ బ్యాంకు గణాంకాలు చూస్తే భయం వేస్తోందని పేర్కొన్నారు. బహుళజాతి, ఇన్‌ఫ్రా కంపెనీలకు రూ.వేల కోట్ల రుణాలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు రుణాలు ఇవ్వడానికి మాత్రం బ్యాంకులు వెనకడుగు వేస్తున్నాయన్నారు. పెద్దలకు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయం ఉండకూడదని చెప్పారు. నిబంధనల ప్రకారమే బ్యాంకర్లు వ్యవహరించాలని సూచించారు.

## నకిలీ బెదిరింపు కాల్స్ చేస్తే..

## ఐదేళ్ల పాటు నిషేధం..

దిల్లీ: ఇటీవల కాలంలో విమానాశ్రయాలు, విమానయాన సంస్థలకు నకిలీ బాంబు కాల్స్ తరచూ వస్తున్నాయి. దాంతో యాజమాన్యాలు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టడానికి ది బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ కఠిన చర్యలు తీసుకునే దిశగా ఆలోచనలు చేస్తోంది. నకిలీ కాల్స్ కేసుల్లో దోషులుగా తేలితే.. ఐదేళ్ల పాటు విమానాల్లో ప్రయాణించకుండా నిషేధం విధించాలని



యోచిస్తున్నట్లు బీసీఏఎస్ వెల్లడించింది. ఈ ప్రతిపాదనను పౌర విమానయాన మంత్రిత్వశాఖ ముందు ఉంచనున్నట్లు తెలిపింది. ఈ విషయంలో ప్రస్తుతం మూడు నుంచి ఆరు నెలల నిషేధం మాత్రమే ఉంది. నిందితులు ఏ ఎయిర్‌లైన్‌కు అయితే బెదిరింపులు చేశారో.. దానివరకు మాత్రమే ఆ నిబంధన వర్తిస్తోంది. అయితే అన్ని సంస్థల విమానాలకు దీనిని వర్తింపజేయాలని బీసీఏఎస్ చూస్తోంది.

ఇదిలాఉంటే.. నిన్న దేశవ్యాప్తంగా 41 విమానాశ్రయాలకు ఒకే రోజు బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. ఈ బెదిరింపుల కారణంగా కొన్ని గంటలపాటు విమానాశ్రయాల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. మధ్యాహ్న సమయంలో ఒకే మెయిల్ ఐడీ నుంచి హైదరాబాద్ సహా అన్ని విమానాశ్రయాలకు మెయిళ్లు వచ్చాయి. 'కేఎన్ఆర్' అనే ఆన్‌లైన్ గ్రూపు ఈ బెదిరింపు మెయిళ్ల వెనక ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. చెన్నై నుంచి ముంబయి వెళ్లే ఇండిగో విమానానికి కూడా ఈ తరహా కాల్ వచ్చింది. అయితే అవన్నీ ఉత్తుత్తివే అని అధికారులు తేల్చారు.

## పీఎం కిసాన్ నిధుల విడుదల

## రైతుల ఖాతాలోకి రూ.20 వేల కోట్లు

వారణాసి

రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన -కిసాన్ సమ్మాన్‌నిధి 17వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని తన సొంత నియోజకవర్గమైన వారణాసిలో మంగళవారం నిర్వహించిన, పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్, కార్యక్రమంలో విడుదల చేశారు. దీంతో దాదాపు 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2వేలు చొప్పున రూ.20 వేల కోట్లు జమ కానున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో విజయం, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారణాసిలో మోదీ పర్యటించడం ఇదే తొలిసారి.

నరేంద్ర మోదీ ఈనెల 9వ తేదీన వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజు పీఎంవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన. పీఎం కిసాన్ 17వ వాయిదా చెల్లింపు దస్త్రంపైనే తొలి సంతకం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి ఈ పథకం అమలు చేస్తోంది. దీనికింద అర్హులైన రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6 వేలు పెట్టుబడి సాయంగా ఇస్తోంది

## భారత్ అసాధారణ ప్రయాణం వెనుక

## మన్మోహన్, మోదీ...

### గౌతమ్ అదానీ ప్రశంసల జల్లు

ముంబై: ఇండియా 'అసాధారణ ప్రయాణం' వెనుక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 'హ్యాట్రిక్' ప్రధాని నరేంద్ర మోదీ గణనీయమైన కృషి చేశారని భారతదేశ దిగ్గజ వ్యాపారవేత్త, అదానీ గ్రూప్ సంస్థల చైర్మన్ గౌతమ్ అదానీ కొనియాడారు. 1991లో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు సరళీకరణ విధానం ( ప్రకటించంతో ఇండియా 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టోరీ' మొదలైందని, అది గత దశాబ్దంలో 'టేకాఫ్' అయిందని చెప్పారు. ముంబైలో




జరిగిన సీఆర్ఐఎస్ఐఎల్ కార్యక్రమంలో అదానీ మాట్లాడుతూ, భారత్ అసాధారణ ప్రయాణంలో 1991 నుంచి 2014 వరకూ 'రన్‌వే' నిర్మాణానికి గట్టి ఫౌండేషన్ పడిందని, 2014 నుంచి 2024 వరకూ విమానం దూసుకెళ్లిందనిఅన్నారు.

మన్మోహన్ సింగ్ అప్పటి వరకూ ఉన్న 'లైసెన్స్ రాజ్' విధానానికి తెరదించి ఆర్థిక సరళీకరణ విధానాన్ని తీసుకువచ్చారని, గత విధానంలో వ్యాపారులు పెట్టాలంటే ఎన్నో అనుమతులు అవసరమయ్యేవని, పెట్టుబడులు పెట్టాలన్నా, ధరలు నిర్ణయం విషయంలోనూ ఆంక్షలు ఉండేవని, సరళీకరణ విధానంతో ఆ అవరోధాలు తొలగాయని చెప్పారు. గత దశాబ్ద కాలంలో మౌలిక వసతుల కల్పనారంగంలో గణనీయమైన ప్రగతి సాధించామని అన్నారు. క్వాలిటీ ఆఫ్ గవర్నర్ ఇందుకు ఎంతో దోహదపడిందని, దేశ ముఖచిత్రమే మారిపోయిందని చెప్పారు. నేషనల్ ఇంటిగ్రేటెడ్ పైప్‌లైన్ (ఎన్ఐపీ)పై మాట్లాడుతూ, పబ్లిక్, ప్రైవేటు రంగం పెట్టుబడుల రెండిటి పార్టిసిపేషన్ ఇందులో కీలకమన్నారు. 2020-25కు ప్రాజెక్టెడ్ ఇన్వెస్టిమెంట్ రూ.111 లక్షల కోట్ల పైమాటేనని చెప్పారు. దేశవ్యాప్తంగా ఎనర్జీ, లాజిస్టిక్స్, వాటర్, విమానాశ్రయాలు, సోషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి 9,000 ఇన్‌ఫ్రాస్టుకర్చర్ ప్రాజెక్టులు కార్యరూపంలోకి వస్తాయన్నారు. ఎనర్జీ ట్రాన్సిషన్ స్పేస్ రంగంలో అదానీ గ్రూప్ 100 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలనే యోచనలో ఉందని గౌతమ్ అదానీ తెలిపారు.

## ఇంటర్ పాఠ్యపుస్తకాలు అందించకపోవడం

## బాధ్యతారాహిత్యం: హరీశ్‌రావు

హైదరాబాద్: తెలంగాణలో జూనియర్ కళాశాలలు ప్రారంభమై 19 రోజులు అవుతున్నా, ఇప్పటివరకు ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించకపోవడం బాధ్యతారాహిత్యమని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్(ట్విటర్)లో పోస్టు చేశారు.

422 జూనియర్ కళాశాలల్లో 1.60 లక్షల మంది పేద, బలహీన వర్గాల వారు చదువుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. వారికి నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని.. జూనియర్ కళాశాలల్లో ఉన్న 1,654 గెస్ట్ ఫ్యాకల్టీని రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన జూనియర్ కాలేజీల్లో పోస్టులు మంజూరు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.



భారత శక్తి

గురువారం, 20 జూన్ 2024

# వైసీపీకి కాంగ్రెస్ టెన్షన్

కడప, జూన్ 19,

ఏపీలో మాత్రం ఎవరూ ఊహించని విధంగా వైసీపీని కాంగ్రెస్ పార్టీ కమ్మేస్తుందనే అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. కాంగ్రెస్ అగ్రనేతలను కలిశారు. వారి మధ్య ఏపీలో పార్టీ బలోపేతంపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ పెర్ఫార్మెన్స్ బాగుందనే అభిప్రాయాన్ని అగ్రనేతలు షర్మిల దగ్గర వ్యక్తం చేశారని ప్రచారం జరుగుతోంది. రాయలసీమలో మెజారిటీ ముస్లింల ఓట్లు కాంగ్రెస్‌కు పట్టాయి. సీమలో వైసీపీ ఘోర పరాభవానికి కాంగ్రెస్ కారణమని ఆ పార్టీ అధిష్టానం నమ్ముతోంది. రాష్ట్రవ్యాప్తంగా గతంలో తమకు సాంప్రదాయంగా ఉన్న ఓటు బ్యాంక్ మళ్లీ కాంగ్రెస్ వైపు మళ్లిందని అభిప్రాయపడుతున్నారు. ఈ ఐదేళ్లు కష్టపడితే.. 2029 నాటికి ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా.. సీట్లు కూడా తెచ్చుకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు. దీంతో.. వైసీపీలో అసంతృప్తిగా ఉన్నవారికి గాలం వేసే పనిలో కాంగ్రెస్ పడింది.జగన్ నియంతృత్వ పోకడలతో ఉక్కపోతకు గురైనవారు, వైసీపీలోనే ఉంటే భవిష్యత్ శూన్యం అవుతుందని భావించిన వారు కాంగ్రెస్ వైపు చూస్తారని ఓ అంచనా. అలాంటివారిని డైరెక్ట్‌గా సంప్రదించాలని సోనియా, రాహుల్.. షర్మిలకు చెప్పినట్టు తెలుస్తోంది. తలకిందుల తపస్సు చేసినా వైసీపీ ఓటు బ్యాంక్ టీడీపీ, జనసేన, బీజేపీ వైపు సిఫ్ట్ అవ్వదు. ముస్లింలు, ఎస్సీ, ఎస్సీలు ఎక్కువగా కాంగ్రెస్ తోనే ఉంటారు.కాంగ్రెస్ స్థానంలో



వైసీపీ వచ్చింది కాబట్టి.. ఆ పార్టీ వైపు సిఫ్ట్ అయ్యారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ బలపడితే.. ఆ ఓటు బ్యాంక్ తమ వైపు తిప్పుకోవచ్చని కాంగ్రెస్ అంచనా వేస్తుంది. పైగా వైసీపీలో ఉంటే నాయకులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే పరిస్థితి ఉండదు. అదే కాంగ్రెస్ లో చేరితే స్వాతంత్ర్యం ఎక్కువ. తెలంగాణలోని బీఆర్ఎస్ పరిస్థితే ఏపీలో వైసీపీకి పట్టేలా ఉంది. మరో ఏడాదిలో ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ పెర్ఫార్మెన్స్ సరిగా లేకపోతే గ్రౌండ్ లెవెల్ ఓటు బ్యాంక్ మొత్తం కాంగ్రెస్ కు సిఫ్ట్ అయ్యే అవకాశం ఉంది.దీనికి తోడు.. పక్కనే ఉన్న తెలంగాణ, కర్నాటకలో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉండటం, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలం పుంజుకోవడం ఏపీలో కలిసి వస్తుందనే అభిప్రాయాన్ని సీనియర్లు వ్యక్తం చేస్తున్నారు. లోకల్ బాడీ ఎన్నికల వరకూ గ్రౌండ్ లెవెల్ లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తే.. ఆ తర్వాత వైసీపీ క్యాడర్ కాంగ్రెస్ లోకి వచ్చే ఛాన్సెస్ లేకపోలేదు. ఏపీలో కాంగ్రెస్ బలపడటాన్ని పరోక్షంగా చంద్రబాబు కూడా స్వాగతిస్తారు. కాంగ్రెస్ బలపడితే ప్రత్యర్థి బలహీనపడినట్టే.. అది టీడీపీకి లాభం చేస్తుంది. ఈ వ్యూహంలో భాగంగా చంద్రబాబు కాంగ్రెస్ బలపడటాన్నే కోరుకుంటారు. మొత్తానికి జగన్ కు ఇప్పుడు అన్ని సుడిగుండాలే కనిపిస్తున్నాయి.అయితే.. జగన్ ఈ విషయాన్ని గ్రహించే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. ఏపీలో ఫలితాలు వచ్చి 2 వారాలు అవుతున్నా.. ఇంతవరకూ ఈవీఎంల ట్యాపంరింగ్ పై స్పందించని జగన్ .. సడెన్‌గా ట్వీట్ చేశారు. బ్యాలెట్ బాక్సుల ద్వారానే ఎన్నికలు జరగాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో వైసీపీకి 151 సీట్లు వచ్చినపుడు ఈ ట్యాంపరింగ్ అంశం గుర్తు రాలేదేమో కానీ.. ఇప్పుడు 11 సీట్లు వచ్చినపుడు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.అయితే.. ఇదంతా ట్యాంపరింగ్ గురించి కాదని కొంతమంది అంటున్నారు. కాంగ్రెస్ కూడా ఇప్పుడు ఈవీఎంల అంశాన్ని తెరపైకి తెస్తుంది. కాంగ్రెస్‌కు లేవనెత్తిన అంశానికి మద్దతు పలికితే ఆ పార్టీ ఏపీలో ఆపరేషన్ ఆకర్ష్ ని నిలిపివేస్తుందని జగన్ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే.. ఏ రాజకీయ పార్టీ అయినా పార్టీని పెంచుకోవడానికే చూస్తారు. జగన్ అంశాల వారీగా తమకు మద్దతిచ్చాడని సొంతపార్టీ బలోపేతం కాకూడదని ఎవరూ అనుకోరు.

## కేసీఆర్ బాటలో జగన్

విజయవాడ, జూన్ 19,

వైసీపీ అధినేత జగన్ గురించి ఆసక్తికరమైన వార్త హంగామా చేస్తోంది. ఎన్ని కల ఫలితాల తర్వాత రెండు రోజులు మౌనంగా ఉన్నారు. వరుసగా వివిధ ప్రాంతాల నేతలతో మంతనాలు చేశారు. ఎక్కడ ఓడిపోయామన్న దానిపై నేతల నుంచి వివరాలు సేకరించారు.కొత్త ప్రభుత్వ వ్యవహారశైలిని జాగ్రత్తగా గమనిస్తున్నారు మాజీ సీఎం జగన్. ఇప్పుడున్న పరిస్థితుల్లో అధికార పార్టీకి వీలైనంత దూరంగా ఉండాలని ఆలోచన చేస్తున్నారని సమాచారం. బుధవారం నుంచి మూడురోజుల పులివెందులకు వెళ్తున్నారు మాజీ సీఎం. కొద్దిరోజులపాటు రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మళ్లీ 22న తాడేపల్లికి రానున్నారు.పులివెందుల



నుంచి రాగానే వైసీపీ నేతలందరితో సమావేశానికి ప్లాన్ చేశారు వైసీపీ అధినేత. ఈసారి నేతల నుంచి అవుట్‌పుట్ తీసుకోవాలన్నది అధినేత ఆలోచనగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీలో జరిగే ప్రమాణ కార్యక్రమానికి జగన్ రావడం కష్టమనే అభిప్రాయం ఆ పార్టీల నేతల నుంచి వ్యక్తమవుతోంది. ఎందుకంటే ఈనెల 21, 22 అసెంబ్లీ సమావేశం కానుంది. తొలిరోజు సభ్యుల ప్రమాణం, రెండోరోజు స్పీకర్ ఎంపిక జరగనుంది.ఎందుకంటే వైసీపీకి ఉన్నది కేవలం 11 మంది మాత్రమే. అసెంబ్లీలో అధికార పార్టీ నేతల సెటైర్లు, కామెంట్స్ చేస్తారని భావించి దూరంగా ఉండాలని అంటున్నారట. ఈ విషయంలో కేసీఆర్ అనుసరిస్తున్న మార్గంలో ఆయన నడవాలన్నది అసలు సారాంశం. ఈ లెక్కన జగన్ అసెంబ్లీకి రావడం అనుమానమేనని అంటున్నారు. వీలు చూసుకుని స్పీకర్ ఛాంబర్‌కి ప్రమాణ స్వీకారం చేస్తే సరిపోతుందని అంటున్నారు.గత ప్రభుత్వంలో చేసిన అవినీతి చిట్టాను చాలావరకు అధికార పార్టీ రెడీ చేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అసెంబ్లీకి వెళ్లడం కంటే దూరంగా ఉంటే బెటరని అంటున్నారు. దీనిపై పులివెందుల టూర్‌లో జగన్ ఓ నిర్ణయం తీసుకోవచ్చని అంటున్నారు. ఒకవేళ అధినేత రాకపోయినా, మిగతా ఎమ్మెల్యేలు హాజరై ప్రమాణ కార్యక్రమంలో పాల్గొంటారని అంటున్నారు.

## జగిత్యాలలో వింత కోడి

కరీంనగర్, జూన్ 19,

: జగిత్యాల జిల్లాలో వింత కోడి జనాల్ని ఆకట్టుకుంటోంది. యాజమాని చెప్పినట్టు వింటుంది. మనిషి చెప్పే మాటలు విని పాటిస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. కడక్ నాథ్ కోడి ఖతర్నాక్ కోడి అనిపించుకుంటుంది.వివరాల్లోకి వెళ్ళితే జగిత్యాల మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి మినీ కోళ్ళ ఫారం నిర్వహిస్తు ఉపాధి పొందుతున్నాడు. అందులో 200 వరకు కడక్ నాథ్ రకం కోళ్ళను పెంచుతున్నాడు. అందులో ఓ కోడి వింతగా ప్రవర్తిస్తుంది. మల్లారెడ్డి చెప్పినట్లు వింటుంది. మల్లారెడ్డి తో స్నేహపూర్వకంగా ప్రవర్తిస్తుంది. రమ్మంటే వస్తుంది. పొమ్మంటే దూరంగా పోతుంది. పో అనగానే ముందుకు ఉరుకుతుంది.వెనక్కి రా అంటే వెంటనే వెనక్కి వచ్చేస్తుంది. యాజమాని మల్లారెడ్డి భుజాల పైకి ఎక్కి తన అప్యాయతను చాటుకుంటుంది. చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మల్లారెడ్డి సైతం ఆ కోడి పట్ల అమితమైన అభిమానాన్ని చాటుకుంటున్నారుమనిషి చెప్పినట్లు వింటూ వింతగా ప్రవర్తిస్తున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దాన్ని చూసేందుకు జనం వస్తున్నారు. కోడి కావాలని కోరుకునే వారు కూడా లేకపోలేదు. యజమాని మాత్రం ఆ కోడిని విక్రయించడానికి నిరాకరిస్తున్నాడు. తాను చెప్పినట్లు వింటూ తనతో స్నేహపూర్వకంగా ప్రవర్తిస్తున్న కోడి బతికినంత కాలం తన ఫామ్ లోనే ఉంటుందంటున్నారు. ఇలాంటి కోడి దొరకడం అరుదని చిన్నప్పటి నుంచి తాను చెప్పినట్లు విని ఇప్పుడు అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుందని తెలిపారు.ఎవరైనా ఏదైనా చెప్తే క్షణాల్లో మర్చిపోతే కోడి మైండ్ అంటూ నిందిస్తారు. ఎందుకంటే కోడి బూడిదలో పొర్లినప్పుడు వచ్చే ఆలోచన బయటకు వచ్చి బూడిద దులిపితే అంతా మరిచిపోతుందట.అందుకే కోడికి ఏది గుర్తుండదు కాబట్టి మనిషి కూడా మర్చిపోతే కోడి మైండోడా అంటారు. కానీ ఇప్పుడు లక్ష్మీపూర్ లో కడక్ నాథ్ కోడి యవ్వారాన్ని చూసిన తర్వాత దానిది కోడి మైండ్ కాదు మనిషి మైండేనని భావించే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఆ కోడి కడక్ నాథ్ కోడి కాదు, ఖతర్నాక్ కోడి అంటున్నారు.

## అవిశ్వాసానికి పావులు

### బిఆర్ఎస్ బిజెపి కార్పొరేటర్లు బుధవారం రహస్య సమావేశం

వరంగల్ గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు టిఆర్ఎస్ కార్పొరేటర్లు పావులు కలుపుతున్నారు. బిజెపి కార్పొరేటర్ మరి కొంతమంది అధికార కాంగ్రెస్ వారిని పార్టీని కలుపుకొని అవిశ్వాస తీర్మానం పెట్టాలని పట్టుదలతో మంతనాలు సాగిస్తున్నారు దీనిలో భాగంగానే బుధవారం టిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్భాస్కర్, తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, డిప్యూటీ మేయర్ రిజ్వాన్ షమీం మసుద్ తో పాటు పలు డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు సమావేశం అయ్యారు. ప్రస్తుతం పాలకమండలి లో బి ఆర్ ఎస్ కు 22 మంది కార్పొరేటర్లు ఉండగా బిజెపికి 10 మంది, కాంగ్రెస్కు 34 మంది ఉన్నారు. అవిశ్వాస తీర్మానంపై నోటీసు ఇవ్వాలంటే 36 మంది కార్పొరేటర్లు సంతకాలు పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం టిఆర్ఎస్ బిజెపి కార్పొరేటర్లతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కలిసి వస్తేనే అవిశ్వాసం తీర్మానం పెట్టే పరిస్థితి ఉంటుంది.

## లోకసభ స్పీకర్ పదవిపై టీడీపీ ఆశలు

న్యూఢిల్లీ, జూన్ 19

లోక్ సభ సమావేశాలకు రంగం సిద్ధమయింది. ఇప్పుడు అందరి దృష్టి లోక్ సభ స్పీకర్ ఎన్నికపై ఉంది. ఈ అంశంపై చర్చించేందుకు బీజేపీ సీనియర్ నేతలు సమావేశం అయ్యారు. స్పీకర్ ఎవరు .. ఏ పార్టీకి చాన్స్ ఇస్తారు అన్నదానిపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ లోక్ సభ లో సొంత బలం లేకపోవడంతో మిత్రపక్షాల బలంతో ప్రభుత్వాన్ని నడుపుతోంది. అందుకే టీడీపీ, జేడీయూ తమకు స్పీకర్ పదవి కావాలని కోరుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. స్పీకర్ పదవిని టీడీపీకి ఆఫర్ చేశారని మొదట్లో ప్రచారం జరిగింది. కానీ టీడీపీ అధినేత ఎప్పుడూ ఈ అంశంపై మాట్లాడలేదు. పదవల కోసం తాము ఎలాంటి డిమాండ్లు పెట్టలేదని ఆ పార్టీ నేతలు ప్రకటించారు. కానీ జాతీయ మీడియాలో మాత్రం స్పీకర్ పదవి కావాలని అడుగుతున్నారని చెబుతున్నాయి. కానీ బీజేపీ మాత్రం సంకీర్ణ రాజకీయాల్లో స్పీకర్ పాత్ర అత్యంత కీలకం కాబట్టి స్పీకర్ పదవిని మిత్రపక్షాలకు ఇచ్చే ఉద్దేశం లేదని కావాలంటే డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తామని ప్రతిపాదిస్తున్నట్లుగా చెబుతున్నారు. చంద్రబాబు కూడా స్పీకర్ పదవికి పట్టుబట్టే అవకాశం లేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కానీ స్పీకర్ పదవి ఏపీకి దక్కే అవకాశాలు ఉన్నాయని ఢిల్లీలో పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. రాజమండ్రి లోక్ సభ సభ్యురాలు పురందేశ్వరి పేరును స్పీకర్ పదవికి పరిశీలిస్తున్నారని అంటున్నారు. ఒకప్పుడు నేషనల్ ఫ్రంట్ తో రాజకీయాల్లో చక్రం తిప్పి.. ఇందిరాగాంధీపై పోరాడిన ఎన్టీఆర్



కుమార్తె కావడంతో ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందని భావిస్తున్నారు. పురందేశ్వరి ఎంపిక విషయంలో టీడీపీ కూడా అభ్యంతరం చెప్పకపోవచ్చని అంటున్నారు. అదే సమయంలో ఒడిషా నుంచి కూడా స్పీకర్ పదవికి రేసులో ఉన్న వారి పేర్లు బయటకు వస్తున్నాయి. బీజేపీకి చెందిన ఎంపి మహతాబ్ పేరు కూడా పరిశీలిస్తున్నారు. ఆయన బీజేడీలో చాలా కాలం ఉన్నారు. బీజేపీలో చేరి ఎంపీ అయ్యారు. అక్కడ మంచి మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వచ్చింది. జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నికపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్ సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఇండియా కూటమి పోటీ చేసే అవకాశాలు కనిపించడం లేదు. అయితే టీడీపీ అభ్యర్థిని నిలబెడితే మాత్రం మద్దతిస్తామని ఇండియా కూటమి నేతలు చెబుతున్నారు.

====================

## మీ సేవలో మరిన్ని సేవలు

నెల్లూరు, జూన్ 19,

సీపీ సర్కారు వచ్చాక ఏపీలో మీసేవ పోర్టల్ లో చాలా రకాల సేవలు తగ్గాయన్న విమర్శ ఉంది. సచివాలయ వ్యవస్థతో మీసేవ కేంద్రాల్లో సేవలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మీసేవ పోర్టల్ లో చాలా సేవలను చేర్చింది. నేషనల్ ఈ- గవర్నమెంట్ ప్లాన్ లో భాగంగా.. గుడ్ గవర్నెన్స్ ఇచ్చేందుకు ఈ పోర్టల్ ని డెవలప్ చేస్తోంది. ఏపీలో మీ సేవలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా ప్రజలు సేవలు పొందుతున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో హోటల్లో కూడా చాలా మార్పులు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు.మీసేవ పోర్టల్ లో సంక్షేమ పథకాలతో పాటు పౌర సేవలు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దగ్గర్లోని మీసేవ కేంద్రాలకు వెళ్లి ఈ సేవలు పొందవచ్చు. కొద్దిపాటి రుసుం చెల్లించి ఆ సేవలను పొందవచ్చు. ప్రధానంగా ఆధార్ సేవలు, సిడిఎంఏ, వ్యవసాయ శాఖ సేవలు, ప్రజా పంపిణీ సేవలు, ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్, ఇండస్ట్రీస్ కమిషన్, జిల్లా పాలన యంత్రాంగం సేవలు, పోలీస్ సేవలు, విద్యాశాఖ సేవలు, ఎన్నికల సేవలు, ఉద్యోగ సేవలు, హౌసింగ్, ఎండోమెంట్, ఆరోగ్య సేవలు, ఐటిసి, కార్మిక సేవలు, లీగల్ మెట్రాలజీ, మైన్స్, జియాలజీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్, మునిసిపల్ అడ్మిన్, ఇండస్ట్రీస్ ఇన్సెంటివ్స్, ఎన్డీపీసీఎల్, రెవెన్యూ, గ్రామాభివృద్ధి, సోషల్ వెల్ఫేర్.. ఇలా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు పొందవచ్చు.మీసేవ ద్వారా సేవలు పొందాలంటే కొన్ని పత్రాలు అవసరం. ఆధార్ కార్డ్, అడ్రస్ ప్రూఫ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడి, బ్యాంక్ అకౌంట్ వివరాలు అవసరం. మీ సేవలో సేవలు పొందాలంటే ముందుగా అధికారిక పోర్టల్ లోకి వెళ్ళాలి. హోం పేజీలో మీరు మీ సేవ ఆన్లైన్ పోర్టల్ ఆప్షన్ ఎంచుకోవాలి. స్క్రీన్ పైన కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో న్యూ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి. మీ ముందు రిజిస్ట్రేషన్ ఫారం కనిపిస్తుంది. అందులో అడిగిన వివరాలు ఎంటర్ చేయాలి. తరువాత మీ మొబైల్ కి ఓటిపి వస్తుంది. ఓటిపి ఎంటర్ చేసి కన్ఫర్మ్ ఆప్షన్ క్లిక్ చేయాలి. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. మీకు కన్ఫర్మేషన్ కోసం మెయిల్ ఐడి కి ఈమెయిల్ వస్తుంది. అందులో ఉన్న కోడ్ ని క్లిక్ చేయాలి. దీంతో మీ అకౌంట్ యాక్టివ్ అవుతుంది. తరువాత లాగిన్ కావాలి. సైన్ ఇన్ ఆప్షన్ క్లిక్ చేయాలి. మీకు డాష్ బోర్డు కనిపిస్తుంది. అందులో యూజర్ నేమ్ పాస్వర్డ్ ఇవ్వాలి. ఆ తర్వాత మీరు రకరకాల సేవలను అక్కడ చూస్తారు. వాటి కోసం అప్లై చేసుకోవచ్చు. ఇలా అప్లై చేసుకున్న క్రమంలో కొన్ని పత్రాలను అడుగుతుంది. వాటిని అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. వివిధ పథకాలు, సేవల కోసం అప్లై చేసుకున్నాక.. వాటి పరిస్థితి ఎలా ఉందో స్టేటస్ కూడా చూసుకోవచ్చు.

## ఎమ్మాహెచ్చార్డీలోనే సీఎం క్యాంప్ ఆఫీసు

హైదరాబాద్, జూన్ 19,

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోసం ప్రభుత్వం కొత్త క్యాంపు కార్యాలయాన్ని సిద్ధం చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 6 నెలలవుతున్నా, నేటి వరకు ఆయనకంటూ ప్రత్యేకంగా క్యాంపు కార్యాలయం లేదు. ప్రభుత్వ సమీక్షలు వగైరాలను ఇప్పటివరకు ఇంటినుంచి లేదా సచివాలయం నుంచే నిర్వహిస్తూ వచ్చారు. గత ప్రభుత్వ హయంలో సీఎం అధికార నివాసాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ భవనాన్ని ప్రజాభవన్‌గా పేరు మార్చి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారిక నివాసంగా మార్చగా, మరో భాగంలో మంగళ, శుక్రవారాల్లో ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమానికి వాడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల హడావుడి ముగియటంతో సీఎం పాలన మీద ప్రత్యేకంగా దృష్టిపెట్టటంతో బాటు రోజూ సీఎంను కలిసేందుకు వందలాది సందర్శకులు రావటంతో ముఖ్యమంత్రి కోసం పూర్తి స్థాయి క్యాంపు కార్యాలయం అవసరం ఏర్పడింది.దీనికోసం తొలుత నూతన కార్యాలయం నిర్మిస్తే ఎలా ఉంటుందనే కోణంలో అధికారులు అలోచించగా, దానికి ముఖ్యమంత్రి నో చెప్పినట్లు సమాచారం. తన కార్యాలయం కోసం అనవసరంగా ప్రజాధనం వెచ్చించటానికి బదులు.. ఉన్న భవనాల్లోనే ఏదో ఒకదానిని వాడుకుంటే సరిపోతుందని ఆయన సూచించారు. దీంతో అధికారులు పైగా ప్యాలెస్, పోలీస్ టవర్స్ కార్యాలయంతో బాటు పలు ప్రభుత్వ ఆఫీసులను అధికారులు పరిశీలించారు. వాటిలో భద్రత, సౌకర్యాల పరంగా కొత్త నిర్మాణాల అవసరమయ్యేలా ఉండటంతో, అంతిమంగా, జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం(ఎంసీఆర్ హెచ్ఆర్‌డీసీ) అయితే బాగుంటుందనే అంచనాకు వచ్చారు. సుమారు 45 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాంగణంలో ఒకేసారి దాదాపు 150 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన నాలుగు హాళ్లు, 375 ఏసీ రూములు, పరిపాలక మండలి సమావేశం నిర్వహణకు వీలుగా బోర్డ్ రూమ్, 250 మంది కూర్చునే ఆడిటోరియం, అతిథులకు ఆశ్రయం ఇవ్వడానికి మంజీర, కృష్ణ, గోదావరి, తుంగభద్ర పేర్లతో వేర్వేరు బ్లాకులు ఉన్నాయి. ఈ ప్రాంగణంలో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేస్తే రోజువారీ జరిగే కార్యకలాపాలకు భద్రతా పరమైన ఇబ్బందులు కూడా ఉండవనే అంచనాకు వచ్చారు ఎంసీఆర్ హెచ్ఆర్‌డీసీ ప్రాంగణంలోని గుట్ట మీద ఉన్న బ్లాక్‌లోకి సీఎం క్యాంపు కార్యాలయాన్ని మార్చితే, తక్కువ ఖర్చుతోనే దీనిని క్యాంపు కార్యాలయంగా వాడుకోవచ్చని భావించి, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి సమీపంలో రేవంత్‌రెడ్డి నివాసం ఉంది. ఇప్పుడు అక్కడి నుంచే సచివాలయం, ప్రజాభవన్‌కు వెళ్తున్నారు. ప్రస్తుతం సీఎం నివాసానికి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రానికి దూరం కూడా తక్కువ కావటం వల్ల రాకపోకలకు సులభంగా ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులూ ఉండవని, అలాగే, నగరం మధ్యలో ముఖ్యమంత్రి కార్యాలయం అందుబాటులోకి తీసుకురావటం వల్ల సామాన్యులకూ అది వెసులుబాటుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక, ఇక్కడున్న మానవ వనరుల అభివృద్ధి సంస్థను ప్రజాభవన్‌లోని మరో భవనంలోకి తరలించనున్నారని తెలుస్తోంది.

## అట్టుడుకుతున్న బెజవాడ

విజయవాడ, జూన్ 19,

ఎన్నికల్లో టిడిపి కూటమి విజయం సాధించింది. వైసీపీకి దారుణ పరాజయం ఎదురైంది. ఎన్నికల రోజు, తరువాత రాష్ట్రవ్యాప్తంగా హింస చెలరేగింది. అయితే కేంద్ర బలగాలు ప్రవేశించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కానీ విజయవాడలో మాత్రం పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. వైసీపీలో వివాదాస్పద నాయకులుగా ముద్రపడిన కొడాలి నాని, వల్లభనేని వంశీలు చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ దుమారం రేపుతున్నాయి. వారి వల్ల వైసీపీ శ్రేణులు మూల్యం చెల్లించుకుంటున్నాయి. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఇద్దరు నేతలను టిడిపి టార్గెట్ చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ ఇద్దరు నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.కానీ వారి అనుచరులు ఇప్పుడు టార్గెట్ అవుతున్నారు.ఏపీలో టీడీపీ కూటమి గెలిచిన తర్వాత చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేశారు. హింసాత్మక ఘటనలు వద్దని కూడా కోరారు. కానీ టిడిపి శ్రేణులు మాత్రం ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. అధినేత ఆదేశాలను పట్టించుకోవడం లేదు. దీంతో రాజకీయ అలజడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా విజయవాడలో అటువంటి గట్టనే ఒకటి వెలుగు చూసింది. విజయవాడ సింగ్ నగర్ ఏరియాలో ఒక్కప్పటి టిడిపి కార్పొరేటర్, ప్రస్తుత వైసిపి నాయకుడు నందీపు జగదీష్ కు సంబంధించి ఇంటిని ఆదివారం మున్సిపల్ అధికారులు కూల్ చేశారు. యంత్రాలతో వ్యాపార సముదాయాన్ని నేలమట్టం చేశారు. దీంతో ఇక్కడ రాజకీయ వాతావరణం కాక రేపుతోంది. అయితే ఈ ఘటన వెనుక టిడిపి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ఉన్నాడని జగదీష్ ఆరోపిస్తున్నారు.గత పది సంవత్సరాలుగా బెజవాడ ప్రశాంతంగా ఉంది. ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగలేదు. వైసిపి ప్రభుత్వ హయాంలో సైతం చెదురుమదురు ఘటనలే తప్ప.. ఎన్నడు హింస చెలరేగలేదు. కానీ ఇప్పుడు ఏకంగా ఓ మాజీ కార్పొరేటర్ ఇంటిని తొలగించడం రాజకీయ కక్షపూరిత చర్యగా స్థానికులు చెబుతున్నారు. ఒక్కసారిగా తన ఇంటిని కూల్చేయడంతో జగదీష్ కన్నీటి పర్యంతమయ్యారు. ప్రకాష్ నగర్ లోని తన ఇంటి ముందే కూర్చుని శిరోమండలం చేయించుకుని నిరసన తెలిపారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు కూడా పక్కనే ఉన్నారు. జగదీష్ తన భార్యను కూడా శిరోముండనం చేయించేందుకు ప్రయత్నించారు. కానీ పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తమపై కక్ష కట్టారని.. ఈరోజు టిడిపి ది అని.. రేపు వైసిపిదని.. కానీ రాజకీయ కక్షపూరిత చర్యలకు దిగడం మంచిది కాదని జగదీష్ స్పష్టం చేశారు. అయితే ఈ ఘటనతో బెజవాడలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. మున్ముందు ఎటువంటి ఘటనలు జరుగుతాయోనన్న భయంలో నగరవాసులు ఉన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ మృతి

శ్రీకాకుళం

టెక్కలి మండలం అక్కవరం గ్రామ సమీప జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విశ్రాంతి స్థలంలో ఆగి ఉన్న లారీను వెనుక నుంచి మరోలారి అతి వేగంగా ఢీకొంది. ఈప్రమాదంలో లారీ క్యాబిన్లో ఇరుక్కొని డ్రైవర్, క్లీనర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు.

## హైదరాబాద్ చేరుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

శంషాబాద్.....

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హైదరాబాద్ కు వచ్చారు. కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఢిల్లీ నుండి మొదటిసారి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ విఐపి గేట్ నుండి బయటకు వచ్చారు. ఎయిర్ పోర్ట్ నుండి హైదరాబాద్ లోని ఆయన నివాసానికి వెళ్లారు. సెక్యూరిటీ అధికారులు సెక్యూరిటీ అధికారులు బండి సంజయ్ కి భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు.

## గంటలో ఒక హత్య, రెండుహత్యాయత్నాలు

హైదరాబాద్

హైదరాబాద్ పాత బస్తి షా అలీ బండా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గంటలోనే ఒక హత్య, రెండు హత్యాయత్నాలు నమోదయ్యాయి.

షా అలీ బండా పోలీస్ స్టేషన్ పరిధిలోనిబస్తీలో రఫీక్ బిన్ షిమ్లాన్ అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. అదే సమయంలో మరణించిన రఫీక్ బిన్ షిమ్లాన్కు ఖలీద్ స్నేహితుడు. ఒకరు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అంతకు కొన్ని నిమిషాల క్రితం షా అలీ బండా పోలీస్ స్టేషన్ పరిధిలోని చందూలాల్ బారాదరి వద్ద గుర్తు తెలియని వ్యక్తిపై ఫక్రుద్దీన్ అనే వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు.

సమాచారం అందుకున్న షా అలీ బండా, కాలాపత్తర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించగా, గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా క్యాజువాలిటీకి తరలించారు.

====================

## దర్గా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

### సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో దర్గాకు ప్రత్యేక నిధులు కేటాయింపు

### ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడితల ప్రణవ్

జమ్మికుంట

జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ దర్గా లో మంగళవారం రోజున ఉర్సు ఉత్సవాలు భాగంగా హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడితల ప్రణవ్ గంధాలను తీసుకువచ్చి హజ్రత్, సయ్యద్ ఇంకుషావలి సమాదులకు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడుతూ బిజిగిరి షరీఫ్ దర్గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

ఈ ప్రదేశం చాలా ఆహ్లాదకరంగా ఉంటుందని ఇక్కడికి భక్తులు కులాలకు, మతాలకు, అతీతంగా ఇక్కడికి వచ్చి ముక్కులు చెల్లించుకుంటారని కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్మకం , విశ్వాసంతో ఇక్కడికి వస్తున్నారు.

వచ్చిన భక్తులకు దర్గా కమిటీ వారు సహకల సౌకర్యాలు కల్పిస్తున్నారని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.బాబా ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వుండాలని నియోజకవర్గంలోని ప్రజలంతా పాడి పంటలు సమృద్ధిగా ఎదగాలని దేవుని కోరుకున్నానని అన్నారు.వోడితల ప్రణవ్ వెంట దర్గా కమిటీ సభ్యులతో పాటు కాంగ్రెస్ నాయకులు పొన్నగంటి మల్లయ్య,కొల్లూరు కిరణ్, సుంకరి రమేష్, సజ్జు, మొలుగురి సదయ్య, సతీష్ రెడ్డి, పుల్లూరి సదానందం, సంపత్,రాహుల్, నాగభూషణం,కొమరయ్య, రాజకుమార్, రాచపల్లి రమేష్, వెంకటరెడ్డి, రాందాస్, రాములు, మల్లేష్ ,తో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెదక్ ఘర్షణలో గాయపడ్డ గో రక్షా కార్యకర్త అరుణ్ ను ఫోన్ లో పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

మెదక్

గోవులను రక్షించే ప్రయత్నం లో దుండగుల దాడిలో గాయపడ్డ మెదక్ పట్టణానికి చెందిన గో రక్షా కార్యకర్త అరుణ్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్ లో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మియాపూర్ లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అరుణ్ ను పరామర్శించిన ఎంఎల్ఏ లు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ తో ఫోన్ లో మాట్లాడించారు. అరుణ్ కు మెరుగైన చికిత్స అందించవలసిందిగా ఆసుపత్రి యాజమాన్యానికి సూచించాల్సిందిగా ఎంఎల్ఏ పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ కు బండి సంజయ్ చెప్పారు.

# 3 రాజభవనాలు...రుషికొండ నిర్మాణాలు

# 425 కోట్ల వ్యయం... రాజసం ఉట్టిపడేలా ప్యాలెస్

## మైండ్ బ్లాంక్...

విశాఖపట్టణం, జూన్ 19,

మూడు భారీ భవనాలు.. 12 బెడ్ రూమ్ లు.. అత్యంత ఖరీదైన మంచాలు, పరుపులు, షాండ్లియర్లు, రెండు సెంట్లు విస్తీర్ణంలో బాత్రూంలు, ఏ వస్తువు పట్టుకున్న లక్షలాది రూపాయలు.. ఇది పేదల ప్రతినిధిగా చెప్పుకునే పెత్తందారీ భవనం. విశాఖ తీరాన రుషికొండపై విలాసవంతమైన ప్యాలెస్ లు బహుళ ప్రపంచంలోకి వచ్చాయి. గత ఐదేళ్లుగా పెత్తందారీ వ్యవస్థతో పోరాడుతున్నానని జగన్ చెప్పుకొచ్చారు. కానీ వందల కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ రాజసౌధం చూస్తే జగన్ ఆలోచన ఏంటన్నది ఇట్టే తెలిసిపోతుంది. తనకోసం రాజభవనాలను తలపించేలా అత్యంత విలాసవంతమైన ప్యాలెస్ లు కొట్టుకోవడం..



దానిని గుట్టుగా సాగించడం.. ఇప్పుడు అధికార మార్పిడితో వెలుగులోకి రావడం హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.జగన్ తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విజయవంతంగా పూర్తి చేసిన ప్రాజెక్టు ఇది. ఏకంగా 452 కోట్లతో విలాసవంతమైన భవనాలు కట్టారు. వాటిలో ఏకంగా 12 బెడ్ రూములు నిర్మించారు. ప్రతి బెడ్ రూమ్ కు ఒక అటాచ్ బాత్రూంను నిర్మించారు. ఆ బాత్రూం లో చూస్తే మైండ్ బ్లాక్ అవుతుంది. ప్రతి నిర్మాణం ప్రత్యేకత సంతరించుకున్నదే. దాని వైశాల్యం 480 చదరపు అడుగులు. అంటే పేదలకు జగన్ ఇచ్చిన ఇంటి స్థలం కంటే అధికం. ప్యాలెస్ లో ప్రతి అడుగు రాజసం ఉట్టిపడేలా ఖరీదైన నిర్మాణాలు చేపట్టారు.ఋషికొండపై భవనాలకు 452 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం ప్రారంభించారు. ఇప్పటికే 407 కోట్లు ఖర్చు పెట్టారు. అత్యంత ఖరీదైన ఫర్నిచర్ ను కూడా తెచ్చారు. మళ్లీ తానే గెలుస్తానని.. 30 ఏళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని జగన్ కలలుగన్నారు. రాజధానిని విశాఖకు మార్చేసి రిషికొండపై కొలువు తీరాలన్నది జగన్ లక్ష్యం. గతంలో నిర్మించిన పర్యాటక శాఖ భవనాలను కూలగొట్టారు. రిసార్టులు కడుతున్నామన్న పేరుతో సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారు. జగన్ నివాసంతో పాటు సీఎం కార్యాలయం కోసం ఈ భవంతులను కట్టేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే హాలీవుడ్ నటులు కొన్ని మిలియన్ డాలర్లు వెచ్చించి కొట్టుకునే అత్యంత విలాసవంతమైన భవనాలను తలదన్నేలా వీటిని నిర్మించారు.రాజధాని అవసరాల కోసం వీటిని నిర్మాణం చేపడుతున్న కొందరు మంత్రులు మాత్రం రిసార్ట్ లేనని బుకాయించారు. అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ రుషికొండపై భవనాలు ముఖ్యమంత్రి నివాసానికి అనుకూలమని సిఫార్సు చేయించేలా నాటకం ఆడారు. విశాఖలో మిగతా భవనాలను పరిశీలించి అన్నింటికీ రిషికొండ భవనాలు ఆమోదయోగ్యమని గ్రామ పండించారు. సీనియర్ ఐఏఎస్ అధికారిని శ్రీలక్ష్మి సేవలను వినియోగించుకున్నారు. ఆ కమిటీకి నేతృత్వం వహించే ఆమె చిన్న చిన్న మార్పులు చేసుకుంటే ఈ భవనాలు సీఎం నివాసంతో పాటు కార్యాలయానికి వినియోగించుకోవచ్చని సూచించారు. కానీ వారు ఒకటి తలిస్తే.. దైవం ఒకటి తలచింది. వైసిపి ఓడిపోయింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ పేదల సీఎం చేపట్టిన నిర్మాణాలు బయటకు వచ్చాయి.వైసిపి అధికారంలో ఉన్నన్నాళ్లు అటువైపుగా చీమకు కూడా ప్రవేశం లేకుండా భద్రతను కట్టుదిట్టం చేసింది. ప్రతిపక్ష నాయకులు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తే వందలాది మంది పోలీసులను మోహరించి అడ్డుకుంది. తాజాగా మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి నాయకుల బృందం, మీడియా ప్రతినిధులను తీసుకుని ఆదివారం రుషికొండ భవనాలను సందర్శించారు. దీంతో విలాసవంతమైన భవనాల వ్యవహారం బయటకు వచ్చింది. ప్రస్తుతం ఇదే ఏపీలో వైరల్ అంశంగా మారింది. ప్రజల్లో బలమైన చర్చ నడుస్తోంది. ఇన్ని రోజులు రహస్యంగా సాగిన నిర్మాణ ప్రక్రియ వెలుగులోకి రావడంతో వైసీపీ శ్రేణులు కూడా ఒకరకమైన ఆందోళన కనిపిస్తోంది. ఎప్పటికీ జగన్ కు బెంగళూరు, హైదరాబాదు, పులివెందుల, తాడేపల్లిలో రాజభవనాలను తలదన్నే భవంతులు ఉన్నాయి. అవి చాలా ఉన్నట్టు ఇప్పుడు రిషికొండపై పడ్డారు. అయితే జగన్ ఆడిన డ్రామాలో ఐదారు గురు ఐఏఎస్ అధికారులు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రజత్ భార్గవ పాత్ర ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. అయితే అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం విశేషం. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి దశలోనూ క్యాబినెట్ అనుమతి తీసుకున్నారు.ఇప్పటి వరకు రాజులు, రాజ భవనాలు, రాజ సౌధాలు గురించి కథలుగా తెలుసుకున్నాం. కానీ తొలిసారి విశాఖలో జగన్ కట్టిన రుషికొండ రాజ సౌధంలో నిర్మాణాలు గురించి తెలిస్తే మైండ్ బ్లాక్ అవుతోంది.ప్రతి నిర్మాణం ప్రత్యేకమే. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడుకున్నది. ఈ భవనాల్లో అంతర్గత అలంకరణల కోసం ఏకంగా 1312 రకాల వస్తువులను వినియోగించారు. శ్వేత వర్ణంతో మెరిసిపోతున్న భవంతులు, భారీ ప్రవేశ ద్వారాలు, విలాసమైన పడక గదులు, వాటికి ఏమాత్రం తీసుకొని స్నానాలు గదులు.. ఇలా అన్నీ ప్రత్యేకమే. కేవలం భవనాలే కాదు.. ప్రాంగణమంతా ఖరీదైన పచ్చికలు, విలాసమైన లాన్లు, సుందరమైన ఉద్యానవనాలను తీర్చిదిద్దారు. కనుచూపుమేరలో విశాలమైన నీలి సముద్రం సోయగాలు కనిపించేలా డిజైన్లు తీర్చిదిద్దారు.కళింగ బ్లాక్ లో రెండు భవనాలను సీఎం కార్యాలయం కోసం నిర్మించారు. గజపతి, వేంగి బ్లాక్ లను సహాయ సిబ్బంది, ఇతర అధికారుల కోసం నిర్మించారు. భవనాలను భారీ స్తంభాలు, ప్రాకారాలతో ఇంద్ర భవనాల తీర్చిదిద్దారు. భవనాలను అనుసంధానిస్తూ విశాలమైన నడవాలు నిర్మించారు. అన్ని గోడలకు విదేశాల నుంచి తెచ్చిన పాలరాయి తాపడం చేశారు. ఏ భవనం చూసినా శ్వేత, ముదురు గోధుమ వర్ణాలతో మెరిసిపోయేలా తీర్చిదిద్దారు. ప్రవేశ ద్వారాలను వదడుగుల ఎత్తులో, అంతే వెడల్పుతో భారీగా ఏర్పాటు చేశారు. వాటికి ఇరువైపులా పాలరాయి నిర్మాణాలతో కూడిన ఎత్తైన ఆకృతులను చెక్కారు.బాత్రూములకు సైతం సెంట్రలైజ్డ్ ఏసి ఏర్పాటు చేశారు. భవనాల్లో వినియోగించిన ఫ్యాన్లు, షాండ్లియర్లు, ఇతర పరికరాలను ఏర్పాటు చేశారు. ఒక్క ఫ్యాన్ ధర రూ.35 వేల నుంచి ప్రారంభం అయినట్లు తెలుస్తోంది. షాండ్లియర్ల ధర ఒక్కొక్కటి 2 లక్షల రూపాయల వరకు ఉంటుంది. 12 బెడ్ రూములు వేరువేరుగా మంచాలు ఏర్పాటు చేశారు. ఈ గదులకు చుట్టూ ఆటోమేటిక్ అద్దాల తలుపులు, బయట నుంచి ఎండ లోపలికి రాకుండా ఆటోమేటిక్ కర్టెన్లు ఏర్పాటు చేశారు. హాలుకు రెండు వైపులా భారీ సోఫా సెట్లు ఏర్పాటు చేశారు. ఓపెన్ కిచెన్, సముద్రాన్ని చూస్తూ భోజనం చేసేలా డైనింగ్ హాల్ నిర్మించారు. రెండు వైపులా అతిథులు, సన్నిహితులతో ఏకాంతంగా మాట్లాడుకునేందుకు మరో రెండు గదులను నిర్మించారు.బాత్రూముల గురించి ఎంత చెప్పినా తక్కువే. వాటిలో ప్రత్యేకంగా స్పా ఏర్పాట్లు చేశారు. కమోడ్లు, షవర్లు, కుళాయిలు అన్ని ప్రసిద్ధ జపాన్ కంపెనీలకు చెందినవే. బాత్రూంలో భారీ కబోర్డులు ఏర్పాటు చేశారు. 100 అంగుళాల భారీ టీవీలను సైతం అమర్చారు. విదేశాల నుంచి తెప్పించిన మార్బుల్, గ్రానైట్ ను మాత్రమే వినియోగించారు. ఇక జగన్ కుటుంబం కోసం నిర్మించిన మూడు జిల్లాలు సముద్రానికి అభిముఖంగా ఉన్నాయి. పూర్తి విదేశీ పరిజ్ఞానంతోనే ఈ నిర్మాణాలు సాగినట్లు తెలుస్తోంది.

## సెంట్రల్ కరప్షన్ స్టేషన్....

హైదరాబాద్, జూన్ 19,

హైదరాబాద్ పోలీస్ విభాగంలో అత్యంత కీలకమైనది సిసిఎస్ విభాగం. ఇందులో కోట్ల రూపాయల స్కామ్?కు పాల్పడిన కేసులో దర్యాప్తు జరుగుతోంది. సీసీఎస్ కేంద్రంగా సాగుతున్న దందాలను చూస్తుంటే అవినీతికి అడ్డూ అదుపు లేదనిపిస్తోంది. పోలీస్ శాఖలో వందల కోట్ల స్కాం ఫైల్స్ మిస్ అవుతున్నాయి. అందుకు సీసీఎస్ పోలీస్ స్టేషన్ అడ్డాగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతికి అలవాటు పడ్డ అధికారులు వాటిని మిస్ యూజ్ చేస్తున్నారు. చార్జిషీట్ వేయడంలో అలస్యం చేస్తూ, కోట్ల రూపాయల లంచం తీసుకుంటున్నారు. కేసును వీక్ చేయడానికి ఓ లెక్క, తప్పించడానికి మరో లెక్క, ఇలా అవినీతిని పంచుకుంటున్నారు. ట్విస్ట్ ఏంటంటే, బాధితుల తరుపున కూడా డబ్బులు తీసుకోవడం ఇక్కడి స్పెషల్. అందుకే ఏసీపీ ఉమామహేశ్వర్ రావు విచారణలో ఎన్నో విషయాలు బట్టబయలు అయ్యాయి. అల్వాల్ ఏరియాలో దొరికిన 30 లక్షలు ఓ ఎస్పీ స్థాయి అధికారివి అని తెలిసింది. సందీప్ అనే అధికారికి ఈయనకు మధ్య బినామీ లావాదేవీలు ఉన్నాయి. ఈయన కాప్టీ ఏరియాలో డీసీపీగా చేయడం, కేసులు వస్తే, అక్కడ నుంచి హైదరాబాద్ సీసీఎస్‌కి వెళ్లడం, అక్కడ రాయబారం నడిపించడం లాంటివి ఎన్నో జరిగాయని పోలీసుల విచారణలో తేలింది. కోట్లాది రూపాయలు తీసుకుని సెటిల్మెంట్స్ చేయడమే పనిగా ఇన్నాళ్లూ సీసీఎస్‌ని వాడుకున్న అధికారులు ఉన్నారంటే పోలీస్ వ్యవస్థ ఎంతగా దిగజారిందో అర్థమవుతోంది.ఇటీవల కాలంలో వరుసగా రియల్ ఎస్టేట్ ఫ్రాడ్లు, ఫ్రీ లాంచ్ ఆఫర్ మోసాల పేరుతో జరుగుతున్న వేలకోట్ల రూపాయల స్కాములకు సంబంధించిన దర్యాప్తు సీసీఎస్ అధికారులు చేస్తున్నారు. ఈ క్రమంలో తమకు న్యాయం చేస్తారని వందల మంది బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్న తరుణంలో కొందరు పోలీస్ అధికారులు తప్పుదోవ పడుతున్నారు. ఏకంగా బాధితుల దగ్గరే చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా పోలీసుల చర్య చూసి బాధితులు న్యాయం కోసం వెళ్లి అన్యాయం అయిపోయామంటూ లబోదిబోమంటున్నారు.సిసిఎస్?లో ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. సాహితీఇన్ఫ్రాట్ స్కామ్?తో పాటు పలు రకాల ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్ కేసులను సిసిఎస్ విభాగంలోని అన్ని టీములు దర్యాప్తు చేస్తున్నాయి. వేలకోట్ల రూపాయలతో ముడిపడి ఉన్న కేసులు కావటంతో దర్యాప్తు పూర్తి చేసేందుకు సహజంగానే సమయం పడుతుంది. దీన్ని క్యాష్ చేసుకునేందుకు కొందరు పోలీస్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఏదో ఒక కారణం చెప్పి బాధితుల దగ్గర నుండి డబ్బులు కోరుతున్నారు. మరికొన్ని ప్రాపర్టీకి సంబంధించిన వ్యవహారాల్లో ఇద్దరి మధ్య సెటిల్మెంట్ చేసేందుకు ప్రయత్నిస్తూ కోట్ల రూపాయలు తమ వెనుక వేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.ఇటీవల కాలంలో వరుసగా అవినీతి అధికారుల భరతం పడుతున్నారు ఏసీబీ అధికారులు. ఒకవైపు ఏసీబీ దూకుడు చూసైనా సిసిఎస్?లో ఉన్న కొందరు అధికారుల తీరులో ఎలాంటి మార్పు రాలేదు. యదేచ్ఛగా బాధితుల నుండి కోట్ల రూపాయల డబ్బులు లంచం రూపంలో స్వీకరిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం సిసిఎస్ ఏసిపిగా ఉన్న ఉమామహేశ్వరరావు వ్యవహారం అందరికీ తెలిసిందే. కీలకమైన కేసుల దర్యాప్తు చేస్తున్న అధికారిగా ఉన్న ఉమామహేశ్వరరావు ఇంటిపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అతనికి మించి అక్రమాస్తులకు కూడా పెట్టుకున్నారు అనే ఆరోపణలతో ఆయనను ఏసిబి అరెస్టు చేసింది. ఇక తాజాగా ఒక సివిల్ వివాదంలో సిసిఎస్ పోలీసులు తల దూర్చారు. ఇరు పార్టీలు సెటిల్ చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిసిన కేసు నమోదు చేశారు. కేసు క్లోజ్ చేయాలంటే 15 లక్షల రూపాయలు ఇవ్వాలని సిసిఎస్ ఇన్స్పెక్టర్ సుధాకర్ డిమాండ్ చేశాడు. లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్?గా ఏసీబీ అధికారులు పట్టుకునే ప్రయత్నం చేయగా ఆయన పరుగులు తీశాడు. ఏకంగా మెయిన్ రోడ్డులోనే ఇంత భారీ మొత్తంలో లంచాన్ని స్వీకరించేందుకు సిసిఎస్ ఇన్స్పెక్టర్ సిద్ధమయ్యాడు.ఇలా కీలక కేసులు దర్యాప్తు చేస్తున్న సిసిఎస్ విభాగంలో అధికారులు అవినీతి బాట పట్టడం ప్రజల్లో గందరగోళానికి గురిచేస్తుంది. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ కాస్త సెంట్రల్ కరప్షన్ స్టేషన్?గా మారిందనే విమర్శలు వస్తున్నాయి. దీంతో తమకు న్యాయం జరుగుతుందో లేదో అనే ఆందోళనలో బాధితులు ఉన్నారు. సిసిఎస్ మాజీ ఏసిపి ఉమామహేశ్వరరావు సిసిఎస్?లో అన్నీతానై నడిపించాడు. కీలక కేసులు మొత్తం తన దగ్గరికి వచ్చేలా పావులు కదిపాడు. ఇక ఆయన బాటలోనే మరి కొంతమంది అధికారులు అవినీతిమయంగా ఉన్నట్లు ఏసీబీ దర్యాప్తులో బయటపడింది. సిసిఎస్ ఇన్స్పెక్టర్ సుధాకర్ కేసులోనూ ఏసీపీలపై ఆరోపణలు వస్తున్నాయి. సుధాకర్ పైస్థాయి అధికారిగా ఉన్న ఏసీపీ రామ్ రెడ్డి పైన ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. సీపీ శ్రీనివాస్ రెడ్డి, డీసీపీ శ్వేత హానెస్ట్‌గా ఉంటే సరిపోదు. కిందిస్థాయి సిబ్బందిని అలర్ట్ చేసి హానెస్ట్‌గా ఉంచాలనే మాట వినిపిస్తోంది. మొన్న ఏసీపీ ఉమామహేశ్వర్ రావు, ఇప్పుడు ఇన్స్పెక్టర్ సుధాకర్, తర్వాత మరో అధికారి, ఇలా లంచాలు మేస్తూ పోతే ఎలా? ఉన్నతాధికారులు ఇలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలనే సూచన సర్వత్రా వినిపిస్తోంది.బాధితుడు దగ్గర దొరికిన ఫోన్ రికార్డింగ్లో తన పైస్థాయి అధికారులకు కూడా ఇవ్వాల్సిందిగా ఇన్స్పెక్టర్ మాట్లాడిన కాల్ రికార్డింగ్?ను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇదే వ్యవహారంలో ఏసీపీ రామ్ రెడ్డిని సైతం ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

==========================

## డీసీసీబీ తిప్పలు

నిజామాబాద్, జూన్ 19,

ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిజామాబాద్ సహకార బ్యాంక్ ఇప్పుడు అప్రతిష్టను మూటగట్టుకుంటున్నది. గత పాలకవర్గాలు తీసుకున్న ఇష్టారీతి నిర్ణయాలు, అడ్డగోలుగా ఇచ్చిన దీర్ఘకాలిక రుణాలతో ప్రస్తుతం డీసీసీబీ గింజుకుంటున్నది. రుణాల రికవరీ కోసం తంటాలుపడుతున్నది. తప్పకుండా ఈ నెలాఖరులోపు రుణాలను రికవరీ చేయాలని టార్గెట్లు ఫిక్స్ చేయడంతో సిబ్బంది దూకుడుగా వ్యవహరిస్తున్నది. కొందరు నిబంధనలను అతిక్రమించి వ్యవహరిస్తుండటం వివాదాస్పదం అవుతున్నది. అదీ ప్రాబల్యమున్న వారిని వదిలి రైతులనే టార్గెట్ చేసుకుని పని చేయడం విమర్శలకు తావిస్తున్నది.నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు.. రుణాల మంజూరీలో చాలా చోట్ల మార్గదర్శకాలను పాటించలేదని ఆరోపణలు ఉన్నాయి. కొందరికి నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇచ్చినట్టు ఆరోపిస్తున్నారు. పలుకుబడి, ప్రాబల్యం ఉన్నవారు సొసైటీ కనుసన్నల్లో ఇష్టారాజ్యంగా రుణాలు తీసుకున్నట్టూ కొందరు ఆరోపణలు చేస్తున్నారు.నెలాఖరులోపు బకాయిలు వసూలు చేయాలని అధికారులు టార్గెట్ ఫిక్స్ చేశారు. దీంతో సిబ్బంది కొంత దూకుడు, మరికొంత దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. లింగంపేటలో హద్దుమీరారు. ఓ రైతు పొలం వద్ద ఎర్రజెండాలు పాతి.. భూములు స్వాధీనం చేసుకుంటామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి బెదిరించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ప్రభుత్వానికే చెడ్డపేరు తెచ్చేలా ఉన్నదని గ్రహించి అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. కాగా, సహకార బ్యాంకు తీరును రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. బకాయిల వసూళ్లలో పలుకుబడి ఉన్నవారి జోలికి పోవడం లేదని, రైతులను మాత్రం భూములు స్వాదీనం చేసుకుంటామని బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ మద్దతు కూడా ప్రకటించింది.పలువురు రుణగ్రహీతలు రెండేళ్లుగా బకాయిలు చెల్లించడం లేదు. దీంతో మొండిబకాయిల వసూళ్ల కోసం బ్యాంకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. మొత్తం రూ. 250 కోట్ల బకాయిల్లో ఈ డ్రైవ్ ద్వారా రూ. 139 కోట్లు వసూలు చేయగలిగారు. మరో రూ. 111 కోట్లు వడ్డీతో కలిపి మొత్తం రూ. 130 కోట్ల వరకు బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.నాబార్డు, టెస్కాబ్ వంటి సంస్థల నుంచి డీసీసీబీ రుణాలు తెచ్చి ఖాతాదారులకు లోన్లు ఇచ్చింది. తిరిగి ఆ సంస్థలకు చెల్లించాలంటే రుణగ్రహీతల నుంచి బకాయిలు చెల్లించాల్సిందే. ఈ రికవరీ కోసం బ్యాంకు వ్యూహాత్మకంగా ఆలోచనలు చేస్తున్నది. మొండి బకాయిల కోసం ప్రత్యేక రాయితీలు అవకాశాలు ఇస్తున్నది. జూన్ చివరి వరకు వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం ఇచ్చింది. కానీ, ఈ అవకాశాన్ని కూడా కొందరు వినియోగించుకోవడం లేదు. ఇందులో రుణమాఫీ కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులు కూడా ఇందులో ఉన్నారు. రుణమాఫీ స్వల్పకాలిక రుణాలకు మాత్రమే వర్తించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

భారత శక్తి

గురువారం, 20 జూన్ 2024

# రూ.2,500 పంపిణీకి సిద్ధం...

హైదరాబాద్, జూన్ 19

ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల అమలుపై తెలంగాణ ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటికే రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. అర్హులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మరోవైపు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ప్రతినెలా రూ.2,500 అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ అంశంపై మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. అర్హులైన మహిళల ఖాతాల్లో ప్రతినెలా రూ.2,500 చొప్పున త్వరలో జమ చేస్తామని ప్రకటించారు. ఇల్లు లేని పేదలకు సొంత ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చెల్లిస్తామని తెలిపారు.విపక్షాల ఒత్తిడి నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టింది. ఈక్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డి శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. త్వరలో నిర్వహించబోయే కేబినెట్ భేటీలో కొన్ని పథకాలకు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది. ప్రధానంగా రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే ఆరు గ్యారంటీల్లో మిగిలిన హామీలను కూడా అమలు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా మహిళలకు ప్రతినెలా రూ.2,500 చెల్లించే అంశంపై కసరత్తు చేస్తున్నారు.ఇక మహిళలకు రూ.2,500 అందించే పథకానికి కూడా తెల్ల రేషన్‌కార్డును తప్పనిసరి. ఇప్పటికే గ్యాస్, గృహజ్యోతి పథకాలను తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికే ప్రభుత్వం అందిస్తోంది. ఈ క్రమంలో త్వరలో అమలు చేసే ఆర్థికసాయం పథకం కూడా తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలకే ఇవ్వనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. మరోవైపు అర్హుల ఎంపిక విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థికసాయం, ఫింఛన్లు పొందని వారికి మాత్రమే ఈ పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే జూలై నుంచి దీనిని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

# స్కూల్ యాజమాన్యాల ధర్నా

మేడ్చల్

అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న శ్రీ చైతన్య స్కూల్ ముందు బడ్జెట్ పాఠశాల యాజమాన్యాలు ధర్నా కు దిగాయి. కుత్బుల్లాపూర్ మండలం సుచిత్ర మూడు గుళ్ళు ఎదురుగా శ్రీ చైతన్య పాఠశాల కు అనుమతులు లేకపోవడంతో మే నెలలో విద్యాశాఖ అధికారులు సీజ్ చేసారు. అయినా పాఠశాల యాజమాన్యం అడ్మిషన్ లు చేస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి.

# గాంధీ భవన్ లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

హైదరాబాద్

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ సేనా రెడ్డి గారి ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఫిషెర్మెన్ కాంగ్రెస్ అధ్యక్షులు మెట్టు సాయి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసారు.

# మన నివసించే ప్రాంతాలు చెత్త రహిత ప్రాంతాలుగా మార్చి స్వచ్ఛ నగరానికి కృషి చేయాలి

హైదరాబాద్

మన నివసించే ప్రాంతాలు చెత్త రహిత ప్రాంతాలుగా మార్చి స్వచ్ఛ నగరానికి కృషి చేయాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత భర్త శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛ సోమాజిగూడ లో భాగంగా రోడ్డు పక్కన పేరుకుపోయిన వారు శానిటేషన్ కార్మికులతో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో చిరు వ్యాపారులు తమ వ్యాపారాల వలన వెలువడిన చెత్తను రోడ్లపై వెయ్యకుండా తమ దుకాణాలు దగ్గరకు వచ్చే శానిటేషన్ వాహనాల్లో వెయ్యాలను సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వలన దోమల ప్రబలి బారిన పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కు తుర్కపల్లి లో ఘన స్వాగతం

మేడ్చల్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి మొదటిసారి కరీంనగర్ కు బయలుదేరి వెళుతున్న బండి సంజయ్ కు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట్ మండలంలోని తుర్కపల్లి వద్ద భాజపా మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఆయనకు శాలువాలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అక్కడే ఉన్న హోటల్ లో అల్పాహారం తీసుకుని కరీంనగర్ బయల్దేరి వెళ్లారు.

# హర్యానా అసెంబ్లీ ఎన్నికలపై గురి...

ఛండీఘఢ్, జూన్ 19,

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుపుకోనున్న రాష్ట్రాలపై భారతీయ జనతా పార్టీ దృష్టి సారించింది. ఆ రాష్ట్రాల్లో పార్టీ స్థితిగతులు, లోటుపాట్లపై ఆత్మపరిశీలన చేస్తోంది. తమకు ఎదురేలేదు అనుకున్న హిందీ హార్ట్‌ల్యాండ్‌లోనే కమలదళానికి ఎదురుదెబ్బలు తగిలాయి. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో ఆశించిన ఫలితాలు సాధించలేక బీజేపీ చతికిలపడింది. ఈ ఏడాది చివర్లో మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలతో పాటు హర్యానాలోనూ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటి నుంచే లోపాలు, పొరపాట్లు గుర్తించి సరిదిద్దకపోతే.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. అందుకే కమలదళం పెద్దలు




ఆయా రాష్ట్రాల్లో స్థితిగతులపై అధ్యయనం, మేధోమధనం ప్రారంభించారు. మొత్తం 10 లోక్‌సభ స్థానాలున్న హర్యానా రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెరో 5 సీట్లు గెలుపొందాయి. 2019లో సాధించిన సంఖ్యతో పోల్చితే ఈ రాష్ట్రంలో బీజేపీ బలం సగానికి సగం తగ్గిపోయింది. అప్పుడు ఏకంగా 58.02% ఓట్లతో రాష్ట్రంలోని అన్ని స్థానాలను బీజేపీ క్లీన్ స్వీప్ చేయగా, కాంగ్రెస్ పార్టీ కేవలం 28.42% ఓట్లతో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. కానీ ఈసారి బీజేపీ 46.11% ఓట్లు, కాంగ్రెస్ 43.67% ఓట్లు సాధించి చెరో 5 స్థానాలు గెలుపొందాయి. గణాంకాలను పరిశీలిస్తే కాంగ్రెస్ ఏకంగా 15.25% మేర తమ బలాన్ని పెంచుకోగలిగింది. ఇదే సమయంలో బీజేపీ 11.91% ఓట్లను కోల్పోయింది. ఇది కమలనాథులను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తున్న అంశం.హర్యానాలో బీజేపీ పనితీరుపై కోర్ గ్రూప్ సమావేశం జరిగింది. ఆ పార్టీ జాతీయాధ్యక్షులు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షాతో పాటు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కొత్తగా ఎన్నికల ఇన్‌ఛార్జి, కో–ఇన్‌ఛార్జులుగా నియమితులైన ధర్మేంద్ర ప్రధాన్, బిప్లవ్ కుమార్ దేవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. హర్యానా బీజేపీ కోర్ గ్రూప్ నేతలైన హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ (రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి), కృష్ణపాల్ గుర్జార్, కెప్టెన్ అభిమన్యు, సుధా యాదవ్, హర్యానా ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ ఫణీంద్రనాథ్ శర్మ, సంజయ్ భాటియా, ఆర్గనైజేషన్ ఇన్‌ఛార్జ్ సతీష్ పునియా, కో–ఇన్‌చార్జ్ సురేంద్ర నాగర్ తదితరులు ఈ కీలక భేటీలో పాల్గొని లోటుపాట్లపై లోతుగా చర్చించారు. ముఖ్యంగా అంబాలా, సోనిపథ్ వంటి స్థానాల్లో ఓటమి వారిని కలవరపెట్టింది. అంబాలా బీజేపీకి వరుసగా విజయాలు అందిస్తున్న స్థానం. ఇంకా చెప్పాలంటే రాష్ట్రం మొత్తమ్మీద సురక్షితమైన స్థానంగా బీజేపీ నేతలు భావిస్తారు. అలాంటి చోట ఓటమికి దారితీసిన పరిస్థితులేంటి అన్నదే అగ్రనాయకత్వాన్ని వేధిస్తున్న ప్రశ్న. సుదీర్ఘ చర్చ అనంతరం రాష్ట్రంలోని జాట్ సామాజికవర్గం ఓటర్లలో నెలకొన్న ఆగ్రహం, దళితుల్లో నెలకొన్న అసంతృప్తి పార్టీ విజయావకాశాలను దెబ్బతీశాయని అంచనాకు వచ్చారు. జాట్ల ఆగ్రహానికి కారణాలను అన్వేషించి, వారిని ఆకర్షించేందుకు బీజేపీ త్వరలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాలని చూస్తోంది. ఈ క్రమంలో ఆ రాష్ట్రానికి తదుపరి పార్టీ అధ్యక్షుడిగా జాట్ నేతనే ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది. మొత్తం పరిస్థితులను ఆకళింపు చేసుకోడానికి హర్యానా రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జిగా నియమితులైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జూన్ 22, 23 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించనున్నారు.బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారు అంటూ కాంగ్రెస్ పార్టీ చేసిన దుష్ప్రచారం ప్రభావంతో దళితులు కొంత దూరమయ్యారని కమలనాథులు గ్రహించారు. యూపీ, రాజస్థాన్, మహారాష్ట్ర సహా దేశవ్యాప్తంగా రిజర్వుడు స్థానాల్లో ఈసారి బీజేపీ దెబ్బతినడానికి ఈ అంశమే ప్రధాన కారణమని భావిస్తున్నారు. హర్యానాలో దళితులు దూరమవడంలో ఈ–గవర్నెన్స్ కూడా ఒక కారణమని తేలింది. ఆన్‌లైన్ విధానం, యాప్‌ల వాడకం గురించి అంతగా తెలియని వర్గాలు సైతం ఏదైనా ప్రభుత్వ పథకాన్ని పొందాలంటే తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో, వెనుకబడిన వర్గాల్లో ఈ చర్య అసంతృప్తికి కారణమైందని కొందరు విశ్లేషిస్తున్నారు. దీన్ని సరిదిద్దేందుకు ఇక నుంచి ఆన్‌లైన్‌తో పాటు పేపర్ మీద దరఖాస్తులు నింపి అందజేసే ప్రక్రియను పునరుద్ధరించాలని నిర్ణయించారు. మొత్తంగా పార్టీకి దూరమైన 12% ఓటర్లను మళ్లీ తిరిగి తమ వద్దకు తెచ్చుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈ రాష్ట్రంలో అక్టోబరు నెలలో హర్యానాలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఈ రాష్ట్రానికి పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్‌ను కో–ఇన్‌చార్జ్‌గా నియమించింది. ఇద్దరికీ లోటుపాట్లను గుర్తించి సరిదిద్దే కీలకమైన బాధ్యతలు అప్పగించింది.

# పవర్..వార్.. షురూ...

హైదరాబాద్, జూన్ 19,

తెలంగాణలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలపై విచారణ చేపడుతున్న జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రామ్, విద్యుత్ శాఖ అధికారి, నాటి విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేత కె. రఘు కమిషన్ ముందు హాజరై నాటి పరిస్థితులను కమిషన్ దృష్టికి తెచ్చారు. నాటి ప్రభుత్వ పెద్దల ఒంటెత్తు పోకడలు, అనాలోచిత, తొందరపాటు నిర్ణయాల కారణంగా విద్యుత్ కొనుగోళ్ల మొదలు, నూతన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం వంటి పలు అంశాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని వారు కమిషన్‌కు వివరించారు. బీఆర్కే భవన్‌లో కమిషన్ కార్యాలయంలో కమిషన్ ముందు హాజరైన వీరు పలు అంశాలపై సమాచారమిచ్చారు.కొత్తగూడెం జిల్లా మణుగూరు వద్ద గోదావరి తీరంలో 1,080 మెగావాట్ల భద్రాద్రి విద్యుత్ ప్లాంటు.. ఏపీలో నిర్మిస్తున్న పోలవరం పూర్తయితే మునిగే ప్రమాదం ఉందని కేంద్రం హెచ్చరించినా వినలేదన్నారు. భవిష్యత్తులో గోదావరికి భారీ వరద వచ్చినా ప్లాంటు మునుగుతుందని ఇంజనీర్లు చెప్పినా, వరద రక్షణ గోడలు కడతామన్నారని చెప్పారు. అనుకున్నట్లుగా 2020 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలతో భద్రాద్రి విద్యుత్ కేంద్రంలోపలికీ నీరు చేరిందని ఆయన గుర్తుచేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు టెండర్లు వేయకుండా బీహెచ్‌ఈఎల్‌కు కాం ట్రాక్ట్ ఇవ్వడం, ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ పవర్, రెనేవబుల్ ఎనర్జీ వైపు వెళుతుంటే గత పాలకులు థర్మల్ పవర్ వైపు దృష్టి సారించటం వంటి అంశాలను కమిషన్ ముందు లేవనెత్తినట్లు తెలుస్తోంది.నాటి కేంద్ర ప్రభుత్వం చెప్పినా వినకుండా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హడావుడిగా 1000 మెగావాట్ల అదనపు విద్యుత్ కొనుగోలు కోసం ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందాలు చేసుకున్నారనీ, ఈ కొనుగోలుకు ఈఆర్సీ అనుమతి లేకపోయినా, ఉందని అబద్ధాలు చెప్పారని ఆయన కమిషన్ దృష్టికి తెచ్చారు. తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఈ ఒప్పందం రద్దు చేసుకుందనీ, ఆ అనాలోచిత నిర్ణయంతో ప్రభుత్వంపై కోట్లాది రూపాయల అదనపు భారం పడిందని తెలిపారు.అనంతరం విద్యుత్ శాఖ అధికారి, జేఏసీ నేత కె. రఘు కమిషన్‌ను కలిసి అనేక అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఛత్తీస్‌ఘడ్‌తో విద్యుత్ కొనుగోలు విషయంలో పాత విధానాలను పక్కనబెట్టిన తీరును కమిషన్‌కు వివరించినట్లు తెలుస్తోంది. వెయ్యి మెగావాట్ల ఒప్పందం జరిగితే ఆ సరఫరాయే సరిగా జరగలేదనీ, అదనంగా మరో వెయ్యి మెగావాట్ల విద్యుత్ కోసం హడావుడిగా ఒప్పందం చేసుకున్నారనీ, తర్వాత తప్పు తెలుసుకుని ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని ప్రయత్నించినా అది సాధ్యపడలేదని, గత ప్రభుత్వ నిర్వాకంతో రూ. 2600 కోట్ల మేర ఖజానా మీద భారంపడిన విషయాన్ని గణాంకాలతో సహా వివరించారు. టెండర్లకు వెళ్లకుండా ఏకపక్షంగా కుదుర్చుకున్న ఈ ఒప్పందాన్ని ఆమోదించొద్దని ఆనాడే తాను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ)కి 10 పేజీల విజ్ఞప్తి లేఖను అందించానని గుర్తుచేశారు.భద్రాద్రి థర్మల్ ప్లాంట్‌లో సబ్ క్రిటికల్ టెక్నాలజీ అనేది రాష్ట్ర ప్రభుత్వం ఛాయిస్ కాదనీ, 2010లో డిజైన్ చేసిన యంత్రాలను, టెక్నాలజీని బీహెచ్‌ఈఎల్ సంస్థ.. ప్రభుత్వానికి అంటగట్టిందని, ఇవేవీ నేటి అవసరాలకు పనికొచ్చేవి కాదని తెలిపారు. అసలు ప్లాంటు నిర్మించ తలపెట్టిన లొకేషన్ కూడా సరైనది కాదనీ, పర్యావరణ అంశాలను గాలికొదిలేశారని, గోదావరికి వరద వస్తే ప్లాంటు మునగటం ఖాయమని వివరించారు. యాదాద్రి విషయంలోనూ ఇవే తప్పులు జరిగాయని, నిపుణుల మాటను పక్కనబెట్టి బొగ్గు గనులు లేని చోట ప్లాంటు ఆరంభించారనీ, దీనివల్ల రవాణా చార్జీల భారం పెరిగిందని తెలిపారు. 2016లోనే భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల విషయంలో ప్రభుత్వ నిర్ణయాలు సరికావంటూ రెగ్యులేటరీ కమిషన్ ముందు మొత్తుకున్నా లాభం లేపోయిందన్నారు. దీనివల్ల వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు.

# ఇంటర్ విద్యపై ప్రభుత్వ నిర్లక్ష్యం మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్

ఇంటర్ విద్యపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు ప్రారంభమై 19 రోజులు అవుతున్నా, ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు అందించకపోవడం బాధ్యతారాహిత్యం. ప్రజా పాలన అని ప్రచారం చేసుకునే ఈ ప్రభుత్వానికి విద్య మీద, విద్యార్థుల భవిష్యత్తు మీద ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. 422 జూనియర్ కాలేజీల్లో లక్షా 60 వేల మంది పేద, బలహీన వర్గాల విద్యార్థులు చదువుతున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలోని కొన్ని జూనియర్ కాలేజీల్లో మొదటి ఏడాది జీరో అడ్మిషన్స్ నమోదవడం పట్ల ప్రభుత్వం దృష్టి సారించి ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలి.

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు, జూనియర్ కాలేజీల్లో విధులు నిర్వర్తించే 1654 గెస్ట్ ఫ్యాకల్టీ రెన్యువల్ చేయాలని, రాష్ట్రంలో కొత్తగా మంజూరైన జూనియర్ కాలేజీల్లో పోస్టులు మంజూరు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

====================

# మున్నేరు నుంచి పాలేరు వరకు గ్రావిటీ కాలువకు ప్రతిపాదన

కూసుమంచి: మున్నేరు నుంచి పాలేరు వరకు గ్రావిటీ కాలువను నిర్మించడం ద్వారా పాలేరు నియోజకవర్గ ప్రజలకు సాగునీరు, తాగునీరుకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి వద్ద ఇరిగేషన్ డీఈ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు ప్రస్తావించారు. దీనికి పొంగులేటి ప్రసాద్ రెడ్డి సుముఖత వ్యక్తం చేసి ఈ విషయాన్ని తన సోదరుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో చర్చించి అమలు చేద్దామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి పొంగులేటి కట్టుబడి ఉన్నారని ప్రసాద్ రెడ్డి తెలిపారు. పాలేరు క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం అయిన సందర్భంగా పై విషయం చర్చకు వచ్చింది.

# గంజాయిపై ఉక్కుపాదం

విశాఖపట్నం

రాష్ట్ర హోమ్ మినిస్టర్ అనిత ఆదేశాలతో, డిజిపి ఉత్తర్వులతో విశాఖ జిల్లా పోలీసులు అలెర్ట్ అయ్యారు. గంజాయి, ఇతర మాధాకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపనున్నారు. ఈ మేరకు విశాఖ వెస్ట్ జోన్ కార్యాలయంలో డి. సి. పి.. 2 మోకా సత్తిబాబు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇక నుండి జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్ పై తనిఖీలు నిర్వహించి, మాదక రహిత కేంద్రంగా విశాఖ జిల్లాను ఉంచుతామని అన్నారు. 24 గంటలు సరిపిల్లి వద్ద చెక్ పోస్ట్ పెట్టడం జరుగుతుందని అన్నారు. కళాశాలలో తనిఖీలు నిర్వహించి, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని డి. సి. పి. పేర్కొన్నారు. ట్రాన్స్పోర్ట్ వాహనాలపై ప్రత్యేక ద్రుష్టి పెడతామని అన్నారు..కళాశాలల్లో విద్యార్థులకు మానసిక వైద్యులతో, తరగతులు నిర్వహిస్తామని అన్నారు.. ఈ డ్రగ్స్ మాఫియాను 100 రోజుల్లో గంజాయి వినియోగా న్ని అరికట్టడమే లక్ష్యంగా విశాఖ పోలీసులు పనిచేస్తామని అన్నారు..నగరంలో ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో 5 నుండి పది ప్రాంతాలలో నిఘా పెడతామని అన్నారు.. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.. గంజాయి వినియోగంతో ఎవరయినా సరయిన సమాచారం ఇస్తే, వారి వివరాలను గొప్యంగా ఉంచడంతో పాటు, పోలీసు శాఖ నుండి వారికి పారితోషికం కూడా అందిస్తామన్నారు డి. సి. పి. మోకా సత్తిబాబు స్పష్టం చేశారు..

# ఎద్దనెమలిపురి గ్రామం వద్ద ఆయిల్ ట్యాంకర్ బోల్తా... ఎగబడ్డ ప్రజలు

పల్నాడు

సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం పెద్దనెమలి గ్రామం వద్ద అయిల్ ట్యాంక్ బోల్తా పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ప్రజలు అయిల్ కోసం ఎగపడ్డారు. స్థానిక పోలీస్ లు ఆయిల్ ట్యాంకును పక్కకు తప్పిస్తున్నారు. కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ అయింది.

# మమ్మల్ని విధుల్లోకి తీసుకోండి ముఖ్యమంత్రికి మాజీ హోంగార్డుల వినతి

హైదరాబాద్

వివిధ కారణాలతో ఉమ్మడి రాష్ట్రంలో విధుల నుంచి తొలగించబడ్డ తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మాజీ హోంగార్డులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నేటి ఉదయం ముఖ్యమంత్రి నివాసం వద్దకు వచ్చిన హోంగార్డులు మానవతా త్రిఫలంతో తమకు న్యాయం జరిగేలా మానవతా త్రిఫలంతో తమకు న్యాయం జరిగేలా మానవతా త్రిఫలంతో తమకు న్యాయం జరిగేలా మానవతా త్రిఫలంతో తమకు న్యాయం మానవతా దృక్పథంతో తమకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సైతం తమన్న విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించిన గత ప్రభుత్వం తమను తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు భార్య పిల్లలతో జీవనం దుర్లభంగా మారినాయి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

# అత్యాచారం చేస్తానని బెదిరిస్తున్నాడు

హైదరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ పిఎస్ పరిధిలోని ఓ మహిళను తరుచూ ఎదురింటి వ్యక్తి తప్పా తాగి వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తాడని అతను బయటికి వెళ్లినప్పుడల్లా ఇంటి ముందు కూర్చొని తాగుతూ నిన్ను రేప్ చేస్తానని అనడమే కాకుండా మా అత్తయ్యని కూడా మా ఇద్దరు చిన్న పాపలను కూడా తీసుకుపోయి రేప్ చేసి చంపేస్తానని బెదిరిస్తుంటాడని తెలిపింది.

గాంధీనగర్ పిఎస్ పోలీసులకు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసిన కూడా ఇన్స్పెక్టర్ పట్టించుకోవడం లేదని అనంతరం డిసిపి దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేసిన కూడా ఓ సారి చెప్పడంతో తిరిగి మళ్లీ ఆ వ్యక్తి అలాగే ప్రవర్తిస్తున్నాడని గోడు వెళ్లబోసుకుంది. ఇప్పటివరకు అతను 10 సార్లు బెదిరించాడని చెప్పింది.పోలీసులు తమకు న్యాయం చేయాలని తన భర్త, అత్తను తన పిల్లలను రక్షించాలని విన్నవించుకుంది.

## బల్కంపేట అమ్మవారి కళ్యాణం ముహూర్తం పిక్స్

హైదరాబాద్, జూన్ 19

భాగ్యనగర వాసులకు కొంగు బంగారంగా ప్రసిద్దిగాంచిన బల్కంపేట్ ఎల్లమ్మ కల్యాణోత్సవం కూడా ఆషాడ మాసంలోనే అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. హిందూ తెలుగు చాంద్రమానం ప్రకారం బల్కం పేట ఎల్లమ్మ కళ్యాణం ఆషాడ మాసం మొదటి మంగళవారం రోజున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అమ్మవారి కళ్యాణం ఎప్పుడు జరగనుందో తెలుసుకుందాం..తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయంలో జరిగే అత్యంత ముఖ్యమైన వార్షిక పండుగ. బల్కంపేట్ ఎల్లమ్మ కళ్యాణం. ఈ ఏడాది అమ్మవారి కళ్యాణాన్ని 2024 తేదీ జూలై 9న నిర్వహించనున్నారు. మర్నాడు అంటే 2024 తేదీ జూలై 10న రథోత్సవాన్ని జరపనున్నారు. పిలిస్తే పలికే దైవంగా ప్రసిద్దిగాంచిన ఎల్లమ్మ దేవిని రేణుకా దేవి, జల దుర్గా అని కూడా పిలుస్తారు. ఎందుకంటే అమ్మవారి విగ్రహం దాదాపు 10 అడుగులు భూమి క్రింద నీటితో చుట్టుముట్టబడిన శయన స్థితిలో ఉంటుంది.ఎల్లమ్మ తల్లి కళ్యాణం శక్తి మాతను మహాదేవ శివయ్యతో జరిపిస్తారు. ఈ కళ్యాణం చూసి తీర్ధప్రసాదాలు స్వీకరించిన భక్తుల కోరిన కోర్కెలు తీర్చడంతోపాటు పలు అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుందని నమ్మకం. అందుకంటే అమ్మవారి వార్షిక ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఎల్లమ్మ కళ్యాణోత్సవానికి అమ్మవారికి పట్టు వస్త్రాలను తెలంగాణ ప్రభుత్వం అందజేస్తుంది. కల్యాణం జరిగిన మర్నాడువార్షిక రథోత్సవం జరుగుతుందిఉత్సవాల్లో భాగంగా భక్తులు వివిధ రకాల నైవేద్యాలను సమర్పిస్తారు. ప్రధానంగా అమ్మవారికి చీరలు, గాజులతో పాటు ఇతర సౌందర్య ఉత్పత్తులను భక్తులు నైవేద్యంగా సమర్పిస్తారు. కొంతమంది భక్తులు వేప ఆకులతో అలంకరించిన పాల కుండలను తీసుకువెళతారు. ఉత్సవాల్లో పసుపును విరివిగా ఉపయోగిస్తారు.

## ఉరించి... ఊసూరుమనిపిస్తున్న వానలు

అదిలాబాద్, జూన్ 19,

సకాలంలో నైరుతి రుతు రుతు పవనాలు వస్తాయనే వాతావరణ శాఖ సమాచారంతో రైతులు ముందస్తు చర్యలు చేపట్టారు. మృగశిర కార్తెలో మంచి వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతులు పత్తి విత్తనాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. వరుణుడి అలకతో వర్షాల జాడ లేకుండా పోయిందని కర్షకులు బెంగతో ఉన్నారు.నీటి వనరులు ఉన్న కొందరు విత్తనాలకు నీటి తడులిచ్చే పనులు ప్రారంభించారు. ప్రతిరోజు సాయంత్రం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం దట్టమైన కారుమబ్బు లతో మేఘావృతమై రైతులను ఊరించిన వరుణుడు ఆయా గ్రామాల్లో చిరుజల్లులతోనే సరియడుతున్నాడు.వాతావరణంతో ఎంతో వర్షం కురుస్తుందని ఆశించిన రైతులకు బెంగ తప్పడం లేదు. ఆరంభంలోనే ఈ పరిస్థితులు నెలకొనడంతో ఆవేదనకు గురవుతున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ లోని కొన్ని ప్రాంతాల్లో ఒకటి రెండు మార్లు వర్షాలు కురిసాయి.కొన్ని చోట్ల ఎండలు మరింత మండుతుండడంతో గ్రామాల్లో చెరువులు, కుంటల్లో ఉన్న నీరంతా ఎండిపోయింది. పశుపక్ష్యాదులకు తాగునీటికి తండ్లాట తప్పడంలేదు. కడెం జలాశయం ఎగువన ఒక్క వర్షం కురిసినా కొంతమేర వరదనీరు ఈపాటికి వచ్చేది.ఎగువప్రాంతాల్లోనూ వర్షం కురవక కడెంకు



ఇంఫ్లో సున్నాగా ఉంది. మునుపెన్నడూ లేనివిధంగా కడెం జలాశయంలో నీటిమట్టం 671 అడుగులకు తగ్గిపోయింది. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 700 అడుగులు కాగా కనిష్ఠ స్థాయి నీటిమట్టం 675 అడుగులు కలదు, ఈసారి జలాలు అడుగంటిపోవడంతో బురదమట్టి చాలామేరకు తేలి కొంతమేర ఎడారి తలపిస్తోంది.నీటిమట్టం తగ్గి మిషన్ భగీరథ ఇన్టేక్ వెలకు నీరందని పరి స్థితి నెలకొంది. అధికారులు కష్టంగా కొంతమేర గ్రామాలకు తాగునీటీ ని సరఫరా చేస్తున్నారు. నీటిమట్టం అడుగంటడంతో జలాశయంలో సందర్శకులతో తిరిగే పర్యాటకశాఖ పడవ మూలనపడింది.జూన్ రెండో వారం నడుస్తున్నా ఒక్క తేలికపాటి వర్షంకూడా కురవకపోవడంతో వరదనీరు రావడంలేదు. గ్రామాల్లో చెరువులు, కుంటలూ నీరులేక బోసిపోయి కనిపిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో గల స్వర్ణ, గాడ్డెనవాగు, కడం, ఛానక కోరట, పలు మేజర్ నీటి జలాశయాలు సైతం ఎగువన వర్షాలు కురియక వరద నీరు చేరాకపోవడంతో అడగంటినాయి. వరుణా కరుణిం చవా.. అంటూ ఆకాశానికి మొఖం పెట్టి చూస్తున్నారు రైతులు. అనేక చోట్ల పైపులు ద్వారా విత్తనాలు ఎండిపోకుండా నీరు కట్టే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని చోట్ల బిందెలతో విత్తనాలు తడుపుకుంటున్నారు.

# మళ్లీ ప్రజాక్షేత్రంలోకి గులాబీ బాస్

హైదరాబాద్, జూన్ 19, (న్యూస్ పల్స్)

ఆర్ఎస్‌ను ట్రాక్‌లో పెట్టడంపై ఆ పార్టీ అధినేత కేసీఆర్ దృష్టిసారించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్.. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని ఎదుర్కొంది. తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒక్క స్థానంలో కూడా గెలవలేక ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ చతికిలపడింది. ఈ ఓటమి తర్వాత పార్టీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయబోతున్నారు కేసీఆర్. దీనికి సంబంధించిన కసరత్తును ఆయన ఇప్పటికే మొదలుపెట్టినట్లు ఆ పార్టీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.మరోసారి ఉద్యమ పార్టీ లక్షణాలను పార్టీకి తీసుకొచ్చే



దిశగా కేసీఆర్ కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. 14 ఏళ్ల తెలంగాణ ఉద్యమంలో పార్టీ గ్రామస్థాయిలో కూడా బలంగా ఉండేది. ప్రత్యేకంగా గ్రామస్థాయిలో పార్టీకి నాయకులంటూ లేకపోయినా ప్రజలే కార్యకర్తలుగా పని చేశారు. పార్టీ అనుబంధ సంఘాలు కూడా బలంగా పనిచేశాయి. ఉద్యమ సమయంలో ప్రతి రంగానికి ఒక అనుబంధ సంఘాన్ని ఏర్పాటు చేశారు కేసీఆర్. ఆటో యూనియన్ నుంచి సింగరేణి వరకు ప్రతి రంగానికి అనుబంధ సంఘం ఉంది. కానీ 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీతో సహా అనేక అనుబంధ సంఘాలు బలహీనపడ్డాయి. పార్టీకి అనుబంధంగా పనిచేసే టీచర్స్ యూనియన్ కూడా ఉనికి కోల్పోయింది. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో చురుగ్గా పనిచేసిన పార్టీ విద్యార్థి అనుబంధ సంఘం టిఆర్ఎస్వి గత పదేళ్లగా ఎక్కడా పెద్దగా కార్యక్రమాలు చేపట్టలేదు. యూత్ విభాగానికి అసలు నాయకత్వమే లేకుండా పోయింది.ఇక పార్టీ విషయానికొస్తే పొలిటికల్ బ్యూరో గత పదేళ్లుగా క్రియాశీలకంగా పనిచేయలేదు. పార్టీకి జిల్లా అధ్యక్షులున్నా పూర్తిస్థాయి జిల్లా కమిటీలు లేవు. ఇక రాష్ట్ర కమిటీలో అన్ని బాధ్యతల్ని భర్తీ చేయలేదు. జిల్లా అధ్యక్షులుగా ఎమ్మెల్యేలు, ఎంపీలను నియమించడం వల్ల అక్కడ కూడా అనేక సమస్యలు తలెత్తాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ఎదురుదెబ్బ తగలడంతో.. కేసీఆర్ నష్టనివారణ చర్యలకు పూనుకుంటున్నారు. పార్టీని ట్రాక్‌లో పెట్టడంపై ఫుల్ ఫోకస్ చేసిన ఆయన.. ఈ దిశగా పార్టీలో ప్రక్షాళన చేవట్టడంపై దృష్టిసారించారు.గత కొద్ది రోజులుగా ఫామ్ హౌస్‌లోనే ఉన్న గులాబీ బాస్.. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారటబీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నందున.. ఇక ప్రజా సమస్యలపై పోరాడేందుకు పార్టీని సమాయత్తం చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. ప్రజా పోరాటాలను విజయవంతం చేయడంలో అనుబంధ సంఘాలు, జిల్లా కమిటీలు చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరముందని భావిస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేలు మాత్రమే పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఉన్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను పక్కనపెట్టి యువతకు జిల్లా అధ్యక్షులుగా అవకాశాలు ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కమిటీల నియామకం కోసం ఒక అడహక్ కమిటీ వేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అలాగే పొలిట్ బ్యూరో సహా రాష్ట్ర కమిటీని పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని భావిస్తున్నారు. మండలాల వారిగా.. గ్రామాల వారిగా జెండా పండుగ నిర్వహించి కొత్త కమిటీలు పని చేయనున్నాయి.కేసీఆర్ కూడా ఏదో ఒక కార్యక్రమం పేరుతో ప్రజల్లోకి వెళ్లేందుకు.. రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేపట్టాలని భావిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. జిల్లా కమిటీలు, అనుబంద సంఘాలతో ఎప్పటికప్పుడు సమావేశమవుతూ పార్టీ కార్యక్రమాలకు దిశానిర్దేశం చేయనున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీకి పూర్వ వైభవం సాధించాలని కేసీఆర్ ఉవ్విళ్లూరుతున్నారు.

# కర్రపూజ పూర్తయింది...70 అడుగుల గణేశుడు

వినాయక చవితి కోసం ఖైరతాబాద్‌లో నెలకొల్పే భారీ గణపతి విగ్రహం ఎత్తు ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. ఈ అత్యంత ఎత్తైన విగ్రహం తయారీ మొదలుపెట్టినప్పటి నుంచి ప్రతిష్ఠించి, పూజలందుకొని నిమజ్జనం జరిగే వరకూ ఏటా ఎంతో ప్రత్యేకత సంతరించుకుంటుంది. అంతటి ప్రాముఖ్యం ఉన్న ఖైరతాబాద్ గణేషుడి విగ్రహం తయారీ కోసం తొలుత కర్ర పూజ నిర్వహించడం ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తుంది. ఆ కర్రపూజను నేడు నిర్వాహకులు జరిపారు.ఈ ఏడాది సెప్టెంబర్ 7న వినాయక చవితి పండుగ రానుంది. అప్పుడు ప్రతిష్ఠించబోయే భారీ గణనాథుడి విగ్రహ తయారీ పనులు ఇప్పటి నుంచే తయారు చేయడం మొదలుపెట్టారు. ఈ వినాయక విగ్రహం ఏర్పాటుకు కర్ర పూజ జరిగింది. ఈ కర్ర పూజ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు.కర్రపూజ పూర్తయిన తర్వాత ఎమ్మెల్యే దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. ఖైరతాబాద్‌లో పర్యావరణహిత విగ్రహం ఏర్పాటు చేస్తామని.. సంప్రదాయం ప్రకారం నేడు కర్రపూజ చేసి విగ్రహం తయారీని ప్రారంభించామని చెప్పారు. గతంలో కంటే మెరుగ్గా ఉత్సవాలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించిన విషయాన్ని చెప్పారు. దాని ప్రకారం అన్ని విభాగాలను సిద్ధం చేస్తున్నామని.. రాబోయే రెండుమూడు రోజుల్లో ఉత్సవ కమిటీలతో సమావేశం జరుపుతామని దానం నాగేందర్ చెప్పారు. వచ్చిన ప్రతి భక్తుడికి ప్రసాదం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని దానం నాగేందర్ చెప్పారు.ఖైరతాబాద్ గణపతిని నెలకొల్పడం మొదలుపెట్టి.. ఈ ఏడాదితో 70 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈసారి 70 అడుగుల మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించాలని నిర్వహకులు నిర్ణయించినట్లు దానం చెప్పారు. గతేడాది ఇక్కడ ఖైరతాబాద్ వినాయకుడు 45 నుంచి 50 టన్నుల బరువుతో 63 అడుగుల ఎత్తులో నెలకొల్పిన సంగతి తెలిసిందే. ఇప్పుడు పూర్తి మట్టి విగ్రహంగా సరికొత్త రికార్డు సృష్టించనున్నాడు.

# 5 నెలలు..18 లక్షల ఉల్లంఘనలు

హైదరాబాద్, జూన్ 18,

నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనల కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పోలీసులు ఎన్నిసార్లు చెప్పిన ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నారు వాహనదారులు. వివిధ కారణాల చేత పట్టుబడిన వాహనదారులు ఏం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు విపరీతంగా జరుగుతున్నా తమకేంటిలే అన్న ధీమాని వ్యక్తం చేస్తూ.. వాహనదారులు ప్రయాణిస్తున్నారు. అడుగడుగునా ట్రాఫిక్ చెకింగ్ పాయింట్స్ ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ.. రూల్స్?ను అతిక్రమిస్తూ ప్రయాణం చేస్తున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నగరంలో పెరిగిపోవడంతో.. ఐదు నెలల్లోనే 18 లక్షలకు పైగా కేసులను నమోదు చేశారు ట్రాఫిక్ పోలీసులు.హెల్మెట్ ధరించరు రాంగ్ రూట్లో వెళ్తూ ఉంటారు సీసీ కెమెరాలు ఉన్నా వాటి కళ్ళు కప్పి నెంబర్ ప్లేట్లను సైతం కనపడుండకుండా మాస్కులతో.. చున్నీలతో కవర్ చేస్తారు. ఎన్ని సమావేశాలు, సదస్సులు నిర్వహించినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు వాహనదారులు. ఈ ఏడాది వ్యవధిలోని ఏకంగా 18 లక్షలకు పైగా కేసులను నమోదు చేశారు ట్రాఫిక్ పోలీసులు. నగరంలో చాలా ప్రాంతాల్లో యూటర్న్ ఎక్కువగా దూరంగా ఉండడంతో.. రాంగ్ రూట్లోకి వెళ్లి ప్రాణాలను కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, మైనర్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్లు లేకపోవడం, రాంగ్ పార్కింగ్ ఈ విధంగా ఎన్నో కేసులను నమోదు చేస్తున్నారు పోలీసులు. అయినప్పటికీ ఏమాత్రం చలనం లేకుండా తమ ఇష్టానుసారంగా వెళుతూ ఉన్నారు. వాహనదారులు అయితే 2023లో 9,40, 670 కేసులు హెల్మెట్ లేని వారిపై కేసులను నమోదు చేయగా 2024లో 11,46,698 కేసులను నమోదు చేశారు. ఈ విధంగా 2023లో 14,27,933 కేసులు నమోదు కాగా ఈ ఐదు నెలల్లో 18 లక్షలకు పైగా కేసులను నమోదు చేశారు ట్రాఫిక్ పోలీసులు. దీనిని బట్టి చూస్తే ఈ రూల్స్?ను మరింత కఠినతరం చేసి ట్రాఫిక్ ఉల్లంఘనలను అతిక్రమించకుండా చర్యలు తీసుకోవాలి అని కొంతమంది వాహనదారులు తెలియజేస్తున్నారు.

నగరంలో గంజాయి చాక్లెట్లు

గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్మడం ట్రెండింగ్‌గా మారింది. ఆశా చాక్లెట్, న్యూట్రిన్ చాక్లెట్, క్యాడ్‌బరీ చాక్లెట్‌లాగే గంజాయి చాక్లెట్ కూడా మార్కెట్‌లో ఈ మధ్య కనిపిస్తుంది. గంజాయితో తయారైన మాయదారి చాక్లెట్ ముక్కలివి. చాక్లెట్టే కదా అని ఓపెన్ చేస్తే? లోపల నల్లటి పదార్థం.. గుప్పుమన్న గంజాయి వాసన. ఒక్కో చాక్లెట్ ధర మినిమమ్ 15 రూపాయలు. మాగ్జిమమ్ 30 రూపాయలు. మొదట్లో ఫ్రీగానే ఇచ్చి తియ్యటి మాటలతో చిన్నపిల్లల్ని మచ్చిక చేసుకుంటారు.. వాళ్లు కొద్దికొద్దిగా బానిసలుగా మారాక.. పైసలిస్తేనే చాక్లెట్లంటూ కౌంటర్లు తెరుస్తారు. మత్తు చాక్లెట్లు తయారుచెయ్యడం, తెలిసిన వాళ్లకి మాత్రమే అమ్మడం, స్కూల్స్, కాలేజీల దగ్గర పాన్ డబ్బాలే అడ్డాలుగా చిన్నపిల్లలే టార్గెట్‌గా అమ్మకాలు జరపడం.. ఇలా కల్చర్ ఇప్పుడు గుబులు రేపుతోంది. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న గంజాయి చాక్లెట్ ప్యాకెట్లను శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ప్రాంతంలో ప్రతి శనివారం జరిగే పార్టీలపై ఎక్సైజ్ పోలీసులతో కలిసి డ్రగ్ టాస్క్‌ఫోర్స్ బలగాలు సోదాలు నిర్వహిస్తుంటాయి. ఈ క్రమంలోనే ఓ వ్యక్తి బైక్‌పై గంజాయి చాక్లెట్స్ తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.7 లక్షలు విలువైన 1.65 కిలోల గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.. రాష్ట్రంలో గంజాయి వినియోగం పెరుగుతోన్న దృష్ట్యా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## కరీంనగర్ లో కరుణించని వరుణుడు

కరీంనగర్, జూన్ 18,

సీజన్లో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ శాస్త్రవేత్తలు అంచనా వేసినా కురవాల్సిన వర్షపాతం కన్నా కరీంనగర్ జిల్లాలో 40, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 30, జగిత్యాల జిల్లాలో 35, పెద్దపల్లి జిల్లాలో 48 శాతం తక్కువ వర్షపాతం నమోదు అయింది. ఉమ్మడి జిల్లాలోని 7 శాతం మండలాలు మినహా 93 శాతం మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది.గత యాసంగిలో ఆయకట్టుకు ముందుగానే ప్రాజెక్టుల నీటిని నిలిపి వేయటం. ఎల్లంపల్లి ప్రాజెక్టునుంచి ఎత్తిపోతలు లేకపోవటం, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో భూగర్భ జలమట్టం సగటున 49 మీటర్ల నుంచి 13.2 మీటర్లవరకు పడిపోయి పంటలసాగుకు ప్రతిబంధకంగా మారింది.ఉమ్మడి జిల్లాలో జూన్ ఫస్ట్ నుంచి ఇప్పటివరకు కురియాల్సిన సాధారణ వర్షపాతం అంటే తక్కువ వర్షపాతం నమోదయింది. కరీంనగర్ జిల్లాలో 75.5 మిల్లీమీటర్ల సాదారణ వర్షపాతం కురియాల్సి ఉండగా 47 మిల్లీమీటర్లు కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 81.0 మిల్లీ మీటర్లకు 49.2 ఎంఎం లు, జగిత్యాల జిల్లాలో 83.3 ఎంఎం లకు 53.9 ఎంఎంలు, పెద్దపల్లి జిల్లాలో 79.9 ఎంఎం లకు 41.5ఎంఎంల వర్షపాతం నమోదైంది.రైతులు ఏప్రిల్, మే మాసాల్లోనే దుక్కులు చేసుకుని ఎరువులు, పూడికమట్టి పొలాల్లోకి పోసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో జూన్ మొదటి వారం నుంచే పసుపు, మక్కలను విత్తుకోవటం, పత్తివిత్తనాలు నాటడం, జనుము, జీలుగ, పెసర, సోయాబీన్ వంటి పంటల విత్తనాలను విత్తుకోవటాన్ని రైతులు ఆరంబించినా వర్షాల్లేక వేసిన విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేకపోవటం, ఎండల తీవ్రత మళ్లీ పెరగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బావులు, బోర్లలో నీటిలభ్యత ఉన్న రైతులు వరినార్లను పోస్తుండగా మరో పక్షం రోజులు వర్షంలేకుంటే సాగుబడి కష్టసాధ్యమని రైతులు పేర్కొంటున్నారు.ఉమ్మడి జిల్లాలో వానాకాలం వరి ప్రధాన పంటకాగా స్వర్ణవంటి దీర్ఘకాలిక రకాల వరినార్లకు అదనుదాటనుంది. ఉమ్మడి జిల్లాలో అన్ని పంటలసాగు 12 లక్షల ఎకరాలు దాటనుందని అంచనా వేయగా ఇందులో వరి, పత్తి, మక్క, పసుపు ప్రధాన పంటలుగా ఉండనున్నాయి. ఇప్పటివరకు భారీవర్షం నమోదుగాకపోవటంతో భూగర్భ జలమట్టం పెరగకపోగా నేలలోని వేడిమి తగ్గక విత్తనాల మొలకశాతం గణనీయంగా తగ్గనుంది. నాలుగు జిల్లాల్లో ఇప్పటి వరకు సాగు విస్తీర్ణం కనీసం 7 శాతానికి కూడా చేరలేకపోవటం ప్రతికూలతను వెల్లడిస్తుండగా ముసురు వర్షం కురిస్తేనే వాతావరణం చల్లబడి, భూగర్భ జలమట్టం పెరిగి పైరుసాగుకు దోహదపడనుంది.మరోవైపు శ్రీరాంసాగర్, మిడ్ మానేరు, లోయర్ మానేర్, శ్రీపాదఎల్లంపల్లి తదితర అన్ని ప్రాజెక్టుల్లోనూ నీటినిల్వలు కనిష్టస్థాయికి చేరి వరద రాకుంటే పంటలకు ఏమాత్రం విడుదల చేయలేని పరిస్థితి ఉంది. వరుణుడి కరుణ పైనే పంటలసాగు విస్తీర్ణం ఆధారపడి ఉంది.పంటల ఆదను దాట లేదని, రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు.తడిపొడి దుక్కులో చిత్త నాలువేసి నష్టపోవద్దు. ఆరుతడి పంటలను కనీసం 70-80 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదై వాతావరణం చల్లబడిన తరువాతనే విత్తుకోవాలని సూచిస్తున్నారు. సోయా బీన్. మక్క, పసుపు, పత్తి, కంది, పెసర మినుమువంటి వాటిని పంటల రకాలు, కాలపరిమితిని బట్టి జులై నెలాఖరు వరకు విత్తు కోవచ్చని చిగురుమామిడి మండల వ్యవసాయ అధికారి రంజిత్ రెడ్డి తెలిపారు. నీటి వసతిగల రైతులు వరినార్లు ప్రస్తుతం పోసుకోవచ్చని సూచించారు.

## ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం వేడుకలు

తాండూరంమంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండల పరిధిలోని రేచిని రైల్వేస్టేషన్ రోడ్ నందు గల సేవాజ్యోతి కాలనీలో ఉన్న శ్రీ స్వశక్తి భారత్ సేవాట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న సేవా జ్యోతి శరణాలయం లో హిందూ సామ్రాజ్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు, ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం శ్రీ స్వశక్తి భారత్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీదేవి గజ్జెల్లి సగర మాట్లాడుతూ,జ్యేష్ట శుద్ధ త్రయోదశి నాడు ఛత్రపతి శివాజీ మహారాజ్ తో హిందూ సామ్రాజ్య స్థాపన జరిగింది,పట్టాభిషేకంతో హిందూ బంధువులు ఉత్సవాలు జరుపుకుంటున్నారు, జీజీయభాయి ఛత్రపతి శివాజీ ని ఉత్తమ దేశభక్తితో దైవశక్తి తో చిన్ననాటి నుంచే తీర్చిదిద్ది హిందూ ధర్మం నిలబెట్టి హిందూ సామ్రాజ్య స్థాపనకు పునాది వేసిన వీర మాత ఐనది, మనం మన పిల్లలకు దేశభక్తి, దైవభక్తి సేవానిరతి తో మంచి విషయాలు నేర్పించాలి, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు కాపాడుకోవాలి అని పేర్కొన్నారు శ్రీదేవి మల్లేశం గజ్జెల్లి సగరలు మాట్లాడుతూ. ఈ కార్యక్రమంలో సేవాజ్యోతి శరణాలయం మానసిక మతిస్థిమితం లేని మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీవో ఉద్యోగి నిర్వాకం!

## చల్లగా బీరు కొడుతూ విధులు నిర్వహణ.. కమిషనర్ సీరియస్

మహబూబాబాద్, జూన్ 19:మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని ఓ ఉద్యోగి ఏకంగా ఆఫీస్‌లోనే దుకానం పెట్టాడు. బిందాస్‌గా బీరు కొడుతూ కొలువు వెలగబెడుతున్నాడుఇందుకు సంబంధించిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సదరు ఉద్యోగి నిర్వాకం వెలుగు చూసింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు అతడిని సర్వీస్ నుంచి తొలగించి ఇంటికి పంపారు. ఈ షాకింగ్ ఘటన జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. మహబూబాబాద్ ఆర్టీవోలో ఉద్యోగి నిర్వాకం.. బీరు తాగుతూ విధులుమహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన సురేష్ డేటాబేస్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతను అప్లికేషన్, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ మేనేజ్‌మెంట్ సర్వీస్ వంటి పనులు చేస్తుంటాడు. మంగళవారం ఆఫీస్‌కి వచ్చిన సురేష్ వర్కింగ్ టైంలో తన సీటులో కూర్చుని, టేబుల్‌పై బీరు పెట్టి.. తాగుతూ విధులు నిర్వర్తించాడు. మత్తులో తూలుతూ పనులు చేస్తున్న అతన్ని లైసెన్స్ కోసం వెళ్లిన ఓ వ్యక్తి చూసి, తన ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో అది కాస్తా వైరల్‌గా మా రింది. దీనిపై సమాచారం అందుకున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. వెంటనే సురేశ్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అతని స్థానంలో మరో ఉద్యోగిని రిక్రూట్ చేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్‌లో డీటీఓగా పనిచేస్తున్న సురేశ్‌ను 'దుష్ప్రవర్తన', 'రిక్రూట్‌మెంట్ నిబంధనలు, షరతుల ఉల్లంఘన కారణంగా అతన్ని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.కాగా ఇటీవల కాలంలో మహబూబాబాద్ ఆర్టీఏ కార్యాలయం వివాదాలకు నిలయంగా మారింది. ఇటీవల ఈ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి.. ఆరుగురు ఏజెంట్లు, ఓ డ్రైవర్ వద్ద రూ.46 వేల నగదు సీజ్ చేశారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

మందమర్రి, జూన్ 19 (భారతశక్తి ప్రతినిధి):కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలోని సంజయ్ గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణు లు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ కుటుంబం దేశానికే అంకితమైందని వారి నానమ్మ ఇందిరా గాంధీ, వారి తండ్రి రాజీవ్ గాంధీ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల కష్టనష్టాలను తీర్చిన గొప్ప నాయకులని అన్నారు. రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ అలాగే వారి తల్లి జాతీయ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ 1400 మంది విద్యార్థులు ఆత్మబలిదానాలను చూసి చలించిపోయి. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన గొప్ప నాయకురాలు సోనియా గాంధీ అని తెలిపారు. రాహుల్ గాంధీ పేద ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ని ముందుకు నడిపిస్తూ, ప్రజల్లోకి తీసుకువెళ్తు ప్రజల కష్టనష్టాలు తెలుసుకుంటున్న గొప్ప నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు. ఈ దేశం ఒక భయానక వాతావరణంలో ఉంటే రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర పాదయాత్ర ద్వారా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దాదాపు 4వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకుని ముందుకు నడుస్తున్న గొప్ప నాయకుడని అన్నారు. రాహుల్ గాంధీ ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని, రాబోయే రోజుల్లో మన దేశానికి ప్రధానమంత్రి రాహుల్ గాంధీ



కావాలని భగవంతుని కోరారు.

ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు దేవి భూమయ్య, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నెరువట్ల శ్రీనివాస్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని, మైనార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి జమీల్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఎండి ఆఫీస్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కనకం రాజు, చెన్నూరు యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వడ్లూరు సునీల్ కుమార్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పిండి ఐలయ్య, మంకు రమేష్, కడలి శ్రీనివాసరావు, అందుగుల లక్ష్మణ్, తుంగపిండి విజయ్, రావుల శ్రీనివాస్, కవిత, గడ్డం అన్వేష్, రమేష్, వీరన్న, సాగర్, రాజేష్, వేణు, సత్యం, సునర్కర్ రాంబాబు, పారుపల్లి శివరామకృష్ణ, ప్రదీప్, సాయి కిరణ్, గంగిపల్లి రాజేశం, ఆంజనేయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జి బి ఎన్. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్.

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 19: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన సేవలు అందించాలనీ అన్నారు. అలాగే పేదలు, మధ్యతరగతి వారిని దృష్టిలో ఉంచుకొని రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. సోమవారం భైంసా పెట్టంలోని.జి బి ఎన్. ప్రైవేట్ ఆసుపత్రిని ప్రారంభోత్సవానికి ముఖ్యాతిథులు గా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి యాజమాన్యం వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో సేవలందించాలని తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను ఆసుపత్రి యాజమాన్యం శాలువాతో ఘనంగా సన్మానించారు. డాక్టర్ జవహర్లాల్ మాట్లాడుతూ పట్టణ ప్రజలపాటు చుట్టుపక్కల గ్రామ ప్రజలు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్. మాజీ ఎమ్మెల్యేలు జి విట్టల్ రెడ్డి,నారాయణరావు పటేల్, భైంసా ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ యు.కాశీనాథ్, డాక్టర్ దామోదర్ రెడ్డి,పలువురు డాక్టర్లు,వ్యాపారవేత్తలు మరియు ఐదవ వార్డ్ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్ మరియు పట్టణ నాయకులు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.







# కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారతశక్తి):కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు వద్ద నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము అధికారంలోకి వస్తే బీసీ కుల గణన చేసి స్థానిక సంస్థలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం గా పెంచి వాటిని ఏ,బి,సి,డి గ్రూపులుగా వర్గీకరిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీ జనాభా ఉంటే స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లు కేవలం 18 శాతం మాత్రమే అంటే ఇది పూర్తిగా బీసీల పట్ల వివక్షగా భావిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకుండా బీసీలకు రావలసిన ప్రజాస్వామ్యవాట ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో



ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, బీసీ నాయకులు తులా మధుసూదన్, కర్రె లచ్చన్న, నెన్నెల నరసయ్య, అక్కల రమేష్, కీర్తి బిక్షపతి, అరెందుల రాజేశం, చంద్రగిరి చంద్రమౌళి, బండ సతీష్, నగునూరి లక్ష్మణ్, మామిడి శెట్టి వెంకటేష్, బైర మల్లేష్, ధర్మాజీ సంజీవ్, కొంతం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సాంస్కృతిక పోటీలు

మందమర్రి, జూన్ 19 (భారతశక్తి ప్రతినిధి):పట్టణంలోని సిఈఆర్ క్లబ్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు అట్టహాసంగా ముగిశాయి. తెలంగాణ రాష్ట్ర బాషా, సంస్కృతి శాఖ నృత్య, కళాకారుల అసోసియేషన్, టాలెంట్ డాన్స్ అకాడమీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ వేడుకకు పలు ప్రాంతాల నుంచి నృత్య కళాకారులు భారీగా హాజరయ్యారు. శాస్త్రీయ, జాన పద, సినిమా పాటల నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం నరేష్, అంజనీ పుత్ర రియల్ ఎస్టేట్ ఎండి పిల్లి రవి, గుడ్ల. రమేష్ లు పోటీలకు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో నృత్య కళాకారులకు కొదువలేదని, సినిమా రంగాల్లో రాణించే సత్తా ఉందన్నారు. ఇలాంటి వేదికలతో యువత ప్రతిభ బయటకు రావడంతో పాటు గుర్తింపు పొందుతారన్నారు. అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు ఏర్పాటు చేసిన శాస్త్రీయ మెగా ఛాంపియన్ షిప్ పోటీలో జగిత్యాల జిల్లా, మంచిర్యాల జిల్లాలకు చెందిన కళాకారులు పోటీ పడగా గెలుపొందిన శివాని గ్రూప్ కు అంజనీ పుత్ర రియల్ ఎస్టేట్ ఎండీ పిల్లి రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం నరేష్, గుడ్ల.రమేష్ లు ఛాంపియన్ షిప్ అందజేశారు. పోటీలో గెలుపొందిన



కళాకారులు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నృత్య, కళాకారుల అసోసియేషన్, టాలెంట్ డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టర్ అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు, గ్రాండ్ మాస్టర్ జూపక.గోపి, సీనియర్ మాస్టర్ ఉప్పులేటి నరేష్, అడ్లూరి లక్ష్మణ్, రమేష్, వసుధ, అర్చన, వనిత, శివాని తదితరులు మాస్టర్లు వివిధ జిల్లాల నుండి 300 మంది నిజామాబాద్, జగిత్యాల, కాగజనగర్ ప్రాంతల నుండి కళాకారులు విచ్చేసినటువంటి కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాలింగి గ్రామ అభివృద్ధి కమిటీ పై కఠిన చర్యలు తీసుకోవాలిలి

**లిగీతా కార్మికులపై దాడి అమానుషం హే హమైన చర్య**

**లిసకాలంలో స్పందించని పోలీసులు**

**లిఅ మరవేణి నర్సాగౌడ్,మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు**




భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 19:నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం తానూర్ మండలంలోని మహాలింగి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు స్థానిక గీతా కార్మికుల ఇళ్లపైకి వెళ్లి చేతికందిన వస్తువులతో దాడి చేయడంతో ఇద్దరు గీతా కార్మికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటనపై మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ తీవ్రంగా స్పందించారు. గత సంవత్సరం 4.5లక్షలు ఉంటే ఈ సంవత్సరం 8 లక్షలు ఇవ్వాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేయగా గీతా కార్మికులు అంత పెద్ద మొత్తం ఇవ్వలేమని అన్నారు. మేము అడిగినంత ఇవ్వక పోతే కళ్ళు దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. గత ఆరు నెలల నుండి గ్రామంలో కళ్ళు దుకాణాలు మూసివేసి చెట్ల వద్దనే కార్మికులు కళ్ళు అమ్ముకుంటున్నారు. ఇప్పుడు అక్కడ కూడా అమ్మవద్దని ఆంక్షలు విధిస్తూ దాడి చేయడం సబబు కాదని అన్నారు. ఈ విషయంపై తానూర్ పోలీస్ స్టేషన్ లో




బాధితులు ఫిర్యాదు చేసి 24 గంటలు గడిచినా గ్రామ అభివృద్ధి కమిటీ లపై చర్యలు తీసుకోకపోగా బాధితులను ఆసుపత్రికి కూడా తీసుకెళ్లకుండా కేసును నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేనివిధంగా మహాలింగి గ్రామంలోనే గ్రామ అభివృద్ధి కమిటీ లు దౌర్జన్యం, దాడులకు పాల్పడడం శోచనీయమని దీనిని మోకుదెబ్బ జాతీయ సంఘం తీవ్రంగ కండిస్తున్నామన్నారు. నిర్మల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్. పి. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకుని, గీతాకార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

# మహాత్మ జ్యోతిబాపూలే విద్యాలయాల టెండరు ప్రక్రియలో పాల్గొన్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 19:బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మ జ్యోతిబాపూలే విద్యాలయాలకు సంబంధించిన టెండరు ప్రక్రియలో పాల్గొన్న అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఆర్ఓ భుజంగరావ్, డి సి ఓ సంతోష్, ఆర్ సి ఓ గోపీచంద్ రాథోడ్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు శంకుస్థాపన చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూన్ 19:హుజూర్ నగర్ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు చుట్టుపక్కల ప్రాంతాల ఫ్యాక్టరీలలో ఉపాధి లభించేలా స్వశక్తితో ఉపాధి పొందేలా సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గట్టు వద్ద బుధవారం నూతన ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ) కళాశాల భవన నిర్మాణ పనులకు 40 కోట్ల రూపాయలతో 3 ఎకరాల స్థలం లో పౌరసరఫరాల శాఖ మరియు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువతకు నియోజకవర్గంలోని ఫ్యాక్టరీలలో ఉపాధి పొందేలా ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా కోర్సులను ప్రవేశపెట్టడం జరుగుతుందని తద్వారా నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. తాను గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన సింగిల్ బెడ్ రూమ్ ఇండ్లు 80 శాతం పూర్తయినా మిగతా 20 శాతం పనులు గత ఐదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని తన హయాంలో శంకుస్థాపన చేసిన తన



కలను మళ్లీ తానే మంత్రిగా సింగిల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేయడం జరుగుతుందని త్వరలోనే పట్టణ ప్రజలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి నిరుపేదల సొంత ఇంటి కలను నిజం చేసేలా ఇండ్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ జాయింట్ డైరెక్టర్ ఎస్ వి కె నగేష్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ రోజా, అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, గవర్నమెంట్ ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ ఎస్ గోపాల్ నాయక్, మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చన రవి వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సికిల్ సెల్ వ్యాధి పట్ల అప్రమత్తముగా ఉండాలి:డి ఎం హెచ్ ఓ కోటాచలం

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూన్ 19:సికిల్ సెల్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తముగా ఉండాలని డి.ఏం అండ్ హెచ్.ఓ. డాక్టర్ కోటాచలం కోరారు బుధవారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్, సూర్యాపేట



వారి అనుమతితో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరములో డి.టి.డి.ఓ. కె.శంకర్ ఆధ్వర్యములో సికిల్ సెల్ వ్యాధి పట్ల గిరిజన విద్యార్థిని / విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సికిల్ సెల్ వ్యాధి అనేది ఎర్ర రక్త కణాల ఆకారం సికిల్ (కొడవలి)గా మారడముతో రక్తప్రసరణ జరగకపోవడముతో అవయవాలలో ఆక్సిజన్ అందక సికిల్ సెల్ అనీమియా వస్తుందన్నారు. మేనరిక వివాహాలతో కూడా ఈ వ్యాధి సంక్రమించే అవకాశముందన్నారు. చేతులు, కండ్లు, శరీరము తెల్లగా పేలిపోవడముతో ఈ వ్యాధిని గుర్తించవచ్చున్నారు. డి.టి.డి.ఓ. కె.శంకర్ మాట్లాడుతూ ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవము సందర్బంగా జూన్ 19 నుండి జులై 3 వరకు ప్రభుత్వ గిరిజన వసతి గృహాలు / ఆశ్రమ పాఠశాలల యందు సికిల్ సెల్ వ్యాధిపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించి ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించనున్నామన్నారు. వైద్య మరియు ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యములో స్క్రీనింగ్ టెస్టులు చేపించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమములో ప్రత్యేక అధికారి పద్మావతి, సూపరింటెండెంట్ కె.పార్థసారధి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనునయి, డెప్యూటీ డి.ఏం హెచ్.ఓ.లు డాక్టర్ జి. చంద్రశేఖర్, డాక్టర్ ఎండి నిరంజన్, పిఓ, ఎన్.సి.వి.బి.డి.సి. డాక్టర్ నజియా తబుస్సమ్, డెప్యూటీ డెమో ఏ.అంజయ్య, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ బాదే రామన్నకు విప్లవ జోహార్లు అర్పించిన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూన్ 19:సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ బాద రామన్నకు విప్లవ జోహార్లు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ రామన్న తన చిన్నతనం నుండే విప్లవ రాజకీయాలకు ఆకర్షితులై చదువుకునే రోజుల్లోనే పి డి ఎస్ యు లో పనిచేస్తూ విద్యార్థుల సమస్యల పట్ల అనేక ఉద్యమాలు నిర్వహిస్తునే అంచలంచెలుగా ఎదుగుతూ సిపిఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యుడిగా పని చేస్తూన్న క్రమంలో పార్టీ పనిమీద కోదాడ వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించడం జరిగింది. కామ్రేడ్ రామన్న చనిపోయి నేటికీ ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కామ్రేడ్ రామన్నకు విప్లవ జోహార్లు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షుడు కామల్ల నవీన్ కామల్ల శ్రీను అరుణోదయ జిల్లా కమిటీ




సభ్యులు గండు నాగేశ్వరరావు గ్రామ మాజీ సర్పంచ్ మహాశక్తి అంజయ్య సీనియర్ నాయకులు కామ్రేడ్ తాళ్లూరు సూర్యం చెనగాని పెద్ద సాంబయ్య చనగాని లక్ష్మయ్య వల్లపుదాసు లచ్చయ్య జిలకర ముత్తయ్య కొమురయ్య చింతమళ్ళ అంజయ్య ప్రగతిశీల మహిళా సంఘం గ్రామ నాయకులు కామ్రేడ్ వల్లపు దాసు సంతోష సువార్త మల్లమ్మ నరసమ్మ రుతమ్మ తదితరులు పాల్గొన్నారు

# విద్యా,వైద్య అభివృద్ధికి బడ్జెట్ లో తగిన నిధులు విడుదల చేయాలి : బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 19: ప్రభుత్వ రంగంలోని విద్య, వైద్యం అభివృద్ధి కోసం తగిన నిధులు విడుదల చేసి ప్రభుత్వ హాస్పిటల్స్, స్కూల్స్ లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నల్ల సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ వైద్యసంస్థల అదిక ఫీజుల దోపిడిని నియంత్రించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటి సమావేశం డిమాండ్ చేసింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం నల్లకుంట హైదరాబాద్ లో గల బహుజన లెఫ్ట్ పార్టీ- బిఎల్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటి సమావేశానికి నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకోని పేదలకు పంపిణీ చేయాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది పేదలు నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. జూన్ 30 వరకు స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్ అనే అంశం మీద జిల్లాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఇంకా కొనసాగించాలని, అలాగే జూలై 4 నాడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా భూ సమస్యపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించాలని ఈ సమావేశం నిర్ణయించినట్లు తెలియజేశారు. ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి బహుజన లెఫ్ట్ పార్టీ- బిఎల్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారంటీల అమలుపై దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్రంలో బిజెపి విస్తరణను అడ్డుకోవడానికి కుల జనగణన జరపడం ద్వారా సామాజిక న్యాయాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బహుజన కమ్యూనిస్టు పార్టీ- బిసిపి రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు పాండురంగ చారి, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, రాష్ట్ర నాయకులు ఎస్.సిద్దిరాములు, మాస్ సావిత్రి, మారోజు సునీల్ కుమార్, ఎం.జంగయ్యలు పాల్గొన్నారు.

# పూసపాటి రిషిత్ పుట్టినరోజు సందర్భంగా ఓపెన్ ఐస్ సొసైటీ ద్వారా నిరుపేదలకు 100 కేజీల బియ్యం పంపిణీ

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూన్ 19: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం పెదవీడు గ్రామానికి చెందిన పూసపాటి నరసింహారావు, రేవతి ల చిన్న కుమారుడు రిషిత్ పుట్టినరోజు సందర్భంగా హుజూర్ నగర్ పట్టణంలో ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో గుర్తించిన మూడు పేద కుటుంబాలకు 100 కేజీల బియ్యాన్ని పంపిణీ చేయడం జరిగింది. శ్రీనగర్ కాలనీకి చెందిన దొంతగాని భద్రమ్మ ఇటీవల భర్త మరణించడంతోపాటు ఒంటరిగా జీవనం గడుపుతూ కంటి ఆపరేషన్ కూడా జరగడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని 50 కేజీల బియ్యాన్ని పుట్టినరోజు జరుపుకుంటున్న రిషి త్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. తిలక్ నగర్ కు చెందిన కోలపూడి మనెమ్మ మరణించడంతో వారి కుటుంబానికి 25 కేజీల బియ్యాన్ని, కుడితొట్టి కమలమ్మ ఇటీవల పెద్దాపరేషన్ జరగడంతో ఒంటరిగా జీవనం సాగిస్తున్న విషయం తెలుసుకొని 25 కేజీల బియ్యాన్ని పంపిణీ చేయడం జరిగింది. పుట్టినరోజు సందర్భంగా పేద కుటుంబాలకు సహాయం చేసిన నరసింహారావును ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పూసపాటి నరసింహారావు, వారి కుమారులు జీవన్, రిషిత్ మరియు సొసైటీ సభ్యులు సులువ శ్రీను, మట్టపల్లి రవీందర్, వల్లపు దాసు కృష్ణ, కోడిమెల లక్ష్మణ్, దొంతగాని బుచ్చిబాబు, పిల్లి శివశంకర్, దగ్గుపాటి రమేష్, కలాం సంపత్ కుమార్ డి .ఎస్.ఆర్. ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు చేసిన తప్పులను సరిచేసి అర్హులకు న్యాయం చేయండి: పోకల వెంకటేశ్వర్లు సిపిఐ మండల కార్యదర్శి

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూన్ 19: రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి రాగానే ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన నిర్వహించి ప్రజల చేత దరఖాస్తులు స్వీకరించిన అధికారులు, వాటిని ఆన్ లైన్, మొత్తం తప్పుల తడకలాగాచేయటం అర్హులైన వారికి అన్యాయం జరిగిందని, ప్రభుత్వం వెంటనే పునర్విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రం లో ఎంపీడీఓ కు వినతి పత్రం అందజేసి మాట్లాడుతూ, ఆరు గ్యారంటీ లలో మొట్ట మొదటి గా ప్రజలకు అమలు చేస్తానని ప్రకటించి, కార్యాచరణ మొదలు పెట్టిన ఫ్రీ కరెంట్ ఆరు నెలలు అయినా అర్హులకు కాకపోవడం చాలా అన్యాయం అని, లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి పోయినారని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అధికారులు చేసిన తప్పును గుర్తించి గ్రామాల్లోకి అధికారులను పంపించి అర్హుల చేత దరఖాస్తులు స్వీకరించి, అర్హులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమం లో కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండ్ల సత్యనారాయణ రెడ్డి, మీసాల యోహాన్,వెంకటరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# గుర్తింపు లేని అల్ఫోర్స్ స్మార్ట్ పాఠశాల కరపత్రాలు దగ్ధం




మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 19 (భారతశక్తి): జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు, గుర్తింపు లేని అల్ఫోర్స్ స్మార్ట్ పాఠశాల కరపత్రాలను ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆల్ఫోర్స్ స్మార్ట్ పాఠశాల ఏర్పాటు చేసి అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నారని, అదే పాఠశాలలో టై, బెల్టు, బుక్స్ అమ్ముతూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఐఐటీ, నీట్, ఫౌండేషన్ అని చెప్తూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ, ధనర్జనే ధ్యేయంగా దోచుకుంటున్నారని అన్నారు. విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆ పాఠశాలను సీజ్ చేసి, వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారికి అనుమతులు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు జుమ్మిడి గోపాల్, జాగిరి రాజేష్, బచ్చలి ప్రవీణ్ కుమార్, షేక్ సల్మాన్ పాషా, చేరాల వంశీ, పురేళ్ల నితీష్, నస్పూర్ అఖిల్, జాడి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పంట రుణాలను అందించడంలో ఉదారంగా వ్యవహరించాలని బ్యాంకర్లకు సూచించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 19: రైతులకు పంట రుణాలను అందించడంలో ఉదారంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రైతులకు రుణాల పంపిణి, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పిఎంజివై, ఎస్సి, ఎస్టీ, సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై బ్యాంకర్ల జిల్లా సమన్వయ కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్ బ్యాంకర్లు వివిధ పథకాల క్రింద యూనిట్ల గ్రౌండింగ్ నిమిత్తం తమకు వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి గ్రౌండ్ అయ్యేలా చూడాలని కోరారు. బ్యాంకుల వారీగా ప్రగతిని సమీక్షిస్తూ గత ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు, టర్మ్ లోన్స్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు, విద్య, గృహ నిర్మాణం, తదితర రంగాలను రూ. 5,569 కోట్లు అందించాలని లక్ష్యం కాగా 78.60 శాతం సాధించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇకనైనా శాఖల అధికారాలు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ వంద శాతం లక్ష్యాలను సాధించుటకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ క్రింద కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణాలకు బ్యాంకులు రుణాలందిస్తున్నందున పెద్ద రైతులు వాటి నిర్మాణానికి ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజి క్రింద రుణాలు అందించి వంద శాతం పైగా లక్ష్యాలు సాధించినట్లే ఈ ఏడాది లక్ష్యాలను అధిగమించాలన్నారు. 2016-17 నుండి 2021-22 వరకు ఎస్సి, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ మంజూరు అయి పెండింగ్ లో ఉన్న యూనిట్లను కాలయాపన చేయకుండా త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలన్నారు. అదేవిధంగా మత్స్య సహకార సంఘాల సభ్యులు మార్కెటింగ్ నిమిత్తం పెట్టుకున్న రుణ దరఖాస్తులను సివిల్ స్కోర్ లేదని, తదితర కారణాలతో తిరస్కరించకుండా రుణాలు మంజూరు చేసి వారిని ఇతోధికంగా ఆదుకోవాలని బ్యాంకర్లను కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డు పథకం క్రింద పాడిరైతులు, గొర్రెల పెంపకం దారులకు ఎలాంటి మార్టిగేజ్ లేకుండా రుణాలు మంజారు చేయాల న్నారు. పీఎంఈజీపీ క్రింద కేటాయించిన యూనిట్లను తిరస్కరించకుండా రుణాలు అందించి యూనిట్లు గ్రౌండ్ అయ్యేలా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు.





మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించుటకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నారిశక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ పథకం క్రింద ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా 2 కోట్ల వరకు వివిధ వ్యాపారాలకు రుణాలు అందిస్తున్నదని మహిళలు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. అదేవిధంగా నారిశక్తి ఎస్టీపీ క్రింద ఎటువంటి సెక్యూరిటీ లేకుండా 2 నుండి 10 లక్షల వరకు ఋణం అందిస్తుందని ఆన్ లైన్ లో డాక్యుమెంట్స్ సమర్పించడం ద్వారా ఇట్టే లోన్ పొందవచ్చని అన్నారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రెహమాన్, ఎస్ బి ఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, కెనరా బ్యాంక్ డిఎమ్ తోరత్, డిసిసిబి గానరల్ మేనేజర్ ఫణి సాయిరాం, యూనియన్ బ్యాంకు ఆర్ ఏం వికాస్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు చందర్, శ్రీధర్, లాలూ నాయక్, సింహ రావ్, భాగ్యలక్ష్మి, అంబాజీ, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 21న కామారెడ్డి యోగా భవన్ లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూలై 19: ఈ నెల 21న ఉదయం 6 గంటల నుండి 7:30 గంటల వరకు కామారెడ్డి జిల్లా కేంద్రం యోగా భవన్ లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్, పతాంజలి యోగ సమితి నిర్వాహకులు రామ్ రెడ్డి సంయుక్తంగా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ మాట్లాడుతూ, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీసు నిజామాబాద్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రం యోగ భవన్ పతాంజలి యోగ సమితి సహకారంతో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో భాగంగా యజ్ఞంతో మొదలై యోగా విశిష్టత, ఆసనాలతో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు తదితరులు హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. కావున జిల్లాలోని యోగ గురువులు, యోగా ప్రియులు, ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.







# భూసేకరణలో వేగం

చౌటుప్పల్ టౌన్, జూన్ 19

చౌటుప్పల్ డివిజన్‌లోని చౌటుప్పల్, వలిగొండ మండలాల్లో నిర్మించనున్న ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు రైతుల నుంచి 741 ఎకరాల భూసేకరణలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. ఆర్డీవో శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం గ్రామాలవారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి భూసేకరణకు సంబంధించి అవగాహన కల్పిస్తున్నారు. నష్ట పరిహారం వివరాలను వివరిస్తూ త్రిపుల్‌ఆర్ నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నారు. ఈ నెల 10న చౌటుప్పల్ మండలం తాళ్లసింగారం, 12న నేలపట్ల గ్రామాలకు చెందిన రైతులతో ఆర్డీవో సమావేశాలను నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించారు. 14న చిన్నకొండూరు, 18న వలిగొండ మండలం ప్రొద్దటూరు, 20న పహిల్వాన్‌పురం, 22న గోకారం, 24న రెడ్లరేపాక, 26న వర్కట్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులతో సమావేశాలు నిర్వహిస్తారు. చౌటుప్పల్ మండలంలోని చౌటుప్పల్, తంగడపల్లి, లింగోజీగూడ గ్రామాలనుంచి సేకరించే భూములను ప్రభుత్వం నిర్ధారించింది. కానీ భూములకు చెల్లించే నష్టపరిహారాన్ని మాత్రం ఇంకా నిర్ణయించలేదు. 65వ నెంబర్ జాతీయ రహదారివెంట ఉండే ఈ భూములకు త్వరలోనే నష్ట పరిహారాన్ని ప్రభుత్వం ఖరారు చేయనుంది.

భూసేకరణకు రైతులు సహకరించాలి: ఆర్డీవో

రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంకోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణకు రైతులు సహకరించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి చెందిన రైతులతో ఆర్డీవో శేఖర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో భూముల ధరలు పెరగడంతో పాటు దూర ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుందన్నారు. వేలాది ఎకరాలకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందని, ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కలుగుతుందని ఆర్డీవో అన్నారు. ఇదిలా ఉండగా, భూములను కోల్పోతున్న రైతులకు ఓపెన్ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సమావేశంలో తహసీల్దార్ హరికృష్ణ, సర్వేయర్ మురళీ, ఆర్ఐలు సురేందర్ శర్మ, సుధాకర్ రావులు పాల్గొన్నారు.



# గత ప్రభుత్వంపై కాంగ్రెస్ నిందలు

సూర్యాపేట,జూన్ 19

ల: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా గత ప్రభుత్వాలపై ప్రస్తుత ప్రభుత్వం నిందలు వేస్తూ పబ్బం గడుపుతోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీషరెడ్డి అన్నారు. విద్యుత కొనుగోళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టుల విచారణలపై స్పందించిన ఆయన జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకుంటూ కమీషన్ల పేరుతో డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారని గ్రహించి కమీషన్ల విచారణ పేరుతో మీడియాకు లీకులు ఇస్తూ కాలం వెళ్లదీస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానివి పసలేని ఆరోపణలని తేలిపోతున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు నిలిపి వ్యవసాయానికి సాగునీరు అందించకుండా తప్పు చేస్తున్నారన్నారు. నాలుగు నెలలుగా సమయాన్ని వృథా చేసి ఇప్పుడు హడావిడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. నీళ్లు, విద్యుత విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలు మంచినీళ్ల కోసం రోడ్లెక్కే పరిస్థితి కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో పదేళ్ల క్రితం ఉన్న దుస్థితి మళ్లీ ఇప్పుడు దాపురించిందన్నారు. పత్తి విత్తనాల కొరతలో ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందని, పత్తి విత్తనాల బ్లాక్ దందాలో ఓ మంత్రి పాత్ర ఉందని, సరైన ఆధారాలు రాగానే త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తానన్నారు. ప్రభుత్వం చేతగానితనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. మీడియాకు లీకులిచ్చి చెత్త, రోత రాతలు రాపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని కమీషన్లు వేసినా అభ్యంతరం లేదన్నారు.



# 'సీనియర్ ఆటగాళ్ల విషయంలో..': ఇంటర్వ్యూలో గంభీర్‌ను అడిగిన ప్రశ్నలివే..

భారత క్రికెట్ జట్టు కొత్త కోచ్ నియామకానికి సమయం దగ్గరపడుతున్న వేళ బీసీసీఐ క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇందులో మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ మంగళవారం వర్చువల్‌గా పాల్గొన్నాడు. 40 నిమిషాల పాటు సాగిన ఈ ఇంటర్వ్యూలో గంభీర్‌కు కమిటీ సభ్యులు మూడు కీలక ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఈమేరకు సంబంధిత ప్రశ్నల వివరాలను ఓ క్రీడా ఛానల్ తమ కథనంలో వెల్లడించింది. అవేంటంటే..?

జట్టు కోచింగ్ సిబ్బందికి సంబంధించి మీ ఆలోచనలు ఎలా ఉన్నాయి?

బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కొంతమంది సీనియర్ ఆటగాళ్లు ఉన్నప్పుడు.. జట్టులో మార్పులు చేయాలంటే ఆ పరిస్థితిని మీరు ఎలా ఎదుర్కొంటారు?

ఒక్కో ఫార్మాట్‌కు ఒక్కో కెప్టెన్, వర్క్‌లోడ్‌కు అనుగుణంగా ఆటగాళ్ల ఫిట్‌నెస్ పరిమితులు, ఐసీసీ ట్రోఫీలు గెలవలేక జట్టు ఎదుర్కొంటున్న వైఫల్యాలను పరిష్కరించడం వంటి అంశాలపై మీ అభిప్రాయాలు ఏంటీ? అని కమిటీ సభ్యులు గంభీర్‌ను అడిగినట్లు తెలుస్తోంది.

ఒక రౌండ్ అయింది.. టీమ్‌ఇండియా కోచ్‌గా ప్రకటన లాంఛనమే



కోచ్ నియామకానికి సంబంధించి గంభీర్‌కు ఇంటర్వ్యూ ఒక రౌండ్ పూర్తయింది. బుధవారం ఇంకో రౌండ్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీమ్‌ఇండియాకోచ్ పదవికి దరఖాస్తు చేసిన వారిలోంచి గంభీర్ కాకుండా డబ్ల్యూవీ రామన్‌ను కూడా బీసీసీఐ ఇంటర్వ్యూకు పిలిచింది. వీరిద్దరూ వర్చువల్‌గా హాజరయ్యారు. రామన్‌తోనూ సభ్యులు 40 నిమిషాల పాటు మాట్లాడారు. అయితే, గంభీర్‌నే కోచ్‌గా చేయడానికి బీసీసీఐ ఆసక్తిగా ఉందని.. ఇంటర్వ్యూలు లాంఛనమే అని తెలుస్తోంది. రెండో రౌండ్ కూడా పూర్తయ్యాక గంభీర్‌ను కోచ్‌గా ప్రకటించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# టీమ్‌ఇండియా కోచ్‌గా గంభీర్‌తో పోటీ.. రామన్ ఎక్స్ పోస్టు ఎవరి కోసం?

దిల్లీ: టీమ్‌ఇండియా కొత్త కోచ్ నియామకం త్వరలోనే జరగనుంది. ఈ పోస్టు కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారనే విషయాన్ని బీసీసీఐ తెలపలేదు కానీ, మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్, భారత మహిళా జట్టు కోచ్‌గా పనిచేసిన డబ్ల్యూవీ రామన్‌లను మాత్రమే ఇంటర్వ్యూకు పిలిచింది. మంగళవారం బీసీసీఐ క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) జూమ్ కాల్ ద్వారా వీరిద్దరిని ఇంటర్వ్యూ చేసింది. టీమ్‌ఇండియా కోచ్‌గా వచ్చే రెండు, మూడేళ్లకు తన ప్రణాళికలను ఇంటర్వ్యూలో గంభీర్ ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు సమాచారం. భారత క్రికెట్ పురోగతి కోసం రామన్ రోడ్ మ్యాప్ ఇచ్చాడు. బుధవారం రెండో రౌండ్ ఇంటర్వ్యూ ఉంటుంది. అయితే, గంభీర్ వైపే బీసీసీఐ మొగ్గు చూపుతుందని.. ఇంటర్వ్యూలు లాంఛనమే అని తెలుస్తోంది. ఈనేపథ్యంలో రామన్ తాజాగా ఎక్స్ (ట్విటర్)లో చేసిన రెండు పదాల పోస్టు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

మంగళవారం మొదటి రౌండ్ ఇంటర్వ్యూ ముగిసిన అనంతరం రాత్రి డబ్ల్యూవీ రామన్ "ఓ డియర్!!" అంటూ నిరాశలో కూరుకుపోక తప్పదన్న అర్థం వచ్చేలా ఎక్స్‌లో పోస్టు పెట్టాడు. రామన్ ఎవరిని ఉద్దేశించి ఈ పోస్టు చేశాడో అర్థం కావడం లేదంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



బీసీసీఐ గంభీర్ వైపే మొగ్గు చూపుతుందన్న వార్తలొస్తుండటంతో అతడిని ఉద్దేశించే ఈ ట్వీట్ చేశాడని కొంతమంది భావిస్తున్నారు.

# క్రిస్టియానో రొనాల్డోకు ధోనీతో పోలిక.. ఫ్యాన్స్ రియాక్షన్ ఇదే

ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ క్రీడాకారుల జాబితాలో పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాలర్( క్రిస్టియానో రొనాల్డో పేరు ముందుంటుంది. ఈ స్టార్ ఫుట్‌బాలర్ యూరో కప్‌లో ఆడటానికి సిద్ధమవుతున్నాడు. ఈ తరుణంలో ఫిఫా ప్రపంచకప్ ఒక ఆసక్తికర పోస్టు చేసి భారత క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ()తో క్రిస్టియానో రొనాల్డోను పోల్చుతూ ఫిఫా వరల్డ్ కప్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆసక్తికరమైన పోస్టు చేసింది. రొనాల్డో ఫొటోను పోస్టు చేస్తూ 'తలా ఫర్ ఎ రీజన్ 7' అనే వ్యాఖ్యను జత చేసింది. దీంతో ఆ పోస్టుకు భారత అభిమానుల నుంచి విశేష స్పందన వస్తోంది. చాలామంది నెటిజన్లు లైక్‌లు కొడుతూ తమ మద్దతు తెలుపుతున్నారు.





సీఎస్కే అభిమానులతోపాటు ఇండియన్ ఫ్యాన్స్ కొంతకాలం నుంచి ధోనీని 'తలా ఫర్ ఏ రీజన్' అని పిలుచుకుంటున్నారు. తమిళంలో దీని అర్థం 'లీడర్ ఫర్ ఏ రీజన్'. భారత క్రికెట్, సీఎస్కే తరఫున ధోనీ సాధించిన ఎన్నో గొప్ప విజయాలను గుర్తుచేసుకుంటూ ఫ్యాన్స్ ఈ నినాదాన్ని బయటకు తీసుకొచ్చారు. ఈ నినాదానికి ఉన్న క్రేజ్‌ను గుర్తించిన ఫిఫా రొనాల్డో ఫొటోతో ఆ వ్యాఖ్యను సోషల్ మీడియాలో పోస్టు చేసి భారత అభిమానుల మనసులను దోచుకుంది. ప్రస్తుతం భారత్‌లో ఫుట్‌బాల్‌కు పరిమిత సంఖ్యలోనే అభిమానులున్నారు. ఇలాంటి పోస్టుల ద్వారా ఇండియన్ ఫ్యాన్స్‌ని ఫుట్‌బాల్ వైపు ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది ఫిఫా. మరో ఇంట్రెస్టింగ్ పాయింట్ ఏంటంటే.. ధోనీలానే రొనాల్డో కూడా 7 నంబర్ జెర్సీని వాడతాడు.

# భారత్, అఫ్గాన్ సూపర్-8 మ్యాచ్.. తక్కువ అంచనా వేస్తే షాక్ తప్పదు







టీ20 ప్రపంచ కప్ 2024లో బుధవారం (జూన్ 19) నుంచి సూపర్-8 దశ ప్రారంభంకానుంది. భారత్, ఆస్ట్రేలియా, అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, వెస్టిండీస్, అఫ్గానిస్థాన్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ రెండో దశకు అర్హత సాధించాయి. టాప్-4లో నిలిచి సెమీస్‌కు చేరేందుకు ఈ ఎనిమిది జట్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. సూపర్-8లో భాగంగా జూన్ 20న భారత్, అఫ్గానిస్థాన్ మ్యాచ్ జరగనుంది. ఇరు జట్ల బలబలాలపై ఓ లుక్కేద్దాం.

సూపర్ 8లో ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ఎలో భారత్, ఆస్ట్రేలియా, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్.. గ్రూప్ బిలో ఇంగ్లాండ్, వెస్టిండీస్, అమెరికా, దక్షిణాఫ్రికా ఉన్నాయి.

లీగ్ దశలో ఒక్క మ్యాచ్‌లోనూ ఓటమి ఎరుగని భారత్.. అఫ్గానిస్థాన్‌పై గెలిచి సూపర్-8లో శుభారంభం చేయాలనే పట్టుదలతో ఉంది.

న్యూయార్క్‌లో లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు ఆడిన రోహిత్ సేన సూపర్-8 మ్యాచ్‌లు వెస్టిండీస్‌లో ఆడనుంది. ఇక్కడి పిచ్‌లు సాధారణంగా స్పిన్‌కు అనుకూలిస్తాయి.

కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, యుజువేంద్ర చాహల్, రవీంద్ర జడేజాలతో టీమ్‌ఇండియా స్పిన్ విభాగం పటిష్టంగా ఉంది.

తుది జట్టులో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లను తీసుకునే ఛాన్స్ ఉంది. అదే జరిగితే కుల్‌దీప్ యాదవ్ జట్టులోకి రావడం ఖాయం. బుమ్రా, అర్ష్‌దీప్‌ను పేసర్లుగా తీసుకునే అవకాశముంది.

బ్యాటింగ్‌లో రోహిత్ శర్మ, రిషభ్ పంత్, సూర్యకుమార్ కీలకం కానున్నారు. విరాట్ కోహ్లీ కూడా ఫామ్ అందుకుంటే భారత్‌కు తిరుగుండదు.

లీగ్ దశలో నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట గెలిచి సూపర్-8కు వచ్చిన అఫ్గాన్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు.

ఈ ప్రపంచకప్‌లో కివీస్‌ను అఫ్గాన్ చిత్తుగా ఓడించిన విషయాన్ని భారత్ మార్చిపోకూడదు. న్యూజిలాండ్‌ను 75 పరుగులకే ఆలౌట్ చేసి 84 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

అఫ్గాన్ బ్యాటర్లు రెహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. గుర్బాజ్ 167 పరుగులతో ఈ ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా ఉండగా.. జద్రాన్ 152 రన్స్‌తో నాలుగో స్థానంలో ఉన్నాడు.

రషీద్ ఖాన్, మహ్మద్ నబీ, నూర్ అహ్మద్‌లతో కూడిన అఫ్గాన్ స్పిన్ విభాగం టీమ్‌ఇండియాకు సవాలు విసురుతోంది. పేసర్ ఫజల్ హక్ ఫారూఖీ అత్యధిక (12) వికెట్ల వీరుడిగా ఉన్నాడు. నబీ, రషీద్ ఖాన్ బ్యాట్‌తోనూ సత్తా చాటగలరు.

భారత్, అఫ్గానిస్థాన్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న బార్బడోస్‌లోని కెన్సింగ్‌టన్ ఓవల్ మైదానంలోనే జూన్ 29న ఫైనల్ జరగనుంది.

ఈ వేదికలో ఇప్పటివరకు 47 అంతర్జాతీయ టీ20లు జరిగాయి. 30 మ్యాచ్‌ల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టే గెలిచింది. మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించే అవకాశముంది.

## 'సీనియర్ ఆటగాళ్ల విషయంలో..': ఇంటర్వ్యూలో గంభీర్‌ను అడిగిన ప్రశ్నలివే..

భారత క్రికెట్ జట్టు కొత్త కోచ్ నియామకానికి సమయం దగ్గరపడుతున్న వేళ బీసీసీఐక్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇందులో మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ మంగళవారం వర్చువల్‌గా పాల్గొన్నాడు. 40 నిమిషాల పాటు సాగిన ఈ ఇంటర్వ్యూలో గంభీర్‌కు కమిటీ సభ్యులు మూడు కీలక ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఈమేరకు సంబంధిత ప్రశ్నల వివరాలను ఓ క్రీడా ఛానల్ తమ కథనంలో వెల్లడించింది. అవేంటంటే..?

జట్టు కోచింగ్ సిబ్బందికి సంబంధించి మీ ఆలోచనలు ఎలా ఉన్నాయి?

బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కొంతమంది సీనియర్ ఆటగాళ్లు ఉన్నప్పుడు.. జట్టులో మార్పులు చేయాలంటే ఆ పరిస్థితిని మీరు ఎలా ఎదుర్కొంటారు?

ఒక్కో ఫార్మాట్‌కు ఒక్కో కెప్టెన్, వర్క్‌లోడ్‌కు అనుగుణంగా ఆటగాళ్ల ఫిట్‌నెస్ పరిమితులు, ఐసీసీ ట్రోఫీలు గెలవలేక జట్టు ఎదుర్కొంటున్న వైఫల్యాలను పరిష్కరించడం వంటి అంశాలపై మీ అభిప్రాయాలు ఏంటీ? అని కమిటీ సభ్యులు గంభీర్‌ను అడిగినట్లు తెలుస్తోంది.

# గ్రూప్ దశలోనే కివీస్ ఇంటికి.. కేన్ విలియమ్సన్ సంచలన నిర్ణయం

టీ20 ప్రపంచకప్ 2024లో న్యూజిలాండ్ గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టింది. జట్టు ఘోర ప్రదర్శనకు బాధ్యత వహిస్తూ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ( సంచలన నిర్ణయం తీసుకున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తన కెప్టెన్సీకి రాజీనామా చేశాడు. అంతేకాదు 2024-25 సీజన్‌కు సంబంధించిన సెంట్రల్ కాంట్రాక్ట్‌ను తిరస్కరించాడు. ఈవిషయాన్ని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో ఒక ప్రకటనలో పేర్కొంది. జాతీయ కాంట్రాక్ట్‌ను తిరస్కరించినప్పటికీ ఆటగాడిగా జట్టుకు అందుబాటులో ఉంటాడని తెలిపింది.

ఈ నిర్ణయంతో తాను అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమవుతున్నానని భావించకూడదని విలియమ్సన్ చెప్పాడు. భవిష్యత్తులో సెంట్రల్ కాంట్రాక్ట్‌ను అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నాడు. "అన్ని ఫార్మాట్ల క్రికెట్‌లో జట్టును ముందుకుతీసుకెళ్లడంలో సహాయపడటానికి ఇష్టపడతాను. దానికోసం నేను సహకారం అందించాలనుకుంటున్నాను. అయితే న్యూజిలాండ్ వేసవి సమయంలో జట్టు చాలా తక్కువ మ్యాచ్‌లు ఆడనుంది. దీంతో విదేశాల్లో ఫ్రాంచైజీ క్రికెట్ ఆడటం కోసం సెంట్రల్ కాంట్రాక్ట్ ఆఫర్‌ను తిరస్కరించాను" అని కివీస్ క్రికెట్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో విలియమ్సన్ పేర్కొన్నాడు.



ఈ టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్ సిలో ఉన్న కివీస్.. తొలి రెండు మ్యాచ్‌ల్లో అఫ్గానిస్థాన్, వెస్టిండీస్ చేతిలో ఓడింది. తర్వాత చిన్న జట్లయిన ఉగాండా, పాపువా న్యూగినిలపై నెగ్గింది. అయినప్పటికీ న్యూజిలాండ్ సూపర్-8కు అర్హత సాధించలేకపోయింది.

# ‘మ్యూజిక్ షాప్ మూర్తి’ అందరిలో స్ఫూర్తి నింపుతుంది: అజయ్ ఘోష్



అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం ‘మ్యూజిక్ షాప్ మూర్తి’. శివ పాలడుగు దర్శకత్వం వహించారు. హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మాతలు. జూన్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అజయ్ ఘోష్ మాట్లాడుతూ సినిమా కచ్చితంగా అందరికీ నచ్చుతుందని.. ఒకవేళ నచ్చకపోతే తనకు ఫోన్ చేసి తిట్టొచ్చని ఫోన్ నంబర్ చెప్పారు.

‘నిర్మాతలు చాలా ప్రోత్సహించారు. ఆడియన్స్ ఈ సినిమాకు కనెక్ట్ అవుతారు. ఇది చూశాక కొందరు ఆనందపడతారు. కొందరు ఇలా ఎందుకు కాలేకపోయామని బాధపడతారు. ఎంతోమంది జీవితానికి అద్దంపడుతుందీ చిత్రం. జీవితంలో ఏదైనా సాధించాలి.. ఉన్నత స్థానాలకు వెళ్లాలనుకునే వాళ్లలో ‘మ్యూజిక్ షాప్ మూర్తి’ స్ఫూర్తి నింపుతుంది. సంకల్పం ఉంటే దేన్నైనా సాధించొచ్చు అనిపిస్తుంది. మనం విజయం సాధించడమనేది మనపైనే ఆధారపడి ఉంటుంది. మంచి వాళ్లతో స్నేహం చేస్తే ఎప్పటికైనా విజయం సాధిస్తాం. సినిమాల్లో నటించాలని ఒక జత దుస్తులతో ఇంటి నుంచి వచ్చేశాను. మంచి వాళ్లు తోడైయ్యారు కాబట్టి గుర్తింపు వచ్చింది. ‘మ్యూజిక్ షాప్ మూర్తి’ కుటుంబమంతా కూర్చుని చూసే సినిమా. మంచి కథతో తెరకెక్కించారు. వందల కోట్లు పెట్టి తీసే సినిమాలతో పాటు కంటెంట్ ఉన్న చిత్రాలను కూడా ఆదరించే గొప్ప సంస్కారవంతులు ప్రేక్షకులు. ఇలాంటి సినిమాలను వాళ్లు కచ్చితంగా ఆదరిస్తారు. చాందినీ చౌదరి గొప్ప నటి. ఆమె నటన చూసి ఆశ్చర్యపోయాను’ అని చెప్పారు.

# డేటింగ్ వార్తలపై స్పందించిన మమతా మోహన్ దాస్..



జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన ‘యమదొంగ’లో ప్రత్యేక పాత్రతో గుర్తింపు తెచ్చుకున్నారు హీరోయిన్ మమతా మోహన్‌దాస్. ఆ సినిమా తర్వాత ఈ మలయాళీ కుట్టి వరుస అవకాశాలు అందుకొని దక్షిణాది భాషలన్నిటిలో నటించారు. ప్రస్తుతం విజయ్ సేతుపతితో కలిసి ‘మహారాజా’తో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో డేటింగ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

“లాస్ ఏంజెలెస్‌లో (ఉన్నప్పుడు ఒకరిని ప్రేమించాను. కానీ, మా బంధం ఎక్కువ రోజులు నిలవలేదు. జీవితంలో రిలేషన్ ఉండాలి.. కానీ ఒత్తిడితో కూడిన బంధాన్ని నేను కోరుకోవడం లేదు. జీవితానికి కచ్చితంగా ఒకతోడు అవసరం అని భావించడం లేదు. ప్రస్తుతానికి చాలా సంతోషంగా ఉన్నాను. భవిష్యత్తు ఎలా ఉంటుందో చెప్పలేం. మంచి జీవిత భాగస్వామి కోసం వెతుకుతున్నా.. సమయం వచ్చినప్పుడు అన్ని బయటకు వస్తాయి” అన్నారు. తన కెరీర్ గురించి మాట్లాడుతూ.. ‘మలయాళీ చిత్రపరిశ్రమలోనూ నాకు మంచి గుర్తింపు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. నేను పోషించిన ఎన్నో పాత్రలకు అగ్ర నటీనటుల నుంచి ప్రశంసలు వచ్చాయి. తెలుగు, తమిళ బాషల్లోనూ స్టార్స్‌తో సినిమాలు చేసే అవకాశం వచ్చింది. బాలీవుడ్ నటుడు పంకజ్ త్రిపాఠి, గౌరీ ఖాన్ ప్రశంసలను ఎప్పటికీ మర్చిపోలేను’ అని మమతా మోహన్ దాస్ (చెప్పారు. గతేడాది ఐదు చిత్రాలతో సందడి చేసిన మమతా ప్రస్తుతం ‘మహారాజా’ ప్రచారంలో బిజీగా ఉన్నారు.

# విన్న కథలు 500.. చేసింది 50



విజయ్ సేతుపతి

పాత్రలో జీవించడం ఎలాగో తెలిసిన నటుడు విజయ్ సేతుపతి. అందుకే ఆయన నటించిన సినిమాలు చూస్తే తెరపై పాత్రే కనిపిస్తుంది తప్ప, ఆయన కనిపించడు. ఒకవైపు కథానాయకుడిగా నటిస్తూనే... మరోవైపు అగ్ర తారల సినిమాల్లో కీలక పాత్రల్లో ఒదిగిపోతుంటారు. తెలుగు, తమిళం, హిందీ... ఎక్కడికెళ్లినా అంతే ప్రభావం చూపిస్తుంటారు. ఇటీవలే విజయ్ సేతుపతి కథానాయకుడిగా ‘మహారాజ’ తెరకెక్కింది. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహించిన ఆ చిత్రం ఎస్వీఆర్ సినిమా పతాకంపై ఈ నెల 14న తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తోంది.

50వ సినిమా అని ప్రత్యేకంగా ఈ కథని ఎంచుకున్నారా?

ప్రత్యేకంగా ఇది నా యాభయ్యో సినిమాగా ఉండాలని ఎంచుకుని చేసిన కథే ఇది. విన్నప్పుడే ఎంతో ఆసక్తికరంగా అనిపించింది. కథ కంటే కథనం నన్నెంతగానో ప్రభావితం చేసింది. ‘పిజ్జా’ సినిమాని గుర్తు చేసింది. అంత ఆసక్తికరమైన మలుపులు ఇందులో ఉంటాయి. దర్శకుడు ఈ కథ చెప్పిన వెంటనే నా యాభయ్యో సినిమా ఇదే అని ప్రకటించాం.

ఈ ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే ఏమనిపిస్తోంది?

విడుదలైన నా సినిమాలు 50 మాత్రమే కావొచ్చు. కానీ నేను 500 కంటే ఎక్కువ కథలు విన్నా. ఎంతో మందిని కలిశా. విజయాలు చూశా, పరాజయాలూ చూశా. ప్రతి ఫలితం తర్వాత ఏం జరిగిందో ఆలోచిస్తాం కదా. అలా ఎంతో అనుభవాన్ని సంపాదించా. ఇదొక గొప్ప ప్రయాణం.

యాభై సినిమాల మైలురాయిని దాటారు కదా, తదుపరి కెరీర్ పరంగా ప్రత్యేక వ్యూహాలు, ప్రణాళికలేమైనా ఉన్నాయా?

గతాన్ని మోసుకుంటూ ప్రయాణం చేయడం నాకు ఇష్టం ఉండదు. ఇదివరకటిలాగే ఇకముందు కూడా నా కెరీర్ కొనసాగుతుంది. కలలు, అంచనాలు ఎప్పుడూ భారమే. అందుకే రోజూ కెమెరా ముందుకు కొత్తగా వెళతాను. సినిమా విషయంలో అదే రకమైన థ్రిల్‌తో ఉంటా. ఇకపైనా ఇంతే బాధ్యతతో పనిచేయడమే నా వ్యూహం.

గతంలో మీరు చేసిన సినిమాలకీ, ‘మహారాజ’కీ మధ్య వ్యత్యాసం ఏమిటంటే?

ఇది ఎప్పుడూ వచ్చే కమర్షియల్ సినిమాల్లా ఉండదు. అలాగని ఆర్ట్ సినిమా కాదు. తన కుటుంబాన్ని సంరక్షించుకోవడం కోసం ఓ వ్యక్తి ఏం చేశాడు? ఎంత దూరం వెళ్లాడనేది ఈ సినిమాలో ఆసక్తికరం. దర్శకుడు నిథిలన్ ప్రతి పాత్రనీ ఎంతో బలంగా మలిచారు. నిర్మాత సుధన్‌తో ఇది నాకు మూడో చిత్రం. అజనీష్ సంగీతం ప్రధాన బలం.

దర్శకత్వం ఎప్పుడు చేస్తారు?

మంచి కథ కుదిరితే తప్పకుండా దర్శకత్వం చేస్తా. మూడు సినిమాలకి కథ, స్క్రీన్‌ప్లే రాశాను. మరికొన్ని కథలూ రాసుకున్నా. కథానాయకుడిగా ప్రస్తుతం తమిళంలో మూడు సినిమాలు చేస్తున్నా. హిందీలో ఓ సినిమా చేస్తున్నా.

# దేవర ముందే వస్తాడా?



ఎన్టీఆర్

తారల సినిమాలకు సంబంధించి ఈ మధ్య ‘విడుదల వాయిదా’ అనే కబురే ఎక్కువగా వినిపిస్తుంటుంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఆ సినిమాల చిత్రీకరణల్లోనూ, నిర్మాణానంతర పనుల్లోనూ జాప్యం చోటు జరుగుతుండడమే అందుకు కారణం. అయితే ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న ‘దేవర’ మాత్రం ముందుగానే రావడానికి ముస్తాబవుతున్నట్టు తెలుస్తోంది. నిజానికి ఈ సినిమా కూడా వేసవిలో రావల్సి ఉండగా, అక్టోబరు 10కి వాయిదా పడింది. అయితే ఈ సారి చెప్పిన సమయం కంటే ముందుగానే, అంటే సెప్టెంబరు 27నే ‘దేవర’ చిత్రాన్ని విడుదల చేసే ప్రయత్నాల్లో చిత్రబృందం తలమునకలై ఉన్నట్టు తెలుస్తోంది. సెప్టెంబరు 27వ తేదీని ఖరారు చేసుకున్న పవన్‌కల్యాణ్ ‘ఓజీ’ చిత్రీకరణ ఇంకా మిగిలి ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆ తేదీకి ‘ఓజీ’ రావడం కష్టమే. అందుకే ఎన్టీఆర్ ‘దేవర’ చిత్రాన్ని ఆ రోజున విడుదల చేయాలనే ప్రణాళికతో చిత్రబృందం అడుగులు వేస్తోంది. అందుకు తగ్గట్టుగానే చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ఇటీవల గోవాలో కీలకమైన షెడ్యూల్‌ని పూర్తి చేశారు. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న ఈ సినిమాని కొరటాల శివ రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కల్యాణ్‌రామ్ సమర్పిస్తున్నారు. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు.

# సినిమాల్లోకి రావాలని కలలేమీ కనలేదు



‘నటన అనేది నా చిన్ననాటి కల కాదు, విధి నన్ను ఈ రంగంలో అడుగుపెట్టేలా చేసిందంతే’ అని అంటోంది మృణాల్ ఠాకూర్. వరుస అవకాశాలను అందుకుంటున్న ఈ భామ తాజాగా ఓ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాల్ని తన అభిమానులతో పంచుకుంది. ‘నా బాల్యమంతా వివిధ పట్టణాలకు తిరగడానికే సరిపోయింది. అలా మారడం వల్ల కొత్త వాతావరణాలకి అనుగుణంగా అలవాటు పడిపోవడం బాధించలేదు. నేను దాదాపు 10నుంచి 11 పాఠశాలలు మారి ఉంటానేమో. స్కూళ్లు మారినప్పుడు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడం అంత సులభం కాదు’ అని అంది. ‘నేను నటిగా ఎదగాలనేది నా కల కాదు. కానీ, విధి నన్ను ఈ వైపుకి నడిపించింది. అదే నన్ను డిగ్రీలో బ్యాచిలర్ ఆఫ్ మాస్ మీడియా చేయడానికి దారితీసింది. అక్కడే నటన పట్ల నాకున్న అభిరుచిని తెలుసుకున్నా. ఆడిషన్స్ నటనపై మరింత ఆసక్తిని పెంచాయి. నేనీ రంగంలోకి రావాలని నా స్నేహితులు కూడా ఎప్పుడూ ప్రోత్సహించేవారు’ అని చెప్పుకొచ్చింది. ‘లవ్ సోనియా’లోని ఆమె పోషించిన పాత్ర తన నటనా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి మాత్రమే కాదు, ప్రతి చిత్రంలో చేసే పాత్రతో మర్చిపోలేని ముద్ర వేయడానికి కారణమైందంటూ ముగించింది మృణాల్.

# రామోజీ ఫిల్మ్‌సిటీలో శరవేగంగా పుష్ప 2



అల్లు అర్జున్

‘పుష్ప’ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో పుష్పరాజ్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఇదే పాత్రకు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం కూడా అందుకున్నారు అల్లు అర్జున్. దీంతో రెట్టించిన ఉత్సాహంతో ‘పుష్ప 2’తో ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో శరవేగంగా జరుగుతోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే సన్నివేశాలతో పాటు కొన్ని కీలక సీన్లను తెరకెక్కిస్తోంది చిత్రబృందం. అల్లు అర్జున్‌తో ఇతర పాత్రధారులపై ఈ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. రష్మిక కథానాయికగా నటిస్తోన్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు.

# స్ఫూర్తి నింపే మూర్తి



శివ పాలడుగు

భావోద్వేగాలతో కూడిన ఓ స్ఫూర్తిదాయకమైన కథని చెప్పాలనే ప్రయత్నమే ‘మ్యూజిక్‌షాప్ మూర్తి’ చిత్రం అన్నారు శివ పాలడుగు. ఆయన దర్శకత్వంలో... అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రమిది. హర్ష గారపాటి, రంగారావు గారపాటి సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శివ పాలడుగు బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

“కన్న కలల్ని సాకారం చేసుకునే క్రమంలో ఓ వ్యక్తికి ఎదురైన అనుభవాలే ఈ చిత్రం. తనకి తెలిసిన ప్రపంచంలోనే మరో అడుగు ముందుకు వేయాలనుకున్నప్పుడు యాభయ్యేళ్ల వ్యక్తి జీవితంలో ఎదురైన సంఘర్షణలు ఎలాంటివి? ఆ కలల్ని నిజం చేయడానికి ఓ యువతి ఎలా సాయపడింది? ఆమె ప్రయాణంలో పదనిసలు ఎలాంటివనేదే ‘మ్యూజిక్‌షాప్ మూర్తి’ కథ. ఏదో సందేశం చెప్పాలని చేసిన చిత్రమేమీ కాదు. కానీ పాత్రల ప్రయాణం ప్రేక్షకుల్లో స్ఫూర్తిని పంచుతుంది. సంగీతం నేపథ్యంలో సాగే కథ కావడంతో అందుకు తగినట్టుగా పరిశోధన చేసి కథ రాసుకున్నా. సినిమాలో సంగీతం కూడా వైవిధ్యంగా ఉంటుంది.

# కొత్త హెూదాల జోరు



ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నియామక కార్యకలాపాల్లో కొత్త హెూదాలపైనే ఎక్కువ దృష్టి కనిపించనుంది. వేర్వేరు రంగాల్లోని కంపెనీలు 27% మేర తాజా ఉద్యోగాలను ఇవ్వవచ్చని ఒక నివేదిక అంటోంది. స్టాఫింగ్, హెచ్ఆర్ సేవల కంపెనీ జీనియస్ కన్సల్టెంట్స్ విడుదల చేసిన 'హైరింగ్, కంపెన్సేషన్ అండ్ అట్రిషన్ మేనేజ్‌మెంట్' నివేదిక ఏమంటోందంటే..2024-25లో పరిశ్రమ వ్యాప్తంగా నియామక అంచనాలను చూస్తే.. కొత్త పొజిషన్ల భర్తీపైనే బలమైన దృష్టి ఉండొచ్చు. కంపెనీలు చేపట్టే నియామకాల్లో 27% మేర ఇవే ఉండొచ్చు. మార్కెట్లో పెరుగుతున్న గిరాకీని అందుకునేందుకు ఈ వ్యూహాత్మక అడుగును కంపెనీలు వేయొచ్చు.

అదే సమయంలో రాజీనామా చేసిన వ్యక్తుల స్థానంలో చేపట్టే రీప్లేస్‌మెంట్ నియామకాలు సైతం మొత్తం రిక్రూట్‌మెంట్‌లో 23 శాతం మేర కనిపించొచ్చు.అయితే కొత్త హెూదాలను సృష్టించి భవిష్యత్ అవసరాలను తీర్చుకోవడమే కంపెనీల ప్రాథమిక లక్ష్యంగా ఉండొచ్చు.4-8 ఏళ్ల పని అనుభవం ఉన్న వ్యక్తుల నియామకాలు 32% మేర కనిపించొచ్చు. ఇక 1-4 ఏళ్ల అనుభవం ఉన్న వారిని 26% మేర తీసుకోవచ్చు. ఉద్యోగార్థుల వాటా 15 శాతంగానే ఉండొచ్చు.కాంట్రాక్టు లేని తాత్కాలిక ఉద్యోగాలు మొత్తం నియామకాల్లో 27% మేర కనిపించొచ్చని.. ఇక కాంట్రాక్టు వ్యక్తులు 25%, గిగ్ సిబ్బంది 24%, శాశ్వత సిబ్బంది 24% మేర నియమితులు కావొచ్చు.

# కార్డు లావాదేవీలు తగ్గించేశారు



డెబిట్/క్రెడిట్ కార్డులను స్వైప్ చేయడం ద్వారా చెల్లింపునకు వీలున్న పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రాలను కొత్తగా అమర్చుకునే వారి సంఖ్య బాగా నెమ్మదించింది. అన్ని రకాల చెల్లింపుల విధానాన్ని అమలు చేస్తున్న వ్యవస్థీకృత, పెద్ద ఫార్మాట్ రిటైల్ సంస్థలే వీటిని ఏర్పాటు చేసుకుంటున్నాయి. కిరాణా సరకుల దుకాణాలు, చిన్న స్టోర్లు, తినుబండారాల దుకాణాలు (ఈటరీస్), కూరగాయలు-పళ్ల విక్రయశాలల్లోనూ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, చెల్లింపులు చేసే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలే ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. పీఓఎస్‌లను ఏర్పాటు చేయడం ప్రారంభించాక, వాటి ఏర్పాటులో వృద్ధి అత్యంత నెమ్మదిగా ఉంది ఇప్పుడేనని చెబుతున్నారు.

ఎందుకిలా?

కార్డులతో చెల్లింపులు జరిపే వారి కోసమే పీఓఎస్ టెర్మినళ్లను పెద్ద సంస్థలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. క్రెడిట్ కార్డ్‌ల చెల్లింపులు అధికంగా ఉండే ప్రాంతాల్లో మాత్రం చిన్న దుకాణాలూ పీఓఎస్‌లు అమర్చుకుంటున్నాయి. అయితే చెల్లింపులకు యూపీఐ ప్లాట్‌ఫామ్స్ సౌకర్యవంతంగా ఉండటంతో వ్యాపారులు, వినియోగదార్లు నగదు రహిత లావాదేవీల కోసం క్యూఆర్ కోడ్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో కార్డు స్వైపింగ్ ద్వారా చెల్లింపులు మునుపటితో పోలిస్తే తగ్గాయని చెబుతున్నారు. 2023-24లో చాలా తక్కువగా..పెద్ద నోట్ల రద్దు (2016) తర్వాత చూస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే కొత్త పీఓఎస్‌ల ఏర్పాటు చాలా తక్కువగా నమోదైందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డేటా వెల్లడించింది. కొవిడ్-19 వ్యాప్తి, తదనంతర లాక్‌డౌన్ పరిణామాలతో సంప్రదాయ దుకాణాల్లో వ్యాపారం దారుణంగా దెబ్బ తిన్నందున, పీఓఎస్‌ల ఏర్పాటు 2021-22లోనూ అతి తక్కువగా జరిగినా, గణాంకాలకు పరిగణనలోకి తీసుకోలేదు.2023 మార్చి నుంచి 2024 వరకు కొత్త పీఓఎస్ టెర్మినళ్ల ఏర్పాటు 14 శాతమే పెరిగింది. అంతకు ముందు రెండేళ్లు వరుసగా 28%, 29% అధికమై 89 లక్షలకు చేరాయి. 2016-17లో వేగవంతమైన వృద్ధి నమోదైంది. ఆ ఏడాదిలో ఏకంగా పీఓఎస్‌ల ఏర్పాటులో 82% వృద్ధి నమోదైంది. పెద్ద నోట్ల రద్దు వల్ల, నగదు అందుబాటులో లేక, అధికులు కార్డులతో లావాదేవీలు నిర్వహించడమే ఇందుకు కారణం. అప్పుడే యూపీఐ లావాదేవీలు పెరగడమూ ప్రారంభమైంది. 2016లో దేశీయంగా 13.8 లక్షల పీఓఎస్ యంత్రాలు ఉండేవి.యూపీఐ చెల్లింపుల్లో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి ప్లాట్‌ఫామ్‌లు గత రెండేళ్లలో రెండింతల వృద్ధి నమోదు చేశాయి. వీటి క్యూఆర్ కోడ్‌లు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. ఆటో డ్రైవర్ల నుంచి వీధి చివర్లో దుకాణాల వరకు క్యూఆర్-కోడ్ స్టిక్కర్లు సర్వసాధారణమైపోయాయి.

ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, 34.6 కోట్ల క్యూఆర్ కోడ్‌లు ఈ ఏడాది మార్చిలో వినియోగంలో ఉన్నాయి. 2022 మార్చిలో చూస్తే ఇవి 17.2 కోట్లే ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్లతో స్కాన్ చేయడం ద్వారా సులువుగా చెల్లింపులు చేసే అవకాశం ఉండటంతో యూపీఐ లావాదేవీలు పెరుగుతున్నాయి. కార్డ్ స్వైప్‌ల ద్వారా అయితే, మర్చంట్లు ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) ఫీజు చెల్లించాల్సి రావడం వల్ల కూడా ఇందుకు మరో కారణం.

# ఉద్యోగాన్వేషణలో తోడుగా..

# లింక్డిన్‌లో కొత్త ఏఐ టూల్స్




సామాజిక మాధ్యమాలు సహా ఇంటర్నెట్ ఆధారిత వేదికలన్నీ కృత్రిమ మేధ సాధనాలనుపవేశపెడుతున్నాయి. తద్వారా తమ వినియోగదారులకు కొత్త అవకాశాలు, అనుభూతులను అందిస్తున్నాయి. తాజాగా ఈ జాబితాలో ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ యాప్ లింక్డిన్ (%ూఱఅఅవసఎ×అ%) సైతం చేరింది. ఉద్యోగాన్వేషణలో ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ మాధ్యమం ఆ ప్రక్రియను మరింత సులభతరం చేసేలా ఏఐ సాధనాలను రూపొందించింది.లింక్డిన్‌లో కావాల్సిన జాబ్ పోస్టింగ్స్‌ను వెతకడం కోసం ఇప్పటివరకు వివిధ రకాల ఫిల్టర్స్‌ను ఉపయోగించాల్సి వచ్చేది. ఇకపై ఆ అవసరం లేకుండా ఏఐ టూల్స్ (%ూ× ఎశీశ్రీం%) ఆ పనిని సులభతరం చేయనున్నాయి. ఈ కొత్త ఫీచర్లను ప్రీమియం సబ్‌స్క్రైబర్లు మాత్రమే పొందనుండడం గమనార్హం.

కొత్త సాధనాలివే..జాబ్ సీకర్ కోచ్: ఈ ఏఐ అసిస్టెంట్ వర్చువల్ రిక్రూటర్ తరహాలో ఉపయోగపడుతుంది. కావాల్సిన ఉద్యోగం.. అది ఎలా ఉండాలో ఇంగ్లిష్‌లో టైప్ చేస్తే సరిపోతుంది. ఉదాహరణకు "నా నెట్‌వర్క్‌లో రూ.10 లక్షల వార్షిక వేతనంతో కూడిన డేటా అనలిస్ట్ ఉద్యోగాన్ని వెతికి పెట్టు" అని ఇంగ్లిష్‌లో టైప్ చేస్తే చాలు. డేటాబేస్‌లో దానికి సంబంధించిన సమాచారం మొత్తాన్ని యూజర్ ముందుంచుతుంది. పైగా దానికి దరఖాస్తు చేసుకుంటే మీ ప్రొఫైల్ ముందు వరుసలో ఉండేలా ఎలాంటి మార్పులు చేయాలో కూడా సూచిస్తుంది.రెజ్యూమె అండ్ అప్లికేషన్ రివ్యూ టూల్: ఈ టూల్‌లో రెజ్యూమె, అప్లికేషన్‌లను అప్‌లోడ్ చేస్తే ఏఐ వాటిని క్షుణ్ణంగా సమీక్షిస్తుంది. ఎక్కడెక్కడ మెరుగుపర్చాలో సూచిస్తుంది. జాబ్‌కు సెలెక్ట్ అయ్యేలా మీ రెజ్యూమె, అప్లికేషన్‌లోని ఏయే స్కిల్స్‌ను హైలైట్ చేయాలో తెలియజేస్తుంది.కవర్ లెటర్ అసిస్టెన్స్: సరైన కవర్ లెటర్‌ను రూపొందించడం సమయంతో కూడుకొన్న అంశం. కవర్ లెటర్ అసిస్టెన్స్ దాన్ని సులభం చేస్తుంది. ఈ ఇంటరాక్టివ్ చాట్‌బాట్‌తో చాట్ చేస్తూ మీ నైపుణ్యాలు, అనుభవం, ఎలాంటి ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నారో తెలియజేస్తే సరిపోతుంది. వాటికి అనుగుణంగా ఓ డ్రాఫ్ట్ కవర్ లెటర్‌ను సిద్ధం చేస్తుంది.ఏఐ సాయంతో నిపుణుల సలహా: వివిధ రంగాలకు చెందిన నిపుణులు అందించే సలహాలను ముందుగానే ఏఐలో నిక్షిప్తం చేస్తారు. వీటిని ఎప్పటికప్పుడు కొత్త వాటితో అప్‌డేట్ చేస్తారు. యూజర్లు అడిగే ప్రశ్నలకు అనుగుణంగా ఆయా రంగాల్లోని నిపుణుల సూచనలను వారి ముందుంచుతారు.ఈ ఏఐ ఆధారిత ఫీచర్లను ఉపయోగించడం ద్వారా వినియోగదారులు మరింత సమర్థమైన, కావాల్సిన ఉద్యోగాన్ని వెతుక్కోవచ్చు. ప్రస్తుతానికి ఈ ఫీచర్లు ప్రీమియం సబ్‌స్క్రైబర్లకు మాత్రమే అందుబాటులో ఉన్నాయని గమనించాలి. వీటితో పాటు రిక్రూటింగ్ సంస్థలకు కూడా ఉపయోగపడేలా కొత్త సాధనాలను తీసుకొస్తున్నట్లు లింక్డిన్ ప్రకటించింది.

## హెచ్‌పీసీఎల్ సీఎండీ పదవికీ సరైన అభ్యర్థి దొరకలేదు

దిల్లీ: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) పదవికి సరైన అభ్యర్థి దొరకలేదని తెలుస్తోంది. ప్రభుత్వ సంస్థల్లో ఉన్నత ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసే పీఈఎస్‌బీ ఈ నెల 14న హెచ్‌పీసీఎల్ సీఎండీ కోసం 8 మందిని ఇంటర్వ్యూ చేసింది. అయితే ఇందులో ఏ ఒక్కరిని కూడా ఆ పదవికి సిఫారసు చేయలేదు. ఇందులో హెచ్‌పీసీఎల్ బోర్డు డైరెక్టర్, ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజీఎల్) ఎండీ కూడా తిరస్కరణకు గురికావడం గమనార్హం. హెచ్‌పీసీఎల్ సీఎండీ పదవి 2024 సెప్టెంబరు 1 నుంచి ఖాళీ కాబోతోంది. ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్న పుష్ప్ కుమార్ జోషి పదవీ విరమణ చేయబోతున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) సీఎండీ పదవులకు కూడా పీఈఎస్‌బీ సరైన అభ్యర్థులు దొరకలేదని తెలిపింది.

# క్రోమ్‌లో కొత్త సదుపాయం.. ఆండ్రాయిడ్ యూజర్లు ఇక వెబ్ పేజీలు వినొచ్చు



ప్రముఖ సెర్చింజన్ దిగ్గజం గూగుల్ తన క్రోమ్ బ్రౌజర్‌లో కొత్త సదుపాయం తీసుకొచ్చింది. ఆండ్రాయిడ్ యూజర్ల కోసం 'లిజన్ టు దిస్ పేజ్' ఫీచర్‌ను జోడించింది. దీనిద్వారా మీకు నచ్చిన వెబ్ పేజీలోని టెక్స్ట్‌ను ఇక ఆడియో రూపంలో వినొచ్చు. అంటే అచ్చం పాడ్ కాస్ట్‌లా అన్నమాట! ఈ సదుపాయాన్ని ఇప్పటికే గూగుల్ రోల్ అవుట్ చేసింది. త్వరలో అందరికీ అందుబాటులో రానుంది.గూగుల్ తీసుకొచ్చిన ఈ సదుపాయం ప్రస్తుతానికి 12 భాషలకు సపోర్ట్ చేస్తుంది. ఇంగ్లిష్, హిందీ, బెంగాలీతో పాటు అరబిక్, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, ఇండోనేసియన్, జపనీస్, పోర్చుగీస్, రష్యన్, స్పానిష్ భాషల్లో ఆడియోను వినొచ్చు. ఆయా భాషల్లో స్క్రీన్ లాక్ చేసినా ఆడియో కొనసాగుతుంది. ఒకవైపు వింటూనే వేరే ట్యాబ్‌లను సైతం వాడుకోవచ్చు. పెద్ద పెద్ద వ్యాసాలు చదువుకోవడానికి ఈ ఫీచర్ బాగా ఉపయోగపడనుంది. ప్రస్తుతానికి అన్ని వెబ్ పేజీలకు ఈ ఫీచర్ పనిచేయడం లేదు. సపోర్ట్ చేసే పేజీలకు ప్లేబ్యాక్ సదుపాయం కనిపిస్తుంది.కొన్ని నెలల్లో ఐపీఓల సందడి.. రూ.50 వేల కోట్ల సమీకరణ!ఈ ఫీచర్‌ను ఉపయోగించాలంటే మీకు కావాల్సిన వెబ్‌పేజీ ఓపెన్ చేసి పైన కుడివైపు ఉండే త్రీడాట్స్ మెనూ ఓపెన్ చేయాలి. అక్కడ కనిపించే 'లిజన్..' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే పాడ్‌కాస్ట్‌లా వాయిస్ ప్రారంభం అవుతుంది. మ్యూజిక్ ప్లేయర్ తరహాలో పాజ్, రివైండ్, ఫాస్ట్ ఫార్వర్డ్ ఆప్షన్లను వినియోగించుకోవచ్చని గూగుల్ చెబుతోంది. వేగంగా వినాలనుకుంటే ప్లే బ్యాక్ స్పీడ్‌ను మార్చుకోవచ్చు. రూబీ, రివర్, ఫీల్డ్, మోస్ అనే నాలుగు రకాల వాయిస్ టైప్స్ ఉంటాయి. అందులో మీకు నచ్చిన దాన్ని ఎంచుకోవచ్చు.

# ఎస్‌బీఐ అనుబంధ సంస్థల నగదీకరణ



దిల్లీ: ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ పేమెంట్ సర్వీసెస్ వంటి అనుబంధ సంస్థల నగదీకరణ ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ దినేశ్ కుమార్ ఖారా వెల్లడించారు. అయితే వీటిని నగదీకరించే ముందు వాటి కార్యకలాపాలు, వ్యాపారాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకలాపాలు పెరిగితే వాటి విలువ కూడా బాగా పెరుగుతుందని, అప్పుడే మాతృ సంస్థ ఎస్‌బీఐకి మంచి ప్రతిఫలం లభిస్తుందని వెల్లడించారు. క్యాపిటల్ మార్కెట్ల ద్వారా వాటి నగదీకరణ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. నగదీకరణ ప్రక్రియకు తొలుత అర్హత సాధించే సంస్థగా ఎస్‌బీఐ జనరల్ ఉంటుందని, ఆ తర్వాత ఎస్‌బీఐ పేమెంట్ సర్వీసెస్ ఆ జాబితాలో ఉండే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఏ అనుబంధ సంస్థనూ నగదీకరించే ప్రణాళిక తమ వద్ద లేదని వివరించారు.2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లోకి ఎస్‌బీఐ రూ.489.67 కోట్ల అదనపు మూలధనాన్ని చొప్పించింది. అలాగే ఉద్యోగులకు ఇసాప్ రూపంలో షేర్లను కంపెనీ కేటాయించింది. దీంతో బ్యాంక్ వాటా 69.95 శాతం నుంచి 69.11 శాతానికి తగ్గింది. 2024 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ నికర లాభం 30.4 శాతం మేర పెరిగి రూ.240 కోట్లకు చేరింది. ఎస్‌బీఐ జీవితేతర బీమా అనుబంధ సంస్థ రూ.184 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

ఎస్‌బీఐ పేమెంట్ సర్వీసెస్ ప్రై.లి.లో ఎస్‌బీఐకి 74 శాతం వాటా ఉంది. మిగతా వాటా హిటాచీ పేమెంట్ సర్వీసెస్‌కు ఉంది. 2024 మార్చి 31 నాటికి 33.10 లక్షలకు పైగా మర్చంట్ పేమెంట్ యాక్సెప్టెన్స్ టచ్ పాయింట్లను ఎస్‌బీఐ పేమెంట్స్ కలిగి ఉంది. ఇందులో 13.67 లక్షల పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్స్) యంత్రాలు ఉన్నాయి. కంపెనీ నికర లాభం గత ఆర్థిక సంవత్సరంలో రూ.144.36 కోట్లకు తగ్గింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరంలో నికర లాభం రూ.159.34 కోట్లుగా నమోదైంది.

# సూక్ష్మ రుణాలు 27% పెరిగాయ్



ముంబయి: వివిధ ఆర్థిక సంస్థలు ఈ ఏడాది జనవరి-మార్చిలో మంజూరు చేసిన సూక్ష్మ రుణాల మొత్తం, గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 27% అధికమైనట్లు క్రెడిట్ సమాచార కంపెనీ క్రిఫ్ హై మార్క్ వెల్లడించింది. ఇదే సమయంలో రుణ ఎగవేతలూ స్వల్పంగా పెరిగాయని తెలిపింది. హామీ రహిత (అన్‌సెక్యూర్డ్) రుణాలు అధికం కావడంపై, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆందోళనలు వ్యక్తం చేస్తున్న సమయంలో.. రిటైల్ రుణాల్లో హామీలేని వ్యక్తిగత సూక్ష్మ రుణాల వాటా 38 శాతానికి పైగా వృద్ధి చెందినట్లు ఒక నివేదికలో వివరించింది. దీని ప్రకారం..మార్చి త్రైమాసికంలో స్థూల రుణాల జారీ 2023 ఇదే సమయం కంటే 27% పెరిగి రూ.4.42 లక్షల కోట్లకు చేరుకుంది. డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే 8.5% వృద్ధి నమోదైంది. ఈ రుణాల్లో అగ్రగామి-10 రాష్ట్రాల వాటాయే 83.5%. పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తర్ ప్రదేశ్ అత్యంత వేగవంత వృద్ధి నమోదు చేశాయి. 31-180 రోజుల కాల వ్యవధి రుణాల్లో, ఒత్తిడికి గురవుతున్నవి 2023 డిసెంబరులో 2 శాతంగా ఉండగా, మార్చి ఆఖరుకు 2.1 శాతానికి పెరిగింది. తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా ఈ రుణ ఆస్తుల నాణ్యతలో జాతీయ స్థాయిలో అధ్వానంగా ఉంది. తర్వాత కోయంబత్తూర్, మధురై నిలిచాయి. సూక్ష్మ రుణ సంస్థలు గరిష్ఠ ఒత్తిడిని ఎదుర్కొంటున్న మూడు జిల్లాలు తమిళనాడు రాష్ట్రంలోనే ఉన్నాయి. సగటున ఒక్కో ఖాతా బ్యాలెన్స్‌లలో తమిళనాడు జాతీయ స్థాయిలో అగ్ర స్థానంలో ఉంది. ఒక్కో రుణ గ్రహీతకు సగటున రూ.62,200 బకాయి ఉంది. ఒకే వ్యక్తి అధిక రుణాలు కలిగి ఉన్న రాష్ట్రాల్లో కర్ణాటక అగ్ర స్థానంలో ఉంది. 12% మందికి పైగా రుణ గ్రహీతలకు 4, అంతకుమించి రుణాలున్నాయి. సూక్ష్మ రుణ సంస్థల నుంచి రుణాలు పొందిన వారిలో 14.2% మంది యాక్టివ్ రిటైల్ రుణాలు కలిగి ఉన్నారు. ఏడాది క్రితంతో పోలిస్తే (14.9% శాతం) ఇవి తక్కువే.

రిటైల్ విభాగంలో ఆస్తుల తనఖాపై తీసుకునే రుణాలు 41% వృద్ధితో అగ్ర స్థానంలో ఉన్నాయి. తరవాత స్థానంలో హామీలేని సూక్ష్మరుణాల్లో వృద్ధి 38 శాతంగా ఉంది. పసిడి రుణాలు రూ.35,679 కోట్లు (41.2 లక్షల యాక్టివ్ లోన్స్)గా నమోదయ్యాయి. సూక్ష్మ రుణదాతల్లో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎంఎఫ్ఐ విభాగం) 39.2% మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి. తర్వాత బ్యాంకులు 33.2%, చిన్న రుణ బ్యాంక్‌లు 16.9% వాటా కలిగి ఉన్నాయి.

# ఎస్ఈజెడ్‌ల ఎగుమతులు రూ.13.5 లక్షల కోట్లు

దిల్లీ: ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఎస్ఈజెడ్‌ల) నుంచి గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 163.39 బిలియన్ డాలర్ల (సుమారు రూ.13.5 లక్షల కోట్ల) విలువైన ఎగుమతులు నమోదయ్యాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడించాయి. మన దేశం నుంచి మొత్తం ఎగుమతుల విలువ 2022-23తో పోలిస్తే 2023-24లో 3 శాతానికి పైగా తగ్గినా, ఎస్ఈజెడ్‌ల ఎగుమతులు మాత్రం 4 శాతం పెరిగాయని తెలిపాయి. 31 లక్షల మందికి ఉపాధిప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన 423 ఎస్ఈజెడ్‌లలో, ఈ ఏడాది మార్చి 31 నాటికి 280 మాత్రమే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిల్లో 2023 డిసెంబరు 31 నాటికి 5,711 యూనిట్లు ఆమోదం పొంది ఉన్నాయి. ఈ జోన్లలో 2023 డిసెంబరు 31 నాటికి రూ.6.92 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టగా, 30.70 లక్షల మంది ఉద్యోగావకాశాలు పొందారు.ఈ దేశాలకు అధికంయునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి దేశాలకు ఎస్ఈజెడ్‌ల నుంచి అత్యధికంగా ఎగుమతులు జరిగాయి. ఎస్ఈజెడ్‌లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న అనేక చర్యలు (ఎస్ఈజెడ్‌లలో తయారైన ఉత్పత్తులను దేశీయంగా విక్రయించేందుకు సులభతర నిబంధనలు, యూనిట్లకు సత్వర అనుమతులు) తోడ్పాటు అందిస్తున్నాయి.కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఎస్ఈజెడ్‌లలో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్నాయి.2022-23తో పోలిస్తే, 2023-24లో మన దేశం నుంచి వస్తువుల ఎగుమతులు 3.11% తగ్గి 437 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు కూడా 8 శాతానికి పైగా తగ్గి 677.24 బి.డాలర్లుగా నమోదయ్యాయి.

# కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోండిలా..!





కాలేయ వ్యాధుల పట్ల అవగాహన పెంచి మన లివర్ హెల్త్‌ను మెరుగుపరిచేందుకు ఏటా ఏప్రిల్ 19ని వరల్డ్ లివర్‌గా డేగా పాటిస్తుంటారు. శరీరం నుంచి వ్యర్థాలను లివర్ తొలగించి శరీరంలో ఆరోగ్యకర బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను నిర్వహించడంతో పాటు రక్తం గడ్డ కట్టడాన్ని నివారిస్తుందని కొలంబియా యూనివర్సిటీ సర్జరీ డిపార్ట్‌మెంట్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. లివర్ 500కుపైగా భిన్నమైన కీలక విధులను నిర్వర్తించి కష్టపడే అవయవమని అమెరికన్ లివర్ ఫౌండేషన్‌ర వివరించింది. లివర్ కంటే కేవలం మెదడు మాత్రమే అధిక విధులను నిర్వర్తిస్తుంది.

శరీరంలో జీవక్రియలకు సంబంధించిన విధులను లివర్ అధికంగా నిర్వర్తిస్తుండటంతో మనం తీసుకునే ఆహారం లివర్ పనితీరుపై ప్రభావం చూపుతుంది. అధిక షుగర్, వేపుడు పదార్థాలు, మద్యం, ప్రాసెస్ చేసిన మాంసం వంటి ఆహార పదార్థాలు అధికంగా తీసుకుంటే లివర్ ఆరోగ్యం దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి ఆహారం అతిగా తీసుకుంటే ఫ్యాటీ లివర్ వ్యాధి బారినపడే ముప్పు ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

చక్కెరతో కూడిన పానీయాలను అధికంగా తీసుకుంటే కాలేయంపై భారం తీవ్రమవతుందని, ఆపై కొవ్వును అది నిల్వ చేసుకునే క్రమంలో నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ (ఎన్‌ఏఎఫ్‌ఎల్‌డీ) బారినపడే అవకాశం ఉందని యోగ, లైఫ్‌స్టైల్ నిపుణులు నమిత చంద్ర చెబుతున్నారు. అతిగా ఏం తీసుకున్నా చివరికి గ్లూకోజ్ అయినా ఫ్యాటీ లివర్‌కు కారణమవుతుందని, మరో రకమైన చక్కెర ఫ్రక్టోజ్ కూడా పలు కారణాలతో లివర్‌కు హానికారకమేని అన్నారు. ఆహారపదార్థాలకు రుచి పెంచే ఫ్రక్టోజ్‌తో మరింత ముప్పు ఉంటుందని చెప్పారు. ఇక పండ్లలోనూ ఫ్రక్టోజ్ ఉండటంతో వీటిని పరిమితంగా తీసుకుంటే మేలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రాసెస్డ్ ఫుడ్స్, వేపుళ్లు, షుగర్ డ్రింక్స్‌కు దూరంగా ఉంటూ మాంసం, మద్యం వంటివి మితంగా తీసుకుంటూ కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నమిత సూచించారు.

# కండ్లు పొడిబారుతున్నాయా?

కండ్లలో నీళ్లు ఉత్పత్తి కానప్పుడు, ఊరిన నీళ్లు వెంటనే ఆవిరైపోయి తగినంత తడి లేనప్పుడు మనకు కండ్లు పొడిబారే సమస్య ఏర్పడుతుంది. చాలామందిలో కనిపించే ఈ సమస్య కొన్నిసార్లు రోజువారీ పనులకు ఇబ్బందికరంగా మారుతుంది. దీని కారణంగా కండ్లలో మంట, ఎర్రబారడం, కాంతిని తట్టుకోలేకపోవడం, గరగరగా ఉండటం లాంటివి సంభవిస్తాయి. వాతావరణ పరిస్థితులు, ఎక్కువ సమయంపాటు స్క్రీన్లకు అతుక్కుపోవడం, ఇతర ఆరోగ్య సమస్యలు%ౌ% ఎలా వచ్చినాసరే డ్రై ఐస్‌కు తగిన చికిత్స తీసుకోవాలి. అయితే, కొన్ని ఉపశమన చర్యల ద్వారా ఈ సమస్యను నివారించవచ్చు.



తగినన్ని నీళ్లు: శరీర ఆరోగ్యానికి తగినన్ని నీళ్లు తాగడం చాలా అవసరం. రోజులో తగిన మోతాదులో నీళ్లు తాగుతూ ఉంటే కన్నీళ్ల ఉత్పత్తికి సహకరిస్తుంది. అలా కండ్లు పొడిబారడాన్ని నివారించవచ్చు.

కంటిచుక్కలు: మందుల దుకాణాల్లో దొరికే ఐ డ్రాప్స్ కండ్లలో తగినంత తడిని ఉంచి పొడిబారకుండా చూస్తాయి. అయితే వీటిలో ప్రిజర్వేటివ్స్ లేనివాటిని ఎంచుకోవాలి. ప్యాక్‌మీదున్న సూచనలు పాటించాలి.

రెప్పలు వాల్చడం: ఎక్కువసేపు డిజిటల్ తెరలకు అతుక్కుపోవడంతో రెప్పలు వాల్చడం తగ్గిపోతుంది. దీంతో కండ్లు పొడిబారిపోతాయి. కాబట్టి, కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలను చూస్తున్నప్పుడు తరచుగా రెప్పలు కొడుతూ ఉండాలి.

తెరలకు దూరంగా: కండ్ల మీద ఒత్తిడి తగ్గడానికి, పొడిబారకుండా ఉండటానికి తెరలకు ఎక్కువసేపు అంటుకుపోకూడదు. దీనికోసం 20 20 20 నియమం అనుసరించాలి. ప్రతి ఇరవై నిమిషాలకోసారి 20 సెకండ్లు బ్రేక్ తీసుకోవాలి. ఈ సమయంలో 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువుమీద దృష్టి సారించాలి.

హ్యుమిడిఫయర్ వాడటం: గదుల్లో ఫ్యాన్ల నుంచి వీచే గాలి కండ్లను పొడిబారుస్తుంది. హ్యుమిడిఫయర్లను వాడటం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.

దుమ్మునుంచి రక్షణ: బయటికి వెళ్లినప్పుడు గాలి, దుమ్ము, ఎండ నుంచి కండ్లను కాపాడుకోవడానికి సన్‌గ్లాసెస్ లేదా గాగుల్స్ వాడటం మంచిది.

మంచి ఆహారం: ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే సాల్మన్ చేపలు, అవిసెగింజలు, వాల్‌నట్స్ లాంటివి ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇవి కండ్లలో మంటను తగ్గిస్తాయి. కన్నీటి నాణ్యతను పెంచుతాయి. అదనంగా విటమిన్ ఎ, సి, ఇ తగిన మోతాదులో ఉన్న ఆహారం తీసుకోవాలి.

ఎన్ని రక్షణ చర్యలు చేపట్టినా ఇబ్బంది అలానే ఉంటే కంటి వైద్యుణ్ని సంప్రదించాలి. కండ్లు పొడిబారడానికి కారణం తెలుసుకుని తగిన చికిత్స తీసుకోవాలి.

# కాలేయాన్ని కాపాడుకునేందుకు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

లివర్ సంబంధిత వ్యాధుల గురించి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 19వ తేదీ "వరల్డ్ లివర్ డే" గా జరుపుకుంటున్నాం. ఈ మేరకు లివర్ వ్యాధుల తీవ్రత గురించి అందరికీ అవగాహన కల్పించే ఉద్దేశంతో "లివర్ క్యాన్సర్ పరిణామాలు.. చికిత్సా విధానాలు.. అధునాతన వైద్యం" గురించి తెలుసుకుందాం అని చెబుతున్న రెనోవా %-% ఎన్ ఐ జి యల్ హాస్పిటల్స్ కు చెందిన డైరక్టర్ %ు% సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్. ఆర్.వి. రాఘవేంద్ర రావు గారు వివరించారు. అవేంటో ఆయన మాటల్లోనే..



1. లివర్ సర్జరీ (హెపటెక్టమీ):

ఈ అత్యున్నత సున్నితమైన శస్త్ర చికిత్స (హెపటెక్టమీ) ద్వారా క్యాన్సర్ సోకిన లివర్ భాగాన్ని తొలగించడం జరుగుతుంది. క్యాన్సర్‌ను పూర్తిగా నిర్మూలించడంలో ఈ హెపటెక్టమీ అనేది ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత కాలంలో ఈ ఆపరేషన్‌ను లాపరోస్కోపి, రొబోటిక్ అసిస్టెడ్ విధానాల ద్వారా చేయడానికి వీలవుతుంది. తద్వారా ఆపరేషన్ మెరుగ్గా చేయగలగడమే కాకుండా తొందరగా రోగి రికవరీ అవ్వడానికి కూడా ఈ విధానాలు దోహదపడుతాయి.

2. లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్:

లివర్ క్యాన్సర్ బాగా ముదిరిన దశలో ఉన్నప్పుడు లేదా క్యాన్సర్‌తో పాటుగా లివర్ సిర్రోసిస్ బాగా ముదిరిన దశలో ఉన్నప్పుడు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తారు. ఈ పద్ధతిలో చెడిపోయిన కాలేయాన్ని పూర్తిగా తొలగించి కొత్త కాలేయాన్ని అమర్చడం జరుగుతుంది. ఇందుకు ఆరోగ్యవంతమైన కాలేయాన్ని బ్రెయిన్ డెడ్ (కాడెవర్ లివర్ %-% డీడీఎల్‌టీ) అయిన వ్యక్తి నుంచి లేదా కుటుంబ సభ్యుల నుంచి (లివింగ్ డోనార్ %-% ఎల్ డి ఎల్ టి) ద్వారా పొందడానికి అవకాశం ఉంటుంది. అయితే ఈ విధానంలో అనేక సాధక బాధకాల్ని అధిగమించవలసిన అవసరం ఉంటుంది.

3. కీహోల్ ఆపరేషన్స్:

కొన్ని సందర్భాలలో ఈ క్లిష్టమైన హెపటెక్టమీ ఆపరేషన్స్‌ను తేలికపాటి లాపరోస్కోపి, రొబోటిక్ విధానాల ద్వారా చేయడానికి వీలవుతుంది. తద్వారా రోగి రికవరీని సుగమం చేయడమే కాకుండా ఆపరేషన్ చేసిన ప్రాంతంలో గాటు గాని మచ్చ గాని లేకుండా ఆపరేషన్ పూర్తి చేయడానికి వీలవుతుంది.

4. క్యాన్సర్ మందుల వాడకం:

ఆధునిక రీసెర్చ్ ద్వారా అందుబాటులోకి వచ్చిన పరిజ్ఞానంతో లివర్ క్యాన్సర్‌ను కొన్ని మందుల వాడకం ద్వారా నిర్వీర్యం చేయడానికి వీలవుతుంది. ఇందులో ప్రముఖంగా టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీల ద్వారా శరీరం రోగ నిరోధక శక్తిని వినియోగించుకుంటూ లివర్ క్యాన్సర్ తీవ్రతను, వ్యాప్తిని అరికట్టడానికి అలాగే క్యాన్సర్ దశని తగ్గించడానికి వీలవుతుంది.

5. టీం వర్క్:

లివర్ క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన రోగాల్ని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో అన్ని రంగాలు కలిసి పనిచేయడం చాలా ముఖ్యం. ఇందులో ప్రతి రోగిని అంకాలజిస్టు, హెపాటాలజిస్ట్, సర్జన్ అలాగే ఇతర రంగాల నిపుణులు పరిశీలించి విశ్లేషణ చేయడం ద్వారా రోగి పరిస్థితి, క్యాన్సర్ తీవ్రత, క్యాన్సర్ దశ లాంటి అనేక విషయాలను పరిగణలోకి తీసుకుంటూ మల్టీ డిసిప్లినరీ విధానాల ద్వారా క్యాన్సర్‌పై పై చేయి పొందడానికి వీలవుతుంది.

6. సవాలు:

ఇంత ఆధునిక పురోగతి జరిగినప్పటికీ కూడా లివర్ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం అనేది ఇంకా ఒక్క సవాలుగానే ఉన్నది. అదే విధంగా క్యాన్సర్‌ను కలుగజేసే హెపటైటిస్ %దీ%, హెపటైటిస్ %జ% వైరస్ ల నియంత్రణ కూడా ఇంకా పూర్తిస్థాయిలో జరగాల్సి ఉన్నది. అయితే నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తూ ఆధునిక శస్త్ర చికిత్సలు అవలంబిస్తూ సమాజంలో లివర్ క్యాన్సర్ పైన దానికి అందుబాటులో ఉన్నటువంటి చికిత్స విధానాల పైన అవగాహన కల్పిస్తూ మరింత పురోగతి పొందడానికి అవకాశం ఉంది.

7. జాగ్రత్తలు:

అనేక రకాల లివర్ సమస్యలను క్రమబద్ధమైన జీవన సరళి, చక్కటి ఆహారపు అలవాట్లతో నివారించవచ్చు. మద్యపానానికి దూరంగా ఉండటం, హెపటైటిస్ వ్యాక్సిన్ తీసుకోవటం ద్వారా లివర్ వ్యాధులను నివారించుకోవచ్చు.

# కీలు మార్పిడితో కొత్త జీవితం

శరీర అవయవాల కదలికలకు కీళ్ల ఆరోగ్యమే కీలకం. కానీ, మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ఆర్థరైటిస్ వంటి కారణాల వల్ల కీళ్లనొప్పులతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల క్రమేణా పెరుగుతున్నది. దీంతో చిన్న చిన్న పనులు చేసుకోవడంలోనూ శరీరం సహకరించని పరిస్థితి దాపురిస్తున్నది. తీవ్రమైన కీళ్లనొప్పులతో శారీరకంగా, మానసికంగా అంతులేని బాధ అనుభవించాల్సిన దుస్థితి నెలకొంటున్నది. అయితే, వైద్య శాస్త్ర రంగంలో అభివృద్ధి కారణంగా ఇప్పుడు కీళ్ల దెబ్బతిన్న వాళ్ళు తమ జీవనయాత్రలో రాజీపడాల్సిన అవసరం ఎంతమాత్రమూ లేదు. కీలు మార్పిడి చేయించుకుని సాధారణ జీవితం గడిపేయవచ్చు. కీళ్లనొప్పులతో బాధపడుతూ మందులతో సరిపెట్టుకునే వాళ్లతో పోలిస్తే, కీలు మార్పిడి చేయించుకున్న వాళ్లు 90 శాతం మెరుగైన జీవితం గడుపుతున్నట్టు ఇటీవల ఓ అంతర్జాతీయ అధ్యయనం వెల్లడించింది.



మోకాళ్లు, తొడలు, భుజాలు తదితర ప్రదేశాలలో రెండు ఎముకలు ఒకదానిపై మరొకటి ఆధారపడి ఆ శరీర భాగంలో కదలికకు తోడ్పడే ఏర్పాటే కీలు. సాధారణంగా ఆర్థోపెడిక్ సర్జన్లే ఈ కీలు మార్పిడి శస్త్రచికిత్సను నిర్వహిస్తారు. నొప్పిని నివారించి, సాధారణ జీవితం గడిపేందుకు కీలు మార్పిడి చేయించుకోవలసిందిగా డాక్టర్లు సిఫారసు చేస్తారు. కీలు మార్పిడి శస్త్రచికిత్స అంటే దెబ్బతిన్న, పనిచేయలేని స్థితికి చేరిన కీలును తొలగించి దాని స్థానంలో కొత్తదైన కృత్రిమ కీలును అమర్చడమే. ఈ సర్జరీలో కొన్నిసార్లు కీలు మొత్తాన్ని కాకుండా దానిలో దెబ్బతిన్న కొంతభాగాన్ని మాత్రమే తొలగిస్తారు.

కీళ్లనొప్పుల సమస్య పరిష్కారానికి డాక్టర్లు సిఫారసు చేసే చిట్టచివరి చికిత్స కీలు మార్పిడి శస్త్రచికిత్స. మందులు, ఫిజియోథెరపీ వల్ల ప్రయోజనం కనిపించని పరిస్థితులలోనే డాక్టర్లు కీలు మార్పిడిని సూచిస్తారు. తీవ్రమైన ఆర్థరైటిస్, కీళ్లనొప్పులు, అంగవైకల్యాన్ని సరిచేయటానికి సంబంధించి కీలు మార్పిడి చాలా ప్రభావవంతమైన, కచ్చితమైన పరిష్కారం. చాలా సందర్భాలలో ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ కారణంగానే వ్యక్తి కీళ్లు పనిచేయలేని పరిస్థితికి చేరుకుంటాయి. భరించ శక్యం కాని కీళ్లనొప్పులు, కీళ్లు బిగుసుకుపోవడం, కుంటడం, కదలిక బాగా తగ్గిన వాళ్లకు కూడా డాక్టర్లు కీలు మార్పిడిని సిఫారసు చేస్తుంటారు.

కీళ్ల దెబ్బతిన్న స్థాయి తీవ్రతను బట్టి నడక, నిలబడటం, చెప్పులు వేసుకోవటం, మెట్లెక్కటం వంటి రోజువారీ పనుల్లో రోగులు ఇబ్బందిపడుతుంటారు. ఇలాంటివారికి దెబ్బతిన్న మృదులాస్థిని, ఎముకను మార్చివేసే కీలు కదలికను పునరుద్ధరించే విధంగా కీలు మార్పిడి సర్జరీ చేస్తారు. దీనిలో దెబ్బతిన్న కీలును సరిచేస్తూ అక్కడి కండరాలు, లిగ్మెంట్స్ అందుకు సహాయపడేలా చేస్తారు. కీలును ఎక్రిలిక్ సిమెంటుతో ఎముకకు అతికిస్తారు లేదా నొక్కి ఎముకకు బిగిస్తారు. ఇలా నొక్కి ఉంచటం వల్ల ఇన్‌ప్లాంట్ చుట్టూతా ఎముక అభివృద్ధి చెందుతుంది.

# ఈ తలనొప్పి ప్రమాదకరమా?

మా బాబు వయసు 10 సంవత్సరాలు. రెండు మూడు నెలలుగా తలనొప్పి అంటున్నాడు. వైద్యులను సంప్రదిస్తే పరీక్షలు చేసి, అంతా బాగానే ఉందని చెప్పారు. చదవడం ఇష్టంలేక అలా అంటున్నాడేమోనని అనుమానంగా ఉంది. బాగా చదవట్లేదనే కంప్లయింట్ ఉపాధ్యాయుల నుంచి కూడా రాలేదు. ముందునుంచీ బాగానేచదువుతాడు. ఈ మధ్య తరచూ తలనొప్పి అంటుంటే ఆందోళనగా ఉంది. ఈ తలనొప్పి ప్రమాదకరమా? సమాధానమివ్వండి.

మీ పిల్లవాడికి వైద్య పరీక్షలు చేయించామని చెప్పారు. కానీ, ఎలాంటి పరీక్షలు చేయించారనేది తెలపలేదు. పిల్లల్లో తలనొప్పి రావడం సహజం. కానీ, అది ప్రమాదకరమైనదా.. కాదా అనేది తెలియాలంటే పిల్లల్లో ఎలాంటి లక్షణాలు ఉన్నాయో గ్రహించాల్సి ఉంటుంది. తలనొప్పితోపాటు వాంతులు, ప్రవర్తనలో మార్పులు, ఎప్పుడూ పడుకొని ఉండటం, పనులు శ్రద్ధగా చేయకపోవడం, ఫిట్స్ రావడం వంటివి ప్రమాదాన్ని సూచించే లక్షణాలు. పీడియాట్రీషియన్ సమక్షంలో కంటిచూపునకు సంబంధించిన పరీక్షలు చేయాలి. కళ్లద్దాలు అవసరమో, కాదో చూసుకోవాలి. మెదడు పనితీరు, నరాల పనితీరు, నాడీ కణాల పనితీరుకు సంబంధించిన పరీక్షలు చేయాలి.

మెదడులో ఏదైనా కణితి ఉంటే తీవ్రమైన తలనొప్పి ఉంటుంది. అంతేకాకుండా మీ కుటుంబంలో ఎవరికైనా పార్శ్వనొప్పి ఉందా.. లేదా అనే విషయం కూడా మీరు చెప్పలేదు. అలాంటిదేమైనా ఉంటే పిల్లలకు కూడా మైగ్రెయిన్ రావొచ్చు. ఈరోజుల్లో చాలామంది పిల్లలు ఎక్కువసేపు ఫోన్, ట్యాబ్లెట్, టీవీలతోనే గడుపుతున్నారు. వీటి ప్రభావం వల్ల తలనొప్పి, కళ్ల నుంచి నీరు రావడం, చూపు మందగించడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముందుగా పీడియాట్రిక్ న్యూరాలజిస్టును సంప్రదించడం మంచిది. బ్రెయిన్ ట్యూమర్ అని ముందే ఊహించుకొని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అవసరమైతే పీడియాట్రిక్ ఆఫ్తాల్మాలజిస్టును సంప్రదించి, సమస్య గురించి తెలిసిన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.



Printed and Published by Kesaram Penta Reddy on behalf of Bharatha Sakthi Publications Pvt Ltd, Printed at Bharatha Sakthi Publications Pvt Ltd, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar, RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar, Ranga Reddy(Dist), Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy